Website : www.saisadguruvani.org

'దత్త జయంతి' ప్రత్యేక సంచిక



శ్రీ భరద్వాజ

# సద్గురువాణి



అక్టోబర్, నవంబర్, డిసెంబర్ - 2016

సంపుటి - 16

సంచిక - 4



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం

## (2016 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ లో నిర్వహించిన కార్యక్రమాలు)



ఈ పేజీ సమర్పించిన వారు :

**శ్రీమతి & శ్రీ డి. వామాక్షి, వీరభద్రరావు**

గుజరాతీపేట, శ్రీకాకుళం

పూర్తి వివరములకు 22వ పేజీ చూడగలరు

శ్రీ భరద్వాజ
# సద్గురువాణి




సంపుటి - 16 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2016 సంచిక - 4

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

"దత్త జయంతి" ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**




"దిగంబరా దిగంబరా శ్రీ పాదవల్లభ దిగంబరా
దిగంబరా దిగంబరా అవధూతచింతన దిగంబరా"

## విషయ సూచిక


1. ఆధ్యాత్మిక సేవలో చిత్రమాలిక ................ లోపలి కవర్ పేజీ
2. విషయసూచిక ................ 1
3. మా మాట ................ 2
4. విశ్వరూప సందర్శనం ................ 4
5. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ................ 5
6. ఒక్క క్షణం ................ 7
7. పండుగలు - పర్వదినాలు ................ 8
8. శ్రీగురు చరితామృతము ................ 9
9. గురుదేవులు ................ 11
10. మార్గం చూపిన మాస్టారు ................ 12
11. జిజ్ఞాస ................ 13
12. తమసోమ జ్యోతిర్గమయ ................ 14
13. పూర్ణ అంతరంగాలు ................ 15
14. శపథం ................ 18
15. శ్రీ దత్త సాంప్రదాయం ................ 19
16. అవధూత లక్షణం ................ 20
17. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ................ 21
18. మేము సహితం ................ 23
19. జన్మదిన శుభాకాంక్షలు ................ 24
20. శ్రీ ధునివాలా దాదా ................ 27
21. అవధూత శ్రీ పూండీ స్వామి ................ 28
22. మాస్టారు చూపిన మహాత్ములు ................ 29
23. శ్రీ ఉపాసనీ బాబా ................ 31
24. శ్రీ రామ భక్త రంగన్నబాబు ................ 32
25. తెలుసుకుందాం ................ 33
26. శ్రీ దత్తాత్రేయ వజ్రకవచం ................ 34
27. శ్రీ దత్తజయంతి ................ 35
28. సబ్‌కా మాలిక్ ఏక్‌హై ................ 36
29. మన గమ్యం ................ 37
30. అవధూత శ్రీ నాంపల్లి బాబా ................ 38
31. నేను ఎవడను ................ 39
32. ఏరిన ముత్యాలు ................ 40


## చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - రూ॥ | 40/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 100/- |
| 6 సం॥ల చందా | - రూ॥ | 200/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

206/ఎ, సెక్టారు నెం. 8, ఉక్కునగరం,
విశాఖపట్నం - 530 032.
ఫోన్ : 0891 - 2510817
సెల్ : 9849645224, 9490812114

E-mail : sadguruvani@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**








## మా మాట


### పాఠకులకు, రచయిత(త్రు)లకు, ప్రకటనకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు

మానవ జన్మ సార్థకత కావాలి అంటే నాలుగు సమకూడాలి, ఉత్తముడైన గురువు లభించాలి, ఆ గురువును సేవించుకునే అవకాశం కలగాలి, చేసిన సేవకు గురువు సంప్రీతుడవ్వాలి, సంప్రీతుడయిన గురువు పూర్వజన్మ సంస్కారాలను అనుసరించి ఉత్తమమైన సాధనా మార్గం బోధించాలి. ఈ నాలుగు సమకూడిన నాడు మానవ జన్మకు సార్థకత చేకూరుతుంది. నేటి కలిప్రభావానికిలోనైన జనులు ఉత్తమ గురువును గుర్తించలేరని భావించే, దత్తాత్రేయుడు శ్రీ శిరిడీసాయినాధుడి రూపంలో అవతరించి, అనేక మిషలమీద కార్యకారణ సంబంధంగా తన వద్దకు లాగి, కోరికలు నెరవేర్చి, కష్టాలు తొలగించి, జిజ్ఞాసువులుగా మారిన వారిని, జ్ఞానవంతులుగా, తన స్వరూపులుగా మారుస్తున్నారు సాయిబాబా. కుల, మత, వర్ణాల, భేదాలు లేకుండా సర్వులను ఉద్ధరించే అవతారమూర్తి శ్రీ శిరిడీసాయిబాబా. నేడు ప్రపంచమంతా ఎదురుచూస్తున్న ఆధ్యాత్మిక చక్రవర్తి శ్రీ సాయిబాబా. అటువంటి జగద్గురువు మనకు లభించారు. అయితే అంతటితో సరిపోదు లభించిన "సద్గురువు గురించి తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు, పిడకలు ఏరుకోవటానికా?" అన్నారు బాబా, "సద్గురువు గురించి ధ్యాస లేకుండా గడిపిన ప్రతిక్షణము మృత్యువును పేనే తాళ్ళు" అన్నారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ. సద్గురువు గురించి పారాయణ చేస్తాము, పాటలు పాడుతాము, భజన చేస్తాము, దేవాలయానికి వెళ్ళి నామం ఉచ్చరిస్తూ ప్రదక్షిణలు చేస్తాము, నామలిఖితం చేస్తాము అంటారు, అయితే అంతమాత్రాన గురువు గురించి తెలుస్తుందా! మనము చేసే ప్రతి పని ఏదో ఒకటి ఆశించే చేస్తాము. మన ఆశలను నెరవేర్చటానికే దారంకట్టి తన దగ్గరకు లాగుతానని సాయి కూడ తెలియచేశారు. అట్లా నేటికీ, కోటాను కోట్ల మందిని తనవద్దకు లాగుతూనే ఉన్నారు బాబా. అయితే ప్రతిజీవిని సాయి తన చెంతకు చేర్చుకునే మిషవేరు, మనం ఆయన దగ్గరకు చేరే మిషవేరు. మనం తాత్కాలికమైన సుఖ సంతోషాలకోసం ప్రాకులాడుతుంటే, శ్రేయస్కరమైన ఆనందం ప్రసాదించే మిషతో సాయి తన చెంతకు లాగుతున్నారు. మనకు ఎన్ని ప్రసాదించినా ఇంకా అడిగేస్థితిలోనే సాయి చెంతకు చేరుతున్నాము కాని జీవితాన్ని సార్థకత చెందించుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు, అందుకు "నా సహాయమును గాని, సలహాను గాని కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను" అన్న సాయిసూక్తిని కూడా హృదయగతం చేసుకోలేకపోతున్నాము. కారణం అరిషడ్వర్గాలు అనే నిండు కుండలతో వారి చెంతకు చేరుతున్నాము. కనుక వాటిని తొలగించుకోనిదే సాయి అభయంలోని భావంతో మన హృదయం నిండదు. అంతవరకు జీవితం సార్థకము చేసుకోలేము. అందుకే సాయి "ముందు వాడాలోని దొంగలను గమనించ"మని విజయానందుడి ద్వారా మనల్ని హెచ్చరించింది. వాటిని గుర్తించి, సాయి అభయమనే కరవాళముతో వాటిని దునుమాడి, మన మనస్సుపై విజయం సాధించటమే "విజయదశమి". విజయదశమికి, అటు దైవపరంగాను ఇటు గురుపరంగాను ఒక ప్రత్యేకత ఉంది. విజయదశమి అంటే దసరా సరదాల పండుగ. బంధుమిత్రుల కలయికలు, పిండివంటల ఘుమ ఘుమలు ఒకవైపు, మాంస, మద్యాల మత్తు ఇంకొకవైపు, ఎందుకంటే తమోగుణ ప్రధానమైన లోకకంటకుడైన రాక్షసుడు సంహరించబడ్డాడు, ఇక కష్టాలు, నష్టాలు, బాధలు లేవు, వాటిపై విజయం సాధించాం, ఇక అంతా ఆనందమే, అయితే పండుగలు, పర్వదినాలలోని అంతరార్థము, వాటి అసలైన ఆచరణా విధానాన్ని మరచిపోయి, సుఖమయ ఆనంద మత్తులో ఉన్నవారిని మేల్కొలిపి, జ్ఞాన మార్గంవైపు పయనింపచేయటానికి మరల సృష్టి అంతటా వ్యాపించి ఉన్నశక్తి, సాయి రూపంలో అవతరించింది, "శాస్త్రాలు ఎన్నటికీ అబద్ధంకాదు, మంత్రాలు ఎన్నటికీ అబద్ధం కాదు, పనికిరాని అన్వయాన్ని నీ బుర్రలో పెట్టుకున్నావు" అని వాటి నిజతత్వాన్ని ఎరుక పరచి, పండుగ రోజు మాత్రం ఆనందంగా, సరదాగా గడపటానికి ప్రయత్నంచేస్తూ, మిగిలిన జీవితం బాధలతో, వెతలతో గడపటం కాదు, నిరంతరం జీవులందరూ ఆనందంతో జీవించటానికి, రాచమార్గం ఏర్పాటుచేయటమే సచ్చిదానంద (సత్, చిత్, ఆనంద) స్వరూపుడయిన శ్రీసాయి అవతార లక్ష్యం. ఆనందం ఎక్కడో లేదు, అది నీలోనే ఉంది, నిరంతరం నీతోనే ఉంది. కోరికల సాలెగూడులో చిక్కుకొని, విలవిల లాడుతున్నావు, "కావాలనే కోరిక విడచి సర్వగతుడైన భగవంతుడిమీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు, నీ భారములు నాపై పడవేసి నీవు నిశ్చింతగా కూర్చో, అవసరమయినదంతా నేను చేస్తాను, అయితే అందుకు ముందుగా నీ శరీరమనే సత్రంలో అరిషడ్వర్గాలు అనే శత్రువులను సంహరించు, అప్పుడు నీకు నాకు భేదమనే అడ్డుగోడ తొలగుతుంది. అప్పుడు శిరిడీలోనే కాదు సప్త సముద్రాల అవతల ఉన్నా నేను నీవెంట ఉన్నాను అనే అనుభవం కలుగుతుంది నీకు" అని చెప్పటమే కాక, అర్హులైన వారికి ప్రత్యక్ష అనుభవం కూడ ఇచ్చిన సంగతి, సాయిచరిత్ర పరిశీలించిచూస్తే తెలుస్తుంది. కనుక సాయి మనచెంత లేరు, మనగోడు ఆలకించుకోడు అనే

భావనను తొలగించటానికే, తాను సమాధిచెందుతూ "నా నామం పలుకుతుంది, నా మట్టి సమాధానమిస్తుంది, నా సమాధి మీకు జవాబిస్తుంది" అని పలికి, దసరా నాడు విశ్వచైతన్యంలో నిలచారు శ్రీ శిరిడీ సాయినాధుడు. నవరాత్రులు ప్రారంభమయినాయి, అంటే మనలోని రాగ, ద్వేష, అసూయ, మమకారాలు అనే తమోగుణ ప్రధానమైన రాక్షస గుణాలను గుర్తించి తొలగించుకునే ప్రయత్నానికి సమయం ఆసన్నమైనదని గుర్తెరిగి, దాని కనుగుణంగా మసలుకుంటే విజయం వరించినట్లే, అప్పుడు ఇక మనది అంటూ ఏది ఉండదు, అన్నిటా సాయినే, అంతటా సాయినే, విశ్వరూపుడైన సాయి నిజతత్వమెరిగి జీవించటమే సాయికి దక్షిణ సమర్పింటమంటే. ఇక దసరా ఒక సరదా కాదు, ఒక బాధ్యత, మనకోసం మనపైన అవాజ్యమైన ప్రేమతో, భౌతికదేహం వీడిన సాయి నిజతత్వం ఎరుక గలిగి జీవించటం. ఆర్తులు, అర్ధార్ధుల స్థితిని దాటి జిజ్ఞాసువులుగా మారటం. అటువంటివారికోసం సాయి అందించిన అద్భుతమైన మార్గం "శ్రీగురుచరిత్ర" పారాయణ. హరివినాయక సాఠె, అన్నాసాహెబ్ ధబోల్కర్ వంటివారికి శ్రీ సాయి దర్శనం, అనుగ్రహం లభించటానికి శ్రీగురుచరిత్ర పారాయణే కారణమయింది, కుశాభావు అనే ఉపాధ్యాయుడి చేత 108 సార్లు శ్రీగురుచరిత్ర పారాయణ చేయించి తన సంపూర్ణ అనుగ్రహం అందించారు సాయి. గంగిఘిర్ వంటి మహాత్ముడు, "పేడకుప్పలాంటి శిరిడీ గ్రామానికి కోహినూర్ వజ్రంలాంటి సాయి లభించారు" అని చెప్పినా, ఇంకెందరో మహాత్ములు సాయి తమకంటే అధికుడని, తాము మేకలు కాచేవారము అయితే, సాయి పులులను కాచేవారు అని చెప్పటమే కాకుండా, తమ శిష్యులను సాయి దగ్గరకు పంపిన వారెందరో కలరు. అయినా సాయి సామాన్యమైన వ్యక్తి లాగానే జీవించారు. జగద్గురువని తన ఆచరణ ద్వారా తెలియజేస్తూ, అవసరమైనచోట భగవద్గీతలోని ఒకటి రెండు శ్లోకాల అంతరార్ధము వివరించినా, అది అర్ధంచేసుకొని ఆచరించినవారు అరుదు, అంతేకాక గురువు, గురుతత్వం, గురుసేవ గురించి, పురాణోపాఖ్యానాల సహాయంతో వివరిస్తూ, మన సనాతన ధర్మమంతటికీ మూలమైన ఉపనిషత్తుల, అష్టాదశ పురాణాల, బ్రహ్మసూత్రాల, భగవద్గీతల సారమయిన "శ్రీగురుచరిత్ర" పారాయణ ద్వారా తెలుసుకోమని, జిజ్ఞాసులైన వారికి సూచించారు శ్రీ సాయి. శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా సాయి నిజతత్వమెరిగి, జీవించడం జరుగుతుంది. అట్లా జరిగిననాడు సకల జనావళిని ఉద్ధరించాలనే మిషతో భువిపై అవతరించిన త్రిమూర్తి స్వరూపుడయిన దత్తాత్రేయుడు, మనకు దత్తమై మానవజన్మకు సార్ధకత చేకూరుస్తాడు. దాని పారాయణ వలన పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు సాయి విశ్వతత్వాన్ని అవగతం చేసుకొని, దత్త సాయి సంప్రదాయములోని అత్యంత ప్రాముఖ్యత వహించిన అవధూత తత్వాన్ని, తాను ఎరిగి, దత్తానుగ్రహంతో సాయిస్వరూపులయిన ఎందరో అవధూతలను, మహాత్ములను తాను దర్శించటమే కాక, భక్త జనావళికి వారి దర్శన భాగ్యం లభింపచేశారు. వారు చూపిన మార్గంలో పయనం చేయటానికి చేసే ప్రయత్నంగానే, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ ద్వారా వెలువడే "శ్రీ భరద్వాజ సద్గురువాణి" తన వంతు కర్తవ్యంగా, దత్తావతారుల, అవధూతల, మహాత్ముల జీవిత బోధలను అందించటానికి ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఈ సంచికను, "దత్తజయంతి ప్రత్యేక సంచికగా" మీ ముందుంచుతున్నాము. దత్త స్వరూపుడయిన సాయిని ఆశ్రయించి, సేవించి, సంపూర్ణమైన కృప అందరూ పొందాలని, మాకు వీలయినంతవరకు దత్తాత్రేయ తత్వాన్ని అనేక విధాలుగా అందించటానికి సముద్రంలో నీటి బిందువు అంత మా ప్రయత్నం చేశాము. ప్రయత్నంలో లోపముంటే మాది, అనుమతిచ్చి అనుగ్రహించిన మహిమ శ్రీ దత్త సాయి భరద్వాజులది. ప్రయత్నం మాది, పయనం మీది, అనుగ్రహం ప్రసాదించేది సాయి.

సద్గురువును తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో అవరోధాలుగా నిలచిన మానసికమైన రుగ్మతలను జయించడమే నిజమైన విజయదశమి. కోరికల చిలుము పట్టిన, హృదయమనే ప్రమిదను శుభ్రంచేసి, సిద్ధం చేసి, భక్తి శ్రద్ధలనే వత్తులను వేసి, మన అహంకారమనే నూనెను అందులోపోసి, అఖండజ్యోతి స్వరూపుడయిన "సాయి" అనే జ్ఞానజ్యోతితో వెలిగిస్తే, మన హృదయమందిర మంతా సద్గురుజ్యోతితో వెలుగుతూ మార్గము సుగమము అవుతుంది.. మాస్టారు చూపిన ఆ మార్గంలో పయనంచేస్తూ, మనం పొందిన సద్గురు అనుభవాల, అనుభూతుల జ్యోతులతో అందరి హృదయాలను ప్రకాశింపచేయటమే "దీపావళి". ఆ వెలుగు కలిసి సాగటమే మాస్టారి జన్మదిన సందర్భముగా మనమిచ్చే దక్షిణ కావాలి, హృదయజ్యోతి కొడిగట్టకుండా, కొండెక్కకుండా నిరంతరం సద్గ్రంధ పారాయణ, సత్సంగం, సజ్జన సాంగత్యముతో, సత్‌ప్రవర్తన, సత్‌శీల్యముతో, జీవనం కొనసాగిస్తే జగద్గురువు మనకు దత్తమవుతారు. అదే "దత్తజయంతి".

శ్రీ భరద్వాజ సద్గురువాణి ఈ సంచికతో 16 వసంతాలు పూర్తి చేసుకొని 17వ వసంతంలోకి అడుగిడబోతున్న శుభ సందర్భములో 2017 జనవరి, ఫిబ్రవరి, మార్చి సంచికను జన్మదిన ప్రత్యేక సంచికగా, ఎక్కువ పేజీలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని మా ఆకాంక్ష, మీ సహాయ సహకారాలను ఆకాంక్షిస్తూ రచయిత(త్రు)లు, ప్రకటన కర్తలకూ, పాఠకులు, ప్రతి ఒక్కరికీ మా హృదయ పూర్వక ఆహ్వానం.



శ్రీ భరద్వాజ సద్గురువాణి మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరం మా ప్రయత్నం కొనసాగిస్తుంటాము. అందుకు ఎల్లవేళలా మీ అండదండలు మాకు తోడుండాలి అని కోరుకుంటూ....

**పాఠకులకు, రచయిత(త్రు)లకూ, ప్రకటన కర్తలందరికీ**
**దీపావళి మరియు దత్తజయంతి శుభాకాంక్షలు**

మీ పబ్లిషర్
**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# విశ్వరూప సందర్శనం

ఎవరియందు ఈ విశ్వమంతా వున్నదో, ఎవరు ఈ విశ్వమంతా నిండివున్నారో, తాను తప్ప అన్యం వేరేది లేదో అట్టి సద్గురువుకు నమస్కరించుచున్నాను - నాపై నీ దృష్టి నిలుపు, నీపై నా దృష్టి నిలుపుతాను అన్న బాబా సూక్తిలోని అంతరార్థము ఇదే. ఆయనను సదా చూస్తుంటే గాని, ఆయన ఈ విశ్వమంతా దర్శిస్తున్నాడు అనే భావన సదా మనసులో హత్తుకొని వుండదు. ఉదా: మనము పిల్లవానికి ఒక పావలాయిచ్చి ఏదైనా వస్తువు కొనుక్కొని రమ్మని చెపుతూ, జాగ్రత్తగా వెళ్ళు, నేను నిన్ను చూస్తుంటాను అని అన్నాము అనుకొండి, బాగా గమనించండి ఆ పిల్లవాడు వస్తువు తేవటానికి వెళుతూ తిరిగి మనలను చూస్తాడు. ఎందువలనంటే మనము వానిని గమనిస్తున్నామా లేదా? అని. బాబా పైసూక్తిలోని అంతరార్థము అదే! అటు యిటు మోహరించిన, తండ్రులు, తాతలు తనయులతో పోరాటము సంకటము. విషాదములో మునిగినాడు అర్జునుడు. మోహ, అజ్ఞానములను పోగొట్టి కర్తవ్యోన్ముఖుని చేయటానికి శ్రీ కృష్ణపరమాత్మ సకల వేదసారము, ధర్మసారము అయిన భగవద్గీతను బోధించాడు. ఆ బోధను అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి విశ్వరూప సందర్శనము అనుగ్రహించినారు. అతి నిగూఢమైన ఈ రహస్యము ఆదిలో వివస్వంతునికి ఉపదేశించినా, అది ఇప్పుడు అర్జునునిమీద ప్రీతిచే బోధిస్తున్నాననియు, అయినా దీని ఆచరణ మహాకష్టమనియు "మనుష్యాణాం సహస్రేషుకశ్చత్ తతసిద్ధయే" వేలాదిలో ఎవరో ఒకరు ఈ ఆత్మజ్ఞానం కొరకు ప్రయత్నిస్తారు అనియు శ్రీకృష్ణుడు శెలవిచ్చారు. ఇది ద్వాపరయుగంలో సంగతి.



మరి ఇది కలికాలము, కలిపురుషుడు ధర్మభేధి. జీవితములో సగభాగము నిద్ర, మిగతా సగభాగము చిత్తశుద్ధి లేకపోవడము. మరి ఈ జీవులు తరించేదెట్లా! అందుకనే భక్తవత్సలుడు, అపార కరుణామూర్తియైన దత్తాత్రేయస్వామి శ్రీ శిరిడీ సాయినాధుడుగా శిరిడీలో ప్రకటమై "గీత దాటకుండా గీతను" ఆచరించే విధానాన్ని భక్తులకు అనుగ్రహించారు. భక్తుల పరిపాకాన్నిబట్టి అనుభవాలను ప్రసాదించారు. ఈ కలిలో తరింపుకు ముఖ్యమైన, ఆధ్యాత్మికతకు మూలమైన గీతా శ్లోకమునకు అర్ధవివరణను నానాసాహెబ్ చందోర్కర్‌కు వివరించి, తద్వారా ఆస్తిక జనావళికి గీతయొక్క సారాంశమును అందించారు.

**శ్లోకము :** తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః ॥

తత్వవేత్తలైన ఆత్మద్రష్టులను సేవించి, ప్రశ్నించి, జ్ఞానాన్ని తెలుసుకో. బుద్ధి పుట్టినపుడు మాత్రమే సేవ చేయడంగాక తన దేహము గురుసేవ కొరకే ఉన్నదనే భావంతో ఆత్మసమర్పణ చేసుకోవాలి. సందేహ నివృత్తి కొరకే ప్రశ్నించి తెలుసుకోవాలి. ఏదో కనిపించారుగదా అని అడగటము, ప్రశ్నించటము కాదు అనే వివరణ ఇచ్చారు. దీనికి శ్రీ పాకలపాటి గురువుగారు చక్కగా సమన్వయం చెప్పారు. "ఏదో అడగకపోతే, ఆ మహాత్ముడు ఏమనుకుంటాడో? అని అడిగేవారేగాని, నిజముగా అడిగేవారు లేరయ్యా" అని మాష్టరుగారితో అన్నమాట తప్పక పై వివరణకు సరిపోతుంది.

సాయినాధుడు అనుభవపూర్వకమైన అనుభూతిని (విశ్వరూపము) తన భక్తులకు అనుగ్రహించారు.

ఏ జీవిని హింసించినా, అదరించినా అది తనకే జరిగినట్లు అనుభవమిచ్చారు శ్రీసాయి. ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుతుందో భక్తులకు చెప్పేవారు. తన భక్తులకు ఒకటి రెండు రోజుల తరువాత ఏమి జరుగుతుందో, ముందుగానే చెప్పేవారు. తన పటానికి నైవేద్యము ఇవ్వకపోతే, తనకు నైవేద్యము ఇవ్వలేదని చెప్పేవారు. బల్లి కూసిన దానికి దాని సోదరి వస్తుందని ఆనందిస్తున్నదని చెప్పారు. సకల జీవులలో ఉన్న చైతన్యమే తాను అనే అనుభవాన్ని ప్రసాదించారు. ఆధ్యాత్మికకు సత్వగుణమెంత ప్రధానమో! అందుకే అసూయను జయించమన్నారు. ఉచితసేవను పొంది ఋణానుబంధాన్ని పెంచుకోవద్దని హెచ్చరించారు. ఇతరుల గుణదోషములను పట్టించుకుని విమర్శించినందువల్ల మనస్సు రాగ, ద్వేషాలకు నిలయమైవుంటుందని అట్టిది తగదన్నారు. సత్యము దైవమే- అందుకనే సత్యాన్ని అంటిపెట్టుకున్న వానివెంట తానెప్పుడూ ఉంటానన్నారు. ఇచ్చినమాటను నిలబెట్టుకోవటము నియమబద్ధమైన జీవనాన్ని గడపడమవుతుంది. అందుకనే ఇస్తానన్నంత దక్షిణను వసూలు చేసేవారు. మనస్సు చంచలమైనది. కోరికలు తలెత్తినపుడు, మనస్సును ఎలా నిగ్రహించుకోవాలో దైవసృష్టిలోని అందాన్ని ఎలా చూడాలో తెల్పి తన ధర్మాన్ని శ్రద్ధగా పాటించమన్నారు.

సకల దేవతా స్వరూపుడు, సకల సాధు స్వరూపుడు సకల జీవ స్వరూపుడు, సకల జడ స్వరూపుడు (పటాలవరకే ఈ లీలలను పరిమితం చేశారు) శ్రీసాయి. గంగను తన పాదాలనుండి ఉద్భవింపచేయుటము చేత సకల నదుల స్వరూపుడు శ్రీసాయి. నిత్యము తన భక్తునికి అన్ని రూపాలలో, అన్ని చేతలలో, అన్ని వేళలలో వెన్నంటి నేనున్నాను అని అనుభవపూర్వకముగా అనుభూతిని ప్రసాదించే సాయి పూర్ణ పరబ్రహ్మ స్వరూపము. ఆ విశ్వగురుని, విశ్వములోని అన్నిరూపాలలో సందర్శించడమే ఆయన భక్తుడు ఆచరించవలసిన యోగము! దానినే శ్రీసాయి, "అందరిలో నన్ను చూచువారు నాకు ఆప్తులు" అని శెలవిచ్చారు.

(అక్టోబరు 11వ తేదీ విజయదశమి మరియు డిసెంబరు 10వ తేదీ గీత జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ కె.వి.రంగారావు**, ఒంగోలు.

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"తాను గురువును అని అనుకునే వారు ఆ పదవికే అనర్హుడని" శాస్త్రం. అందుకే నేడు ఆధ్యాత్మిక పథములో కేవలం గురువని అనిపించుకోవటానికి కొందరు సుముఖత చూపటము లేదు, అంతకు మించిన బిరుదలతో ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీ సాయినాధుడినే మించి ఉన్నామని భావిస్తూ, సాయినే తమకు స్వయంగా ఆ స్థితిని ఇచ్చారు అని కొందరంటుంటే, "సాక్షాత్తు భగవంతుడే తన ప్రతిరూపముగా మమ్ములను ఎన్నుకున్నాడు" అని సద్గురువులుగా ప్రకటించుకుంటూ, తాము భ్రమలకు లోనవ్వడమే కాకుండా ఆశ భయాలతో తమ చెంతకు చేరినవారిని కూడా అనేక విధాలుగా భ్రష్టు పట్టిస్తున్నారు మరికొందరు. అటువంటి కుహనా గురువుల బారిన పడకుండా తన సంప్రదాయం ఏమిటో, తాను చెప్పదలచింది, చేసింది ఏమిటో హేమాద్రిపంత్ ద్వారా నిర్దుష్టముగా తెలియజేశారు సాయినాధుడు. ఆ విషయం సాయి చరిత్రను సంపూర్ణముగా పారాయణ చేసేవారికి తెలుస్తుంది. "నా చరిత్ర పారాయణే నీకు శ్రేయస్కరము, తద్వారా ఇహ పరములు గురించి ఆలోచించాల్సిన అవసరమే ఉండదు, అంతేకాక చివరకు నాస్థితినే అది ప్రసాదిస్తుంది" అని శ్రీ సాయిబాబా హేమాద్రిపంత్‌తో చెప్పటమే కాకుండా, నిత్యసత్యులై నేటికి దానిని ప్రత్యక్ష నిరూపణ చేస్తున్నారు. అనాదిసిద్ధమైన పారాయణ పరమార్ధాన్ని తెలియచేయటమే కాకుండా, పలువిధాల పరిగెత్తి అలసిసోలసి పోయేవారి పాలిట పన్నీటి జల్లు అయ్యి, ఇహ పరములలో పరమాన్నం లాంటి పరమార్ధాన్ని ప్రసాదించేది పారాయణ. అటువంటి పారాయణను కేవలం తాత్కాలికమైన కష్టాలు తొలగించుకోవటానికో, లేక కోరికలు నెరవేర్చుకోవటానికో, అవసరార్ధమై చదువుతున్నారే గాని, దాని అంతరార్ధము గ్రహించి పారాయణ చేసేవారు అరుదు అవుతున్నారు. పరిణితి చెందాలనే భావనతో గనుక సాయి చరిత్ర పారాయణ చేస్తే, అది వెలలేని ఆధ్యాత్మిక రత్నాలను అందించటమే కాకుండా, జీవన సాఫల్యాన్ని కలుగజేస్తుంది, తద్వారా భ్రమలు తొలగి, కుహనా గురువుల పాలిట పడి సమయాన్ని, ధనాన్ని వృధా చేసుకునే దౌర్భాగ్యం పట్టదు. సాయి చెప్పింది తాము ఆచరించకుండా, బాబా చేయనిది తాము చేస్తూ, సాయికి మించిన గురువులమని భావిస్తూ, ఆర్తుల, అర్ధార్థుల మానసిక బలహీనతలను తమ స్వార్ధం కోసం ఉపయోగించుకుని పబ్బం గడుపుకునే వారి మాటల మంత్రజాలములో పడకుండా ఉండటానికే, తన సంప్రదాయమేమిటో, తాను ఇవ్వదలచింది పొందటానికి కావలసిన ప్రధానమైన అర్హత ఏమిటో, సుస్పష్టముగా, అన్నాసాహెబ్ ధబోల్కర్‌ను నిమిత్తమాత్రునిగా చేసుకొని ఒక అద్భుతమైన సంఘటన ద్వారా తెలియజేశారు బాబా. సాయి సంప్రదాయానికంతటికీ మూలమై, పారాయణ చేసేవారికి కల్పవృక్షమై, అర్ధం చేసుకొని ఆచరించేవారి పాలిట కామధేనువై, మధురమైన జీవితాన్ని ప్రసాదించే పరమాద్భుత సంఘటన అది. హేమాద్రిపంత్‌ను నిమిత్త మాత్రునిగా చేసుకొని, శ్యామా ద్వారా బహిర్గతము చేస్తూ, రాధాబాయి దేశ్‌ముఖ్‌కు, సాయి ప్రత్యక్షముగా తెలియజేసిన సాధన మార్గము అది, దానిని అనుసరించే వారికి సాయి సన్నిధి నిరంతరము ప్రత్యక్ష గోచరమే.




ఆ సంఘటన పూర్వాపరాల్లోకి వెళితే, సంగమనేరు గ్రామము నుంచి వచ్చిన రాధాబాయి దేశ్‌ముఖ్ అనే ముదుసలి, బాబా ద్వారా ఉపదేశము పొందాలని భావించి, ఆహార పానీయాలు మాని, ఉపవాస దీక్ష చేస్తుండగా, శ్యామా ద్వారా విషయము తెలిసిన బాబా, ఆమెను ద్వారకామాయికి పిలిపించి, "తల్లీ అనవసరముగా నీ శరీరాన్ని యాతనకు గురిచేస్తున్నావు, పాడుబడ్డ మశీదులో నివసిస్తూ, ఐదు ఇళ్ళలో భిక్ష స్వీకరించే నావద్ద నుంచి మంత్రోపదేశము పొందాలని భావించడమే కాకుండా, పరోక్షముగా ఉపవాసదీక్ష చేయటము న్యాయమేనా! అందువలన నీకు ఏదయినా జరగరానిది జరిగితే, దాని పర్యవసానమేమిటో ఆలోచించావా, కనుక దీక్ష విరమించి, దక్షతతో మెలుగు" అన్న బాబా పలుకులకు ముకుళిత హస్త అయిన రాధాబాయి దేశ్‌ముఖ్ "అతి సామాన్యమైన ఫకీరువలే కనిపించే నీవు, లక్షలాది మంది హృదయాలలో జగద్గురువై నిలిచి, ఆర్తితో "సాయి" అన్న నామాన్ని ఉచ్ఛరించిన వారిని సప్త సముద్రాల అవతల ఉన్నా కాపాడుతానని వాగ్దానము చేసి, నెరవేరుస్తూ, జగత్తుకే తండ్రివై "బాబా" అని నోరారా పిలిపించుకునే నీకు నేను బిడ్డనే, జన్మసార్ధకతకై బిడ్డ కోరిన కోర్కెను తీర్చటము తండ్రి బాధ్యత కాదా, అయినా అందరిలా నేను కష్టాలు తొలగించమనో కోరికలు నెరవేర్చమనో ఆశతో అడగలేదే, ఇంతవరకు వ్యర్ధముగా గడిపిన జీవితం, నీ దర్శనభాగ్యముతో అర్ధవంతమై, జన్మ సార్ధకత కోసం నీ నుండి మంత్రోపదేశము పొందాలని భావించి, నాకు చేతనైన ఉపవాస దీక్ష వహించానే గాని, నిన్ను పల్లెత్తి అడగలేదు, ఇవ్వలేదని అపవాదు చేయలేదు. సర్వ హృదయాంతరత్త్వివి అయిన నీవు నా మనోరథము ఈడేర్చగలవని భావించి ఉండిపోయాను. శ్యామా ద్వారా నీ నుంచి పిలుపు రావటంతో కొండంత ఆశతో నీ సన్నిధికి



వచ్చాను. ఈ పాంచ భౌతిక శరీరాన్ని పోషించటానికై, ఎన్నో పనులు చేస్తూ, మేము తెలిసి తెలియక మూటకట్టుకున్న పాపాలను, భిక్ష ద్వారా మా ఇళ్ళవద్దకే వచ్చి అడిగి నీ జోలెలో వేయించుకుంటున్నావే గాని, నీవు చేసే ఐదు ఇళ్ళ భిక్ష నీ కడుపు నింపుకోవటానికి కాదు బాబా. భిక్ష ఇచ్చినవారికి ప్రతిగా పుణ్యాన్ని ప్రసాదిస్తున్నావు. స్వీకరించిన ఆహారాన్ని నీవొక్కడివే ఏనాడు ఆరగించలేదు. తీసుకున్న భిక్షను నీ చేతి స్పర్శతో పవిత్రము చేసి, శారీరక, మానసిక రుగ్మతలు తొలగించే దివ్యమైన ఔషధముగా, ప్రసాదముగా మరల సర్వజీవులకు పంచిపెట్టే పుణ్యప్రదాతవు కదా నీవు సాయినాథ. అజ్ఞానమనే చీకటిలో మగ్గుతున్న మా హృదయాలలో జ్యోతిని వెలిగించి, వెలుగుతో నింపటానికి, మా కుసంస్కారమనే నూనెను నీవు భిక్షగా అడిగేవు, ఇవ్వటానికి నిరాకరించినా, పంచభూతాత్మకుడువైన నీవు, నీ నోటినీళ్లతో జ్ఞాన దివ్వెలను వెలిగించావు. నీవు నివసించింది మా హృదయాల లాంటి పాడుబడ్డ మశీదే, అయితే అది నీ పాద స్పర్శతో పునీతమయ్యి, తేజోవంతమై, సర్వులకూ నాలుగు పురుషార్థాలను ప్రసాదించే "ద్వారకామాయి" అయింది. ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకోమన్న నీవు, అది మాకు గుర్తు చేయటానికి ఎన్నో జన్మల నుంచి మమ్ములను సంస్కరించుకుంటూ తీసుకువచ్చి, ఈ జన్మలో నీ లాగానే భౌతిక దేహమిచ్చి, కార్య కారణ సంబంధాన్ని అనుసరించి, ఏదో ఒక మిష మీద నీ వద్దకు లాగి, ఉద్ధరిస్తున్న జగద్గురువు నీవు. సర్వాంతర్యామి అయిన నీవు, నన్ను ఏ మిషతో, ఏ కారణముగా ఇక్కడకు లాగేవో నాకు తెలియదు. ఇన్ని సంవత్సరాలు సంగమనేరు గ్రామానికే పరిమితమయిన నేను, జీవిత చరమాంకములో నీ చెంతకు లాగబడి, ఇట్లా ఉండగలిగేను అంటే, అది నీ పిలుపు మేరకే జరిగింది అని నా భావన. "నా ఆజ్ఞ లేకుండా ఆకైనా కదలదు" అన్నావు, నన్ను ఎందుకు ఇక్కడకు లాగేవో నాకు తెలియదు, కాని నీ దర్శనంతో నాకు కలిగింది మాత్రం, జగద్గురువు అయిన నీ నుంచే ఉపదేశము పొందాలని ఇక్కడకు వచ్చానని. నా మనో భావన నిజమే అయితే నీవే చెంతకు పిలిచి, ఉపదేశమివ్వాలని వాడాలో ఒంటరిగా ఉండిపోయాను. శ్యామా ద్వారా నీ పిలుపు విని నేను ఈ ద్వారకామాయిలో అడుగిడి, జగద్గురువైన నీ దర్శనం చేసుకొనే మహాభాగ్యం కలిగింది, దానితో పాటు నా మనోరథం కూడా ఈడేరితే నా ఈ జన్మ సార్థకతమయినట్లే. "ద్వారకామాయి ప్రవేశం ఒనరించినంతనే సర్వ సుఖ సంపదలు పొందగలరు" అని అన్నావు. ఈ వయస్సులో నాకు ఏ సుఖాలు, సంపదలు అవసరం లేదు నాకు కావలసింది, నాకు సర్వ శుభాలు చేకూర్చేది, అపారమైన ఆధ్యాత్మిక సంపద ప్రసాదించే నీ ఉపదేశము. కనుక, కరుణతో నాకు అది ప్రసాదించు" అని ముకుళిత హస్తాలతో సాయిని వేడుకుంది రాధాబాయి దేశ్‌ముఖ్. లీలామానుష విగ్రహుడయిన సాయి, మందస్మిత వదనార విందుడై, చిరునవ్వులు చిందిస్తూ, రాధాబాయి దేశముఖ్‌తో "బిడ్డపై అపారమైన ప్రేమగల తల్లి వచించిన విధముగా, నీ అంతరంగాన్ని వ్యక్తంచేశావు. బిడ్డ చేసే ప్రతి పనిని మురిపెంగా చూసే తల్లిలా నీవు నీ మనోభావాన్ని వ్యక్తంచేశావు. నాపై నీకు గల అవ్యాజమైన ప్రేమను పంచటానికే భగవంతుడు నిన్ను ఇక్కడకు పంపిన కారణమై ఉండవచ్చు. అన్నింటా, అన్ని విధాల, అనేక రీతుల ఉత్తమమైన ఆలోచనలు చేసే నీకు, వేరొకరు ఉపదేశము చేయటము ఏమిటి? ఈ ద్వారకామాయి వాసుడిపై అవ్యాజమైన ప్రేమతో ఇంతదూరం వచ్చిన నీకు నేను బోధించేది ఏముంది. ఇక ఉపదేశము అంటావా నా గురువు నాకు ఉపదేశించని దానిని నీకు నేను ఎలా బోధించగలను, నా గురువు నుండి నేను సర్వకాల సర్వావస్థల యందు వారి అవ్యాజమైన ప్రేమ, రక్షణ కోరుకున్నా, అది నిరంతరము లభిస్తున్నది. అందుకు తగ్గ విధముగా జీవించటమే నేను చేస్తున్నది. తాబేలు కేవలం తన చూపుతో తన బిడ్డలను కాపాడుతున్నట్లు నా గురువు నన్ను కాపాడుతున్నారు. అదే రక్షణ ఈ ద్వారకామాయిలో అడుగిడిన ప్రతి ఒక్కరూ పొందుతున్నారు. మరల ఉపదేశమేముంది, ఆర్తితో, ముకులిత హస్తాలతో, జీవిత సార్థకత కొరకై నీవు చేసే ప్రార్థనా పూర్వకమైన వేడుకోలు చూస్తుంటే, నా హృదయము ఆర్ద్రతతో నిండిపోతున్నది. ఆ భగవంతుని లీలావిలాసములు అపారము, అనూహ్యమైనవి. ఈ ద్వారకామాయిలో అడుగిడిన వారు ఎవరూ రిక్త హస్తాలతో, నిరాశ హృదయాలతో వెనుతిరగలేదు. అయితే అది ఎంత మేరకు పొందేరు అన్నది వారి వారి సంస్కారననుసరించి ఉంటుంది. నా గురువు చెప్పనిది, చేయనిది, నేను చేయటానికి అధికారము లేదు. మీరందరూ భావిస్తున్నట్లుగా ఈనాటి నా ఈ ప్రతిభ అంతటికి కారణం నాపై, నా గురువుకు గల అవ్యాజమైన ప్రేమకు ప్రతిరూపము. ఆ ప్రేమను పొందటానికి నేను చేసినదేమిటో, దాని పర్యవసానముగా నా గురువు నాకు ఉపదేశించింది ఏమిటో నీకు సవివరముగా తెలియజేస్తాను. ఎప్పుడూ, ఎవ్వరికీ చెప్పని ఈ విషయం నీ ద్వారా బహిర్గతమవ్వాలని భగవంతుని ఆదేశము అయి ఉండవచ్చు. అది విన్న తరువాత నీ మనోరథము ఈడేరటానికి నన్ను ఏమి చేయమంటే అది చేస్తాను. సావధాన చిత్తవై ఆలకించు" అంటూ సాయిబాబా చెప్పటం ప్రారంభించారు.

ఇంతవరకు ఎన్నడు, ఎవరితోను ఇంత సవిరముగా మాట్లాడని బాబా, ఆ తల్లితో ఇంత ప్రశాంతవదనుడై, బదులివ్వటము చూసిన శ్యామా, ఆశ్చర్యానందాలకు లోనయ్యి, ఒక అద్భుతమైన విషయము సాయి ముఖత వెల్లడి కాబోతున్నదని భావించి, ఒడలెల్ల చెవులు చేసుకొని, సాయి చెప్పేది ఆలకించటానికి సమాయుక్తమవుతూ, ఆ సన్నివేశములో పాల్గొనే మహద్భాగ్యం కలిగించిన సాయికి మనస్సులో వందనాలు అర్పించి సావధానుడై కూర్చున్నాడు మాధవరావ్ దేశపాండే.

రాధాబాయి దేశముఖ్‌ను నిమిత్తమాత్రురాలిగా చేసుకొని సాయి అందించిన, అమృత గుళికల వంటి ఆ సంఘటన విషయ విశేషాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.




# ఒక్క క్షణం !

విష్ణుకంచిలో దామోదరుడనే పేరుగల బీదబ్రాహ్మణుడు ఉండేవాడు. వివాహమైన తరువాత అతడు తనభార్యతో అతిథిసేవయే గృహస్థుల ప్రధానకర్తవ్యం. అందువల్ల నేను ఇంటిలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా అతిథులెవరైనా వస్తే వారిని ఆకలితో పంపవద్దు అని చెప్పాడు. ఇంకా గుర్వాజ్ఞను పాలించటం బ్రహ్మచారికి, అతిథిసేవ గృహస్థులకు, తపస్సు వానప్రస్థులకు భగవత్‌చింతన సన్యాసులకు ప్రధాన కర్తవ్యమని వివరించాడు. అతడి భార్య సంతోషంతో అంగీకరించింది. అతడు కాంచీనగరంలో భిక్షాటన చేస్తూ, భిక్షగా లభించిన దానిని తీసుకువచ్చి భార్యకు ఇచ్చేవాడు. అతడు సంపాదించినది వారి భోజనానికే సరిపోయేదికాదు.



భగవంతుడి లీలలు చిత్రంగా ఉంటాయి. ఒకరోజు భగవానుడు వృద్ధసన్యాసి వేషంలో వీరింటికి వచ్చాడు. అరుగుపై కూర్చొని "దామోదరుడు ఇంటిలో ఉన్నాడా?" అని పిలిచాడు. దామోదరుడు బయటకు వచ్చి సన్యాసికి నమస్కరించాడు. సన్యాసి ''ఈరోజు మీఇంటిలో భిక్ష స్వీకరించడానికి వచ్చా''నని చెప్పాడు. దామోదరుడు మహదానందంతో సన్యాసి పాదాలు కడిగి, ఇంట్లోకి తీసుకువెళ్ళాడు. దైవయోగం వల్ల, ఆరోజు దామోదరునికి ఎక్కడా భిక్ష దొరకలేదు. దామోదరునికి ఏమి చెయ్యాలో తెలియలేదు. తాను, తనభార్య నిరాహారంగా ఉన్నా పరవాలేదు గాని, ఈ ముసలిసన్యాసికి ఏంపెట్టి కడుపునింపాలి? అని ఆలోచించసాగాడు. ఇంటిలో ఏమీ లేవు. చిరిగిపోయిన పాతబట్టలు, పాతసామాను, గోపీచందనం (మంచిగంధం) చింకిచాప తప్ప ఆ ఇంట్లో ఏమీ లేవు. దామోదరుడు అతని భార్యతో–ఇదేమి కష్టం సంభవించింది. అతిథిని ఆకలితో ఉంచాలా అంటూ బాధపడ్డాడు. ఆమె – "నేనున్నానుకదా, దిగులు పడవద్దు" అని ధైర్యం చెప్పింది. దామోదరుడు – "నీ దగ్గర ఏమైనా గుప్తధనం ఉందా లేక నీ నగలేమైనా ఉన్నాయా?" అన్నాడు. ఆమె – "మీరు మంగలి దగ్గరికి వెళ్ళి కత్తెర పట్టుకు రండి" అని చెప్పింది. దామోదరుడు వెళ్ళి కత్తెర పట్టుకొచ్చాడు. అతని భార్య తన కేశములు కొన్ని కత్తిరించి, వాటిని త్రాడుగా పేనింది. దానిని భర్తచేతికిచ్చి దీనిని అమ్మి, ఆడబ్బుతో బియ్యం పప్పు, ఉప్పులు తెమ్మంది. అతడలానే చేశాడు. ఆమె వాటితో అన్నం వండింది. దామోదరుడు వృద్ధసన్యాసిని భోజనానికి లెమ్మన్నాడు. పెద్ద అరిటాకు వేసి అన్నం పప్పు వడ్డించాడు. సన్యాసి ఒక్కమెతుకు కూడా వదలకుండా తినేశాడు. దామోదరుడు మిగిలిన మొత్తం అన్నాన్ని విస్తరిలో వడ్డించాడు. వృద్ధసన్యాసి మొత్తం అన్నం తిని తృప్తిగా త్రేన్చాడు. వృద్ధసన్యాసి మీదంపతుల ఆతిథ్యం నాకు బాగా నచ్చింది. ఇప్పుడు నేనెక్కడకూ వెళ్ళలేను. నేనిక్కడే ఉంటాను అన్నాడు. దామోదరుడు మహద్భాగ్యంగా భావించాడు. ఆ సన్యాసి రోజంతా యింట్లోనే ఉన్నాడు. సాయంత్రమయ్యాక "బాబూ! పప్పు అన్నం చాలు. మరేమీ వండద్దు" అని చెప్పాడు. దామోదరుడు సరేనని తన భార్యకు సంగతి చెప్పాడు. ఆమె మిగిలిన తన శిరోజాలను కత్తిరించి, వాటితో త్రాడుపేని, దాన్ని అమ్మి ఉదయంలాగానే బియ్యం, పప్పు, ఉప్పులు తెమ్మంది. అలా తెచ్చిన దాన్ని వండి వడ్డించింది. వృద్ధసన్యాసి ఒక్క మెతుకు కూడా వదలకుండా, వండిన మొత్తం తినేసాడు. "బాబూ! రాత్రి అయ్యింది. నాకు ఇల్లంటూ లేదుకదా ఈరాత్రికి యిక్కడే ఉంటాను'' అన్నాడు. దామోదరుడు "మహద్భాగ్యం" అన్నాడు.

దామోదరుని భార్య ఇంట్లో ఉన్న ఒకేఒక్క చింకిచాపను నేలపై పరిచి, పక్కవేసింది. వృద్ధసన్యాసి విశ్రమించాడు. దామోదరుడు ఆయన కాళ్ళు నొక్కుతూ, ఆయన పడుకున్న తర్వాత కటికనేలపై పడుకున్నాడు. అతని భార్య కూడా అలానే నిద్రపోయింది. వారిద్దరూ నిద్రపోయిన తర్వాత సన్యాసి నిద్రలేచి వారిద్దరినీ ఆశీర్వదించాడు. బ్రాహ్మణి శిరోజాలు ఎప్పటిలానే వచ్చేసాయి. భగవంతుడు వారికి సిరిసంపదలను, ధనధాన్యాలను అనుగ్రహించాడు. వెంటనే అంతర్ధానమైపోయాడు. దామోదరుని భార్య నిద్రలేచేటప్పటికి ఆమె ఒంటినిండా ఆభరణాలున్నాయి. ఆమె కేశాలు ఎప్పటిలానే ఉన్నాయి. ఆమె ఆశ్చర్యంతో భర్తను లేపింది. దామోదరుడు ఎంత వెదికినా వృద్ధసన్యాసి జాడలేదు. అయ్యో! వయసు పైబడినవాడు ఎక్కడకు వెళ్ళాడో తెలీదు అనుకుంటూ ఇల్లంతా వెతికాడు. అతని భార్య – "ఒకసారి నన్ను మనింటిని పరిశీలనగా చూడండి" అంది. దామోదరుడికి అంతా అర్థమవసాగింది. అతడు నిస్పృహతో కుప్పకూలిపోయాడు. "భగవంతుడే స్వయంగా నా యింటికి వస్తే నేను గుర్తించలేకపోయాను. ఎంతటి అపరాధం చేసాను. అజ్ఞానిని నన్ను కరుణతో క్షమించు స్వామీ!" అని భక్తి విశ్వాసాలతో ఏడ్వసాగాడు. పరమాత్మ అతడిని అనుగ్రహించి, దర్శనమిచ్చి

తరింపజేశాడు. మీరిద్దరూ యిలానే అతిథి అభ్యాగతులను ఆదరించి వారిని సేవిస్తూ సంతృప్తులను చేయండి. అంత్యకాలమున మీరు నన్నే చేరుకుంటారు అని ఆశీర్వదించి అదృశ్యమయ్యారు.

**నీతి : అతిథి సేవనమే గృహస్థు ప్రథమ కర్తవ్యం, అతిథిసేవతో భగవంతుని కూడ తృప్తిపరచవచ్చు.**

ఎవరైనా తన శక్తికి మించి దానం చేయపోతే "తయారయ్యాడయ్యా దరిద్ర దామోదరుడు" అనటం పరిపాటి అయింది. అయితే అతిథి దేవోభవ, ఆచార్య దేవోభవ అన్న ఆర్యోక్తి ఆలకిస్తే ఎంతటి అద్భుత ఫలితముంటుందో అది ఆచరించిన వారికి మాత్రమే తెలుస్తుంది.

"నీ దగ్గరకు ఏప్రాణి వచ్చినా తోలేయవద్దు, ఆదరించు, ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో, ఆకలిగొన్నవారికి అన్నం, గుడ్డలు లేని వారికి గుడ్డలు ఇవ్వు, భగవంతుడు సంతోషిస్తాడు, నిన్నెవరైనా ఏమైనా అడిగితే సాధ్యమైనంతవరకు యివ్వు లేక యిప్పించు "లేదు" అనవద్దు, ఇచ్చేందుకు ఏమీ లేకపోతే మర్యాదగా చెప్పు, చులకన చేయటం, కోపగించుకోవటం తగదు, నీదగ్గర ఉన్నా యివ్వాలని అనిపించకపోతే లేదని అబద్ధం చెప్పవద్దు ఇవ్వలేనని మర్యాదగా చెప్పు, ఇవ్వలేకపోతే దానికి కారణం చెప్పు, అయిష్టమే కారణమైతే అదే చెప్పు, ప్రాణులన్నింటి రూపాలలోను నేనే సంచరిస్తూ ఉంటాను, ఎవరిపై కోపించినా, దూషించినా నాకు బాధకలుగుతుంది. ఇతరులు చేసే పనులకు ఫలితం వారే అనుభవిస్తారు, నీవు చేసే పనుల ఫలితం నీవు అనుభవిస్తావు తక్కిన ప్రపంచం తల్లక్రిందులు కానివ్వు దానిని లక్ష్యపెట్టక ఋజుమార్గంలో వెళ్ళు, ఆనందానికి యిదే మార్గం" అని బోధించారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుడు. సుఖ సంతోష ఆనందాలకోసం అహర్నిశలు ఆరాటపడే వారలము, ఆపరమానందానికి, పరమాత్మ కృపకు సాయి బోధించిన సూక్ష్మమైన మార్గాన్ని అనుసరించి సచ్చిదానంద స్వరూపుడైన సాయికృపకు పాత్రులవుతామో లేక అపాత్రతతో సాయికరుణకు దూరమవుతామో ఒక్కక్షణం ఆలోచించుకొని ముందుకు సాగుదాము. "నేను చెప్పిన పని చేయని వాడితో నాకేమి పని" అన్నారు సాయిబాబా.

విజయదశమి శుభాకాంక్షలతో

రచన, సేకరణ : **శ్రీమతి వై.సాయి శిరీష,** బెంగళూరు

## పండుగలు - పర్వదినాలు

**అక్టోబరు - 2016**

1. శరన్నవరాత్రులు ప్రారంభం
2. గాంధీ జయంతి
8. సరస్వతి పూజ
10. మహర్నవమి
11. విజయదశమి
శ్రీ శిరిడీ సాయిబాబా 98వ మహాసమాధి మహోత్సవము
12. మొహరం
18. అట్ల తద్ది
27. శ్రీపాద శ్రీవల్లభుల ఆరాధనోత్సవము
28. శ్రీ ధనత్రయోదశి
30. దీపావళి
"సాయిమాస్టర్" పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి
31. రామభక్త శ్రీ రంగన్నబాబు ఆరాధనోత్సవము (తిథి ప్రకారం)

**నవంబరు - 2016**

1. మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి
2. శ్రీ సాయిదీక్షలు (మండలం) ప్రారంభం- ఉక్కునగరం
3. అవధూత శ్రీ పూండీస్వామి ఆరాధనోత్సవము
నాగులచవితి
6. అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము
7. ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తిథి ప్రకారం)
14. కార్తీక పూర్ణిమ, నెహ్రూజయంతి, గురునానక్ జయంతి
17. కాళహస్తి అవధూత శ్రీ వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవము
29. శ్రీ ధునీవాలాదాదా ఆరాధనోత్సవము
శ్రీ సుధీంద్రబాబు ఆరాధనోత్సవము

**డిసెంబరు - 2016**

10. గీతా జయంతి, శ్రీ మాణిక్యప్రభువు ఆరాధనోత్సవము
11,12,13 శ్రీ దత్త జయంతి మహోత్సవములు-ఉక్కునగరం
13. శ్రీ దత్త జయంతి- సాయిదీక్షలు విరమణ-ఉక్కునగరం
16. ధనుర్మాసం ప్రారంభము
24. శ్రీ ఉపాసనీబాబా ఆరాధనోత్సవము
25. క్రిస్టమస్
30. భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి
31. ఆంగ్ల సంవత్సర (2016) వీడ్కోలు
నూతన ఆంగ్ల సంవత్సర 2017 ఆహ్వాన ప్రత్యేక సత్సంగమము-ఉక్కునగరం

**జనవరి - 2017**

1. ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక సంత్సంగం-ఉక్కునగరం
8. ముక్కోటి ఏకాదశి
మహాస్వామి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి ఆరాధన
13. భోగి పండుగ
14. మకర సంక్రాంతి
ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
15. అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి
30. మహాత్మగాంధీ వర్ధంతి






# శ్రీ గురు చరిత్రామృతము

రచన : వి.వి. పూర్ణచంద్రరావు


"సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకు వచ్చినట్లు" అన్నారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీ సాయినాథుడు, అంతే కాకుండా కార్యకారణ సంబంధముగా "అనేక మిషలమీద నా భక్తుడిని నా వద్దకు లాగుతాను" అన్నారు శ్రీసాయిబాబా. మనిషిగా జన్మించినందుకు దాని సార్ధకత కొరకై ప్రయత్నించటమంటే కేవలం జీతము (సంపద, ఆర్భాటాలు, హంగులు) గురించే కాకుండా జీవితము గురించి కూడ ఆలోచించాలి. జీవితము అనేది ఒకటి ఉంటేనే, దానికి కావలసినవి అన్నీ అవసరమవుతాయి. అదే లేని రోజు ఏది ఉన్నా శూన్యమే. జీవిలోపల గాలి ఉంటే శివము (శరీరము) లేకుంటే శవము అవుతుంది. శరీరానికే అన్ని హంగులు, రంగులు. "నా జీవితం నాయిష్టం, అర్ధంలేని మాటలతో వ్యర్ధం చేసుకోకుండా లభించిన దానిని అనుభవించటమే జీవితమంటే" అని భావిస్తే, వెంటనే వేరొక ప్రశ్న ఉదయిస్తుంది, అసలు జీవితం ఎవరిచ్చారు? అది ఎవరిది?, త్రిమూర్త్యాత్మకుడు అయిన దత్తాత్రేయుడి, తల్లి అనసూయదేవి, "ఈ భౌతిక దేహము ప్రసాదించిన నా మాట కాదని నీవు నన్ను వదిలి వెళ్ళే హక్కు లేదు. ఆ శరీరానికి కారణమైన నా మాటను నీవు జవదాటరాదు" అనగా, "అమ్మా నీవు ప్రసాదించినందుకు దానిపై హక్కు ఉందంటున్నావు కనుక ఇదిగో ఈ తోలుతిత్తి, అంటూ, చర్మము వలచి ఇచ్చాడు, అటు పిమ్మట సర్వవ్యాపకమైన ఆత్మస్వరూపమైన తన నిజతత్వాన్ని తల్లికి ఎరుకపరచాడు సర్వవ్యాపకుడైన శ్రీ దత్తాత్రేయుడు. కనుక ఈ జీవితానికి భౌతికముగా కారణము జన్మనిచ్చిన తల్లి తండ్రులు అయినా, అందుకు కారకుడు – సృష్టికర్త అయిన ఆ పరమేశ్వరుడే. అందుకనే జన్మనిచ్చిన తల్లి తండ్రులను, జన్మకు కారణమైన పరమేశ్వరుడిని సంప్రీతి చెందించేలా జీవించటమే మనిషి యొక్క ప్రథమ, ప్రధాన కర్తవ్యము. మానవ జన్మ లభించింది అనుభవించటానికే అంటూ విచ్చలవిడిగా జీవిస్తూ, కన్నవారికి, వంశానికి, జాతికే కళంకం తెచ్చే విధముగా ప్రవర్తిస్తూ, స్వార్ధముతో సుఖలోలురై ఎన్నో జన్మల తరువాత లభించిన మానవ జన్మను వ్యర్ధం చేసుకొని, హీన జన్మలకు దిగజారి పోయేవారిని ఉద్ధరించటానికే మరల ఆ పరమేశ్వరుడు గురురూపములో అవతరించింది. తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవటానికి, అనేక మిషలమీద తన వద్దకు లాగి, కోరికలు తీరుస్తూ, జీవితం అంటే అన్నింటికీ ఆర్రులు చాచటము కాకుండా, అందరికి చేయి అందించేలా జీవించటమని తన ఆచరణద్వారా తెలియజేయుటమే తన బాధ్యతగా స్వీకరించి, "సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకు వచ్చినట్లు" అని బాబా బోధలోని భావం. జన్మనిచ్చిన తల్లి తండ్రులు (పితృదేవతలు), జన్మకు కారణమైన భగవంతుడు (దైవం) మధ్య వారధి గురువు. అందుకనే తల్లి తండ్రి – గురువు – దైవము అన్నారు. బ్రతికి ఉండగానే ముసలివాళ్ళను (తల్లి, తండ్రులను) మూలకు నెట్టి, వారి ఆకలి, అవసరాలు పట్టించుకోకుండా, పోయిన తరువాత "మూలన పెట్టి, దండలు వేసి, వస్త్రాలు పెట్టి, పండుగ చేసుకుంటాము" అనేవారికి కనువిప్పు కలిగిస్తూ, శాస్త్రాలు, సంప్రదాయల ఆంతర్యము, అంతరార్ధము తెలియజేస్తూ, తగురీతిన జీవింపచేయటానికే సృష్టి, స్థితి, లయకారకులు ముగ్గరు, ఏకరూపముగా ఈ భువిపై దత్తాత్రేయుడుగా అవతరించటము జరిగింది. సర్వజనోద్ధరణమే లక్ష్యంగా కలియుగములో పలుమార్లు తిరిగి అవతారాలెత్తటము జరిగింది. అందులోని భాగముగానే 13వ శతాబ్దములో శ్రీపాద శ్రీవల్లభులుగా జన్మించారు శ్రీ దత్తాత్రేయుడు. ఆచార వ్యవహారాలు మిక్కుటముగా ఉన్న ఆ రోజులలో, ఉత్తమ సంస్కారవంతులను ఉద్ధరిస్తూ, తీర్థాటన పేరిట పుణ్య తీర్థాలను, పుణ్య క్షేత్రాలను తన పాదస్పర్శతో పునీతం చేసి, మూర్ఖుడయిన కుమారుడితో కలసి ఆత్మహత్యకు సిద్ధమైన అంబికను వారించి, "శివపూజ వలన ఈ జన్మలో తరించు, వచ్చే జన్మలో నా అంతటి కుమారుడు నీకు కలుగుతాడు" అని వాగ్దానమిచ్చి, వారిని ఆశీర్వదించి, కృష్ణానదిలో దిగి అంతర్హితమయిన శ్రీ పాదులు, మరుజన్మలో కరంజా నగరములోని అంబ, మాధవశర్మ దంపతులకు జన్మించటము జరిగింది. పుట్టిన వెంటనే ప్రణవము ఉచ్చరించిన ఆ బాలుడి జాతక చక్రము పరిశీలించిన జ్యోతిష్యులు ఆ బాలుడు జగద్వందుడు అవుతాడని, అతని దర్శనము చేతనే పతితులు కూడా పావనులవుతారని, తల్లి తండ్రులకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తాడని, అంతేకాక ఆ బాలుడికి శ్రీ సిద్ధులు దాస్యం చేస్తాయని, నవ నిధులు పరిచారకులవుతారని పలికి, ఆ బాలుడికి నరహరి అని నామకరణము చేయించి, మాధవశర్మ చేసిన సన్మానము స్వీకరించి, ఆశీర్వదించి వెడతారు పండితులు. కలియుగములో రెండవ దత్తావతారముగా అవతరించిన శ్రీ నరహరి, మానవ జన్మ ఎత్తిన తరువాత దాని సార్ధకతకై జన్మనిచ్చిన తల్లి తండ్రులు పట్ల ఎట్లా మెలగాలో తన ఆచరణ ద్వారా తెలియజేసిన విషయము శ్రీ గురుచరిత్రలోని 11వ అధ్యాయము ప్రస్ఫుటముగా తెలియజేస్తుంది.

పుట్టిన వెంటనే ప్రణవం ఉచ్చరించిన బాలుడైన నరహరిని చూడటానికి తండోపతండాలుగా ప్రజలు వచ్చేవారు. అయితే అటు పిమ్మట వయస్సు పెరుగుతున్నా ఒక్క మాట కూడ మాట్లాడని అతనిని చూసి, తమలో తాము నవ్వుకునేవారు. బిడ్డకు మాటలురావటానికి ఆ దంపతులు చేయని నోము, వ్రతము లేదు. ఏవరేమి చెప్పినా అదల్లా చేసేవారు. అల్లారు ముద్దుగా పెరుగుతున్న బాలుడిని పుట్టిన వెంటనే ఓంకారము ఉచ్చరించిన బిడ్డను చూసి ఆశ్చర్యపోయిన ప్రజలే, నేడు మాటలు రాని తన పిల్లవాడిని ఆశ్చర్యముగా చూడటమే కాకుండా, శివానుగ్రహము వలన జన్మించిన తమ బిడ్డడి ముద్దుముద్దు మాటలు వినలేని తమ దురదృష్టానికి తమలో తాము కుమిలిపోయే ఆ తల్లి తండ్రుల ఆవేదనను చూసి నరహరి, ఒకనాడు తల్లి తండ్రులను చేరబిలిచి, ఇనుపముక్కను తన చేతి స్పర్శతో బంగారముగా మార్చి, తాను ఆజన్మ సిద్ధుడనని తన గురించి మీరు ఆవేదన చెందవద్దని సైగల ద్వారా తెలియచేశాడు. నాడు ఆనందాశ్రువులు జాలువారిన తల్లి కంటిలో, నేడు దుఃఖాశ్రువులు రాలటము చూసిన నరహరి, పొంగి పొరలి వస్తున్న దుఃఖంతో తనను అక్కున చేర్చుకున్న తల్లితో "తనకు ఉపనయనం చేయుమని, అప్పుడు నీతోనే ముందుగా మాట్లాడుతానని'' సైగల ద్వారా తల్లికి తెలియచేయగా, ఆనందభరితుడైన మాధవశర్మ, తన తనయుడి ఉపనయనానికి కావలసిన ఏర్పాట్లలో నిమగ్నమైనాడు. ఉపనయనానికి ఒక శుభముహూర్తము నిర్ణయించి, ఊరి పెద్దలను, పండితులతో పాటు గ్రామ ప్రజలందరినీ ఆ శుభకార్యక్రమానికి ఆహ్వానించాడు మాధవశర్మ. మాట్లాడలేని వాడికి ఉపనయనమేమిటి, మంత్రోచ్చారణ ఎలా చేస్తాడు, నిత్య సంధ్యావందనాది అనుష్టానాలు ఎట్లా చేస్తాడు అని విస్తుపోయిన వారు కొందరు అయితే, కార్యక్రమము ఏమయితే మనకెందుకు మృష్టాన్న భోజనం లభిస్తుందని ఇంకొందరు, శర్మగారిచ్చే దక్షిణ తాంబూలాలు స్వీకారానికై మరికొందరు ఆ కార్యక్రమానికి బయలుదేరగా, కొందరు దైవజ్ఞులు మాత్రము "పుట్టిన వెంటనే ప్రణవం ఉచ్చరించి, ఇంతకాలము మాట్లాడక పోవటానికి బాలుడు మూగవాడు కాదని, అతని మౌనంలో ఏదో ఆంతర్యము ఉందని అది వీక్షించి ధన్యులమవ్వచ్చని" భావించి బయలుదేరేరు. కారణం ఏదయితేనేమి నరహరి ఉపనయన కార్యక్రమానికి ఊరిలోని వారందరూ మాధవశర్మ ఇంట సమావేశమయ్యారు.

శాస్త్రోక్తరీతిన ముందుగా నరహరికి శిరోముండనము (జుట్టు తీయించటము) చేయించి, మాతృ భోజనము అయిన పిమ్మట, జింక చర్మము, పసుపు వస్త్రము ధరించిన నరహరికి, ప్రథమ గురువైన తండ్రి, కుడి చెవిలో గాయత్రి మంత్రము ముమ్మారు ఉపదేశించగా, మనసులోనే దానిని ఉచ్చరించి, ఉపనయన దీక్షమంత్రము స్వీకరించాడు నరహరి. అటు పిమ్మట చేతిలో రావిమండ, బుజాన జోలే తగిలించుకొని, తల్లి చెంతకు వచ్చి నమస్కరించి "భవతీ భిక్షాందేహి" అని పలికి, తల్లినుంచి ప్రథమ భిక్షను స్వీకరించి, ఉపనయనము చేస్తే ముందుగా తల్లితోనే మాట్లాడతానని తానిచ్చిన మాటను నెరవేర్చి సత్యసంధుడిగా నిలిచాడు నరహరి. ఆశ్చర్యముతో చూస్తున్న వారు అచ్చెరువొందేలా, తల్లినుంచి భిక్ష స్వీకరించిన నరహరి, "ఋగ్వేదం పఠించు, ఆచారము పాటించు" అన్న తల్లి మాటననుసరించి ఋగ్వేదములోని "అగ్నిమీళే పురోహితం" అన్న మొదటి మంత్రము పఠించాడు. తల్లి రెండవసారి భిక్షనిచ్చి "యజుర్వేదము పఠించు, ఆచారము పాటించు" అనగానే యజుర్వేదములోని "ఇషేత్వా" అన్న మొదటి మంత్రము పఠించాడు, మూడవసారి భిక్షనిచ్చిన తల్లి "సామవేదం పఠించు, ఆచారము పాటించు" అనగానే "అగ్న ఆయాహి" అంటూ సామవేదములోని మొదటి మంత్రాన్ని పఠించాడు నరహరి. అది చూసిన అంబ మాధవశర్మ దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఉపనయన కార్యక్రమానికి విచ్చేసిన వారందరు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. "జన్మించినప్పుడు ప్రణవం ఉచ్చరించి, ఉపనయనముతో వేదాలు వల్లించాలనే ఇంతవరకు ఆ బాలుడు మౌనం వహించడాని, వ్యర్థమైన మాటలతోకాక అర్థవంతమైన పలుకులతో జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలని, లభించిన జన్మకు నిజమైన కారణం తెలుసుకొని జీవించాలని" నరహరి చర్యలోని భావమయి ఉండవచ్చని తలుస్తున్న పండితులను ఆశ్చర్యపరుస్తూ, తల్లినుంచి మూడు సార్లు భిక్షలు స్వీకరించటము పూర్తి అయిన పిమ్మట నరహరి, నాల్గవ వేదమయిన అథర్వణ వేదంలోని మంత్రము పఠించగానే, కారణజన్ముడైన ఆ బాలుడు సామాన్యుడు కాదని, భగవంతుని అవతారమని తెలుసుకున్న అక్కడి వారందరూ నరహరికి నమస్కరించారు. "సర్వశాస్త్రాలకు జన్మస్థానమైన ఆ ప్రభువుకు, నాలుగు వేదాలు నాలుగు మాటలతో సమానము" అని తలచారు పండితులు. చిరునవ్వుతో వారందరినీ పరికించి చూశాడు వటువు అయిన నరహరి. ఉపనయన క్రతువు పూర్తికావచ్చింది. అనాదరణ చేసిన ప్రజలే తమ బిడ్డను అమితమైన ఆరాధనతో చూస్తుంటే, మాధవశర్మ దంపతులు అమితమైన పుత్రోత్సాహంలో మునిగిపోయారు. వామనుడి వలే భాసిస్తున్న నూతన బ్రహ్మచారి అయిన నరహరి, తిరిగి తల్లి చెంతకు రాగా, "నాయనా ఇకనుంచి నీవు భిక్షతోనే జీవించాలిసుమా" అంటూ నిండు మనసుతో దీవించింది అంబ. ఆ మాట విని మందహాస వదనారవిందుడైన నరహరి, తల్లికి నమస్కరించి "అమ్మా నీ ఆజ్ఞ మేరకు నేను ఈ క్షణం నుంచే భిక్షువునవుతాను, అందుకు అర్హమైన సన్యాస దీక్ష స్వీకరించటానికి మీ అనుమతి ఇవ్వండి" అంటూ పలికి, తండ్రివైపు తిరిగి నమస్కరించి, ఆనతి కొరకై ఎదురుచూశాడు నరహరి. అంతవరకు ఆనందోత్సాహాలతో నిండి ఉన్న ఆ ప్రదేశంలో ఒక్కసారిగా నిశ్శబ్దం రాజ్యమేలింది. నరహరి మాటలకు తల్లి తండ్రులతో పాటు, అక్కడి సభికులందరు నిశ్చేష్టులైపోయారు. దైవీ సంపదతో పుట్టిన బాలుడి నోటి వెంట బాణంలాగా దూసుకువచ్చిన ఆ మాటకు పర్యవసానమేమిటి? కొన్ని సంవత్సరాలుగా బాలుడి గురించి క్షోభమనస్కులయిన వారు, తిరిగి మరింత మనోక్షోభను భరించగలరా! నాలుగు వేదాలు పుక్కిట పట్టిన ఆ బాలుడికి తల్లితండ్రులపట్ల బాధ్యత గురించి ధర్మం చెప్పేది ఎవరు? జగత్ప్రభువుకు జన్మనిచ్చిన ఆ తల్లి తండ్రుల ఆవేదన బాపేది ఎవరు? అక్కడ చేరిన పండిత, దైవజ్ఞ, బ్రాహ్మణ సహిత పామరులందరూ ఎవరికి వారు నిశ్శబ్దముగా ఉండిపోయారు... పర్యవసానం ఏమిటో వచ్చే సంచిలో ప్రస్తావించుకుందాము.

# గురుదేవులు

"రామో విగ్రహవాన్ ధర్మః" అని రామాయణ వాణి. అంటే "ధర్మమే రాముని స్వరూపం ధరించినదని" అర్థం. అన్ని కాలాలలో, యుగాలలో మార్పులేనిది ధర్మం. ఆ భగవంతుడెలా ఉంటాడో నాకు తెలియదు. ఆయన గురించి కీర్తించిన శాస్త్రాలను నేను చదవలేదు. కానీ, నేను చూచిన నాకనుభవమైన ఆ భగవంతుడే నా పరమ సద్గురు దేవుడైన భరద్వాజ మహరాజ్‌గా నాకు దర్శనం ప్రసాదించారు. నాకు వారు దత్తాత్రేయుడుగా దర్శనమిచ్చారు కూడా. వారు నేటికి సజీవులే. వారు సమాధి అనంతరం కూడా సశరీరంతో దర్శనమిస్తున్నారు. ఇక స్వప్న దర్శనాలు లెక్కలేనన్ని. ఒక్క మహానుభావుడి దర్శనం లభ్యమవడం అంటే కోటి జన్మల పుణ్యఫలమని శ్రీమద్భాగవత వాణి చెపుతున్నది. అటువంటిది నా పరమ పూజ్య గురుదేవులైన మాస్టారుగారి దివ్యదర్శనం కావడం, తొమ్మిది సంవత్సారల పాటు వారిని సేవించే భాగ్యం కలగడం, అవధూతల, మహాత్ముల దర్శన భాగ్యం కలగడం నా గురుదేవుడి కృపా విశేషం.



ఒక సందర్భంలో వారు విద్యానగర్‌లో నాతో, "ఏమోయ్, నీకు మద్రాసు నుండి ఢిల్లీకి రైలు టిక్కెట్లు కొని ఇచ్చాను. మధ్యలో ఎక్కడా దిగకుండా ఉంటే నీవు గమ్యం చేరుతావు. మధ్యలోనే అందాలకు మురిసి వాటి వెంట పడ్డావా, గమ్యం చేరలేవు. ఏం చేసుకుంటావు అనేది నీ చేతిలో ఉంది." అన్నారు. మరొకసారి, "నీ తాళం చెవి నా వద్ద ఉంది. నీవెక్కడికి పోతావు?" అన్నారు. ఇవన్నీ కూడా వారికి మాపై ఉన్న అపార ప్రేమకు చిహ్నాలు మాత్రమే.

పశుప్రాయమైన జీవితాన్ని గడుపుతున్న నన్ను సరిదిద్ది, సరియైన మార్గంలో ఉంచి బంధ విముక్తుడ్ని చేయడానికే అలా నాకు దర్శనం ఇచ్చారు. అనేక రీతుల నడిపిస్తూ శిక్షణ ఇస్తున్నారు. ఉద్యోగరీత్యా విద్యానగర్‌లో నేనున్న రెండేళ్ళ కాలంలో వారిని ప్రత్యక్షంగా సేవించే అదృష్టం, నిశితంగా పరిశీలించే అవకాశం వారే కల్పించారు. ఆ అవకాశమే లేకపోతే నేనూ చాలా మందిలాగా వారిని అపార్థం చేసుకోవడమో, వ్యతిరేక భావాలు వహించడమో సంభవించేదేమో!!

మాస్టారిగారిలో నన్ను ఆకట్టుకొన్నవి : వారి ధర్మ నిష్ఠ, అపార ప్రేమ తత్త్వం. నా గురుదేవులు ఇబ్బందుల పాలై తననాశ్రయించిన వారందరికీ సకల శుభాలను, శ్రేయస్సును ప్రసాదించారు. తాము సంపాదించిన ధనాన్ని కనీస అవసరాలకు పోగా, మిగిలిన ధనాన్ని, దాన ధర్మాలకు వినియోగించడం నేను ప్రత్యక్షంగా చూచాను. వారి త్యాగం అవర్ణనీయం. మాట మాత్రంగా చెప్పడమే కాక ఆచరణ ద్వారా మార్గదర్శకం వహించడం వారి ప్రత్యేకత.

పూజ్యశ్రీ మాస్టరుగారు వారి కొరకు వారు ఒక్క క్షణం కూడా జీవించక, జీవిత కాలమంతా మనందరి ఉన్నతి కోసం, శ్రేయస్సు కోసం శ్రమించారు. వారి పిలుపు, చూపు, చిరునవ్వు ఎంతో ఆప్యాయంగా, ఆదరంగా, ప్రేమమయంగా ఉండేవి. వారి సన్నిధి ఎంత ప్రశాంతతను, నిర్భయత్వానిస్తుందో నా అనుభవం లోంచి మనవి చేస్తాను. నా గురుదేవులు మృత్యుముఖం నుండి మూడు సార్లు నన్ను రక్షించిన ఆపద్బాంధవులు. వారి ఆజ్ఞ లేనిదే మరణం కూడా నన్ను తాకలేదని నా నిశ్చయమూ, దృఢ విశ్వాసమూ. మన శ్రేయస్సును నిరంతరం కనిపెడుతూ, మనల్ని శుభ్ర మార్గాన తీసుకు పోవడానికి తపిస్తున్న మాస్టారి బాటలో సాగిపోదాము.

(అక్టోబరు 30వ తేదీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **డా॥ వి.సి.వెంకటేశ్వర్లు**, పుత్తూరు.




**కోసూరి శ్రీనివాసరావు**

ప్రొప్రయిటర్



**కోసూరి టూర్స్ & ట్రావెల్స్**

**లాయరుపేట, ఒంగోలు - 523 003**

**ప్రతినెల శిరిడీ, దత్తక్షేత్ర సందర్శన నిమిత్తము మరియు ప్రతి మే నెలలో కాశీ-కేదార్‌యాత్ర నిమిత్తము టూరిస్ట్ బస్సులు ఏర్పాటు చేయబడును.**

**కాలేజీ విద్యార్థినీ విద్యార్థులకు విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన విహారయాత్రలు ఏర్పాటు చేయుట మా ప్రత్యేకత**

***Contact :***

**9849531232, 9885895304, 9966953898**

# మార్గం చూపిన మాస్టారు

మాస్టర్‌గారు అన్నగారు శ్రీ కృష్ణమాచార్యులుగారు వైజాగ్‌లో 1965-66లో వున్నప్పుడు మేము మాస్టరు సి.వి.వి.ప్రేయర్సుకు వెళ్ళేవాళ్ళము. అలా వారి అన్నగారితో పరిచయం ఏర్పడినది. తరువాత నా పరిస్థితి తారుమారై 1978లో ప్రకాశం జిల్లా, ఒంగోలు పంచాయితీ సమితిలో ఉపాధ్యాయినిగా చేరినాను. 1980 సొసైటి ఎన్నికలు మా గ్రామంలో జరిగినపుడు కలెక్టర్ ఆఫీసు నుండి తీర్థులుగారు ఆ ఎన్నికలు నిర్వహించడానికి వచ్చి, మాటల సందర్భములో ఆచార్యులు గురించి చెప్పారు. నాకు వారిని దర్శనం చేసుకోవాలని వున్నదండీ అన్నాను. 2 నెలలు అయ్యాక నన్ను గుర్తుంచుకొని ఆచార్యులుగారు, వారి అన్నగారు శ్రీ కృష్ణమాచార్యులుగారు రెడ్‌క్రాస్ బిల్డింగులో ఉపన్యాసము చెప్పటానికి వస్తున్నారు అని కబురు చేశారు. తీర్థులుగారి పుణ్యము వలన మాస్టర్‌గారి ప్రథమ దర్శనభాగ్యం కలిగి ఆరోజే ఉపన్యాసం విని బాబా ఫోటో, బాబావారి చరిత్ర తెచ్చుకొని పారాయణ మొదలుపెట్టాను. మాస్టారుగారితో మాట్లాడాలని వుండేది. ఒక సంవత్సరం తర్వాత కొత్తపేటలో ఒకరి ఇంట్లో (పేరు గుర్తులేదు) సత్సంగం చెప్పటానికి మాస్టరుగారు వచ్చారని తెలిసి వెళ్ళి నమస్కారము చేసుకొని వారి చేతిగుండా ప్రసాదం తీసుకొని వచ్చాను. ఒంగోలు సంతపేటలో ప్రెస్ పెట్టినప్పటి నుండి వారిని దర్శించినప్పుడల్లా ఎన్నో అమూల్యమైన విషయాలు చెప్పేవారు.



మాస్టర్‌గారి దగ్గరకు వెళ్ళినప్పుడల్లా ఒకేమాట చెప్పేవారు. "నీవు వృత్తిరీత్యా ఉపాధ్యాయినివి గదమ్మా, మీ పిల్లలకు చక్కగా బాబా గురించి చెప్పు. వారితో బాబా గురించి చెప్పిన మంచి విషయాలు విత్తనాలై, మహావృక్షాలై, ఎందరికో మార్గదర్శకమౌవుతాయని" చెప్పారు. బాబా గురించి చెప్పేదాన్ని అవకాశం వచ్చినపుడల్లా అలా ఆ పల్లెటూరులో బాబా గురించి విని ఎంతోమంది బాబా భక్తులైనారు. కొంతమంది నా విద్యార్థులు మాస్టర్‌గారి దగ్గరకు వెళ్ళి దర్శనం చేసుకొని ప్రసాదం తీసుకొనివచ్చిన వారున్నారు. ఇప్పటికి మాస్టర్‌గారిని గుర్తుచేసుకుంటారు. మేము అదృష్టవంతులం మాస్టర్‌గారిని దర్శనం చేసుకున్నాము అంటుంటారు. ఆ విద్యార్థుల వల్ల వారి తల్లిదండ్రులు బాబా మార్గంలో పయనిస్తున్నారు. ఆ విద్యార్థులు ఇప్పటికి, ఎప్పటికి మాస్టర్‌గారిని తలవందే ఏ పని చేయరు.

ఒకసారి చీరాల అవధూతస్వామి ఆరాధనకు వెళ్ళాము. అవధూతస్వామి దగ్గర మాస్టరుగారి దర్శనం అయింది. మాస్టరుగారితో సత్సంగము, పూజలో పాల్గొనడం జరిగింది. మేము వేరే ఊరు నుండి వచ్చామని తను విడిది చేసిన ఇంటికి పిల్చుకొనిపోయి, వారితో పాటు భోజనం ఏర్పాటు చేశారు. వారి దయ ప్రేమ ఎన్ని జన్మలకు మరవలేము. మా అనుభవాలు లెక్కలేనన్ని.

ఒకసారి నెల్లూరులో దత్తసాయి మందిర ప్రతిష్టకు మాస్టరుగారు, శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు వచ్చారు. ఆ ప్రతిష్టలో వారిరువురి పాద దర్శన భాగ్యం కలిగించారు. దత్తుడిని గురించి వివరించి ఇరువురు ప్రసంగించారు. మన మనస్సులో మెదిలే ప్రశ్నలకు వారి ఉపన్యాసములోనే సమాధానం వచ్చేవి. ఎన్ని జన్మల పుణ్యఫలమో వారిని కొద్దికాలం దర్శించే భాగ్యం కలిగింది. మాస్టరుగారు ఏ విషయమైన ఆజ్ఞాపించరు. ఊరికే అలాచేస్తే బాగుండునేమోనని చిన్న సూచన ఇస్తారు.

క్రమంగా వారి సమాధి అయ్యేవరకు 15 రోజులకు నెలకొకసారి వెళ్ళి వారిని దర్శించేవారము. నా దగ్గరకు రావాలన్నా బాబా ఆశీస్సులు వుంటేగాని రాలేరని చెప్పేవారు. అవధూతలను గురించి చెప్పేవారు. వారి దయవలన శ్రీ గులాబ్‌బాబా గారిని, శ్రీ పూర్ణానందస్వామి గారిని, తిరువణ్ణామలైలో వున్న రామసూరత్ కుమారులను చూడగలిగినాము. ఎన్నో సమస్యలతో, మానసిక బాధలతో వెళ్తే ఆ చల్లని పిలుపు, ''బాగున్నావమ్మా'' అనగానే ఎంతో సంతోషముగా వుండేది.

నిత్యసత్యులైన వారి సమాధికి మంచి సంకల్పముతో చెప్పుకుంటే ఇక రాజముద్రే అలా జరిగిపోతుంది. కాని వారి అనుగ్రహం కలగాలంటే మనం "శ్రీగురుచరిత్ర", "శ్రీసాయిలీలామృతము" పారాయణ చేయాలి. పారాయణ మన జీవితంలో భాగం కావాలి. అప్పుడే వారి దర్శనభాగ్యం, ఆశీస్సులు మనకు ఉంటాయి.

1983-84 సంవత్సరములో అనుకుంటా శిరిడీ వెళ్లలేకపోతున్నానంటే ఒంగోలు మందిరం రెండవ శిరిడీ అమ్మా- శిరిడీ వెళ్తే ఎంత ఫలమో అంతే ఫలం ఈ మందిర దర్శనం అని అన్నారు. అప్పటికి సత్సంగ మందిరం ఒక్కటే ఏర్పడిఉన్నప్పుడు- తరువాత మాటల సందర్భంలో మీరు సినిమాలకు చేసే ఖర్చు, ఇతర పనికిరాని ఖర్చు చేసేటప్పుడు- ఆ డబ్బు హుండీలో వేయండి. మీరు శిరిడీ వెళ్ళగలరు. మీతో ఇంకొకరిని కూడా తీసుకొని వెళ్ళగలరని చెప్పేవారు. వారి ప్రతిమాట ఎదుటివారి హృదయంలోనికి సూటిగా దూసుకొని వెళ్తుంది. ఇక ఆమాట ఎప్పటికి మర్చిపోలేరు. అవి మహామంత్రాలు.

(అక్టోబరు 30వ తేదీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ జయంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **సాయినాటిన కల్పవృక్షం**

రచన : **ఐ.వి.రమణ**, రిటైర్డు ఉపాధ్యాయురాలు, కొత్తపట్నం

# జిజ్ఞాస

వివిధ సందర్భాలలో భక్తులు అడిగిన ప్రశ్నలకు సాయి మాస్టర్ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు అందించిన జ్ఞానగుళికలు అక్టోబరు 30వ తేదీ వారి జన్మదిన సందర్భముగా మీకందిస్తున్నాము.

**ప్రశ్న : నేనెన్నో సంవత్సరాలుగా పూజ, పారాయణ, జపం చేస్తున్నా నాకెలాంటి అనుభవాలు గాని, దైవమున్నట్లు నిదర్శనము గాని లేవు. నా గతేంటి? నా తప్పేమిటి సార్?**

**మాస్టర్ :** మనం చేసిన 1. వాగ్దానాలు, 2. ప్రమాణాలు, 3. బాధ్యతలు, 4. ఋణానుబంధాలు నెరవేర్చకపోవటమే అందుకు కారణము. అర్థేచ, కామేచ, ధర్మేచ, మోక్షేచ నాతి చరామి ఆచరించుచున్నావా? నీ బాధ్యత, కుటుంబ బాధ్యతగానీ, ఆఫీసు బాధ్యతగానీ సక్రమంగా నూటికి నూరుపాళ్ళు అనుసరిస్తున్నావా? పెండ్లి నాటి ప్రమాణాలు ఏమి చేశావు?



నీవు చెప్పిన సాధనలన్నింటికీ ఫలితం రావాలంటే పెండ్లినాటి ప్రమాణాలు సెంట్ పర్సెంట్ ఆచరించాలి. అర్ధాంగి లేకుండా ఆకలి చల్లార్చుకోవడం తప్ప మిగిలిన ఇంద్రియ సుఖాలు ఎప్పుడూ ఎట్టి పరిస్థితులలోను అనుభవించరాదు. మనం కమ్మని టీ పార్టీలు, విందు భోజనాలు, స్నేహితుల బలవంతాలకు లొంగి ఏ ఇంద్రియ సుఖం అనుభవిండం లేదో చూచుకో

**ప్రశ్న : పుణ్యం పాపాన్ని రద్దు చేస్తుందా?**

**మాస్టర్ :** రద్దు చేస్తుంది, రద్దు చేయదు.

**ప్రశ్న : అదెట్లా సార్, రెండు సమాధానాలూ కరెక్టు ఎట్లా అవుతాయి?**

**మాస్టర్ :** ఒకనికి ఒక సమయములో కేవలం పాపమే అనుభవం కావాలి. పుణ్యం లేనేలేదు. అతనికి చలి జ్వరమొచ్చింది. ఉండేందుకు ఇల్లు లేదు కనుక బస్ షెల్టరులో అరుగు క్రింద ముడుచుకొని ఉన్నాడు. మందులేదు. కప్పుకోను దుప్పటిలేదు. పొట్టకు ఆహారం లేదు. అది అతని పాప ఫలితం. పుణ్యం సున్నగదా!

మరియొకనికి ఒకే సమయములో పాప, పుణ్యాలు రెండూ అనుభవమవలసి ఉంది. అతనికి కూడా పాప ఫలితంగా చలిజ్వరమే వచ్చింది. కానీ పుణ్య ఫలితంగా మంచి ఇల్లు ఉంది. సేవచేసే భార్య ఉంది. ఇంటికి డాక్టరు వచ్చి మందులిచ్చిపోతాడు. కడుపుకు ద్రవాహారం నోటి దగ్గరకు వస్తుంది. కప్పుకోను మంచి ఉలన్ రగ్గు ఉంది. ఈ వసతులన్నీ పుణ్యఫలంవల్ల కలిగాయి. పాపఫలంవల్ల పై వ్యక్తి వంటి చలిజ్వరమే ఉంది. కానీ ఇల్లు, భార్య, ఆహారం, డాక్టరు, రగ్గులు, మందులు ఉన్నందువలన పై వ్యక్తిలాంటి బాధలు లేవు కనుక పాపఫలం అనుభవిస్తున్నా అది అనుభవించనట్లే అవుతుంది. అంత బాధ లేదు. రెండో వ్యక్తి విషయంలో పాపం పుణ్యంవల్ల రద్దయినదనే చెప్పవచ్చు. ఆలోచించు, ఆర్గ్యుమెంటు కాదు.

**ప్రశ్న : అతి తెలివి ప్రదర్శించడమంటే ఏమిటి మాస్టారు?**

**మాస్టర్ :** ఒక రూము నిండుగా బంగారు కడ్డీలు, నాణాలు పోసి తలుపులు తాళం వేసి ఉంచారు. ఒకడు బాధపడుతుంటే ఆ రూము తాళంచెవి అతని చేతికిచ్చి ఆ రూములోని బంగారు కడ్డీలు, నాణాలు కావలసినన్ని తీసుకుపోయి నీ కష్టాలు తీర్చుకోమన్నారు. అతడు వారిదగ్గర ఆ రూము తాళంచెవి తీసుకొని ఆ రూము ద్వారము దగ్గర నిలబడి ఇలా అనుకోసాగాడట "ఈ రూములో అంత పెద్దనిధి ఉంటే ఇలాంటి తాళం బుర్రవేస్తారా? ఈ తాళం బుర్ర ఇనుముతో చేశారేమిటి? ఈ తాళం బుర్రకు ఎన్ని లివర్స్ ఉన్నాయి? అంత నిధి ఉంటే దీనికి కాపలా ఎవరినీ పెట్టలేదేమిటి? అని ఇంకా ఎన్నో ప్రశ్నలు వేసుకుంటూ ఆ రూము ముందు నిలుచొని జాప్యం చేస్తున్నాడుగాని రూము తలుపు తీసి మాత్రం చూడలేదు. అంతలోనే అతడు పెద్ద దొంగ అని నిర్ణయించుకొని సైనికులు వచ్చి అతనిని పట్టుకువెళ్ళి జైలులో వేశారు. ఇలాంటిది మన సంగతి. చెప్పినట్లు చేసి ఆధ్యాత్మిక శక్తి పొందక అనవసరమైన ప్రశ్నలతో కాలయాపన వల్ల లాభమేమిటి?"

**ప్రశ్న : మనం చేసే పూజను బొమ్మలాటలతో కొందరు పోలుస్తారు దానికి ఫలితం వస్తుందా?**

**మాస్టర్ :** "బొమ్మరిల్లు అని ఇసుకతో కట్టివేసి దానిని ఇల్లు అంటారు చిన్నపిల్లలు. అందులో అనేక ఇసుక కుప్పలు పెట్టి ఇది అమ్మ, ఇది నాన్న, ఇది తమ్ముడు అంటారు. ఇది అన్నం, ఇది కూర అని చెబుతుంటారు. మనమూ అంతే. అలాంటి ఆట పటాల దగ్గర ఆడుకొని తిరిగి వస్తాము. అక్కడ ఆడిన ఆటకు అర్థం తెలుసుకోము. మన నిత్య జీవితంలో ఆ ఆటను పోలిన నిజమైన పనులు చేయము. మరి ఫలితం ఎలా వస్తుంది?

**ప్రశ్న : నిరంతరం సలహాలిచ్చేవారికి మీ సూచన.**

**మాస్టర్ :** డాక్టరుగారు మనకు ఆపరేషన్ చేస్తుంటే మనం "ఈ కత్తెర ఇలా త్రిప్పు, కాస్త నెమ్మదిగా కట్‌చెయ్, ఈ ఫోర్‌సెప్స్ ఇలా పట్టుకో" అని చెపుతుండటం ఎంత సబబుగా ఉంటుంది? ఆ పని చేసేవారికి స్వేచ్ఛనిచ్చి చేయనివ్వాలి గాని ప్రతి చిన్నదీ మన ఇష్టానుసారం జరగాలని తలచడం మంచిది కాదు.

# తమసోమా జోతిర్గమయ

"ఉన్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపన – ఇదే మానవ జీవిత సారమంతా" అనేది పరమ గురుదేవులు భరద్వాజ మహరాజ్ గారి వాణి. అంటే మనకెన్ని ఉన్నా, ఎంతవున్నా ఇంకా కావాలనే, ఇంకా చాలలేదనే తప్ప వున్నదానితో అంటే భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తిపడడమనేది మనందరి జీవితాలలో లేనే లేదు. అంటే దీని అర్థం నిష్క్రియత్వం కాదు. భగవద్గీతలో కర్మయోగంలో జగద్గురువు శ్రీకృష్ణుడు చెప్పినట్లు మన ప్రయత్నాలను మనం చేసి తీరాలి, ఫలితాన్ని భగవంతునికి వదలాలి. ఎందుకంటే మనం ఇప్పుడు ప్రయత్నం చేయకపోతే తర్వాత జీవితంలో విచారించవలసి వస్తుంది. అదే మనం మన ప్రయత్నాన్ని చేసివుంటే ఆ పని అయివుండేదేమో అనే చింత మనలను తర్వాత జీవితంలో బాధపడకుండా వుండేందుకే మన పెద్దలు అలా నిర్దేశించారు. ఫలితము మన ప్రాప్తాప్రాప్తాలను బట్టి వుంటుంది. ఇది మనందరి దైనందిన జీవితాలలో చూస్తున్నాము. ఎంతటి ధనవంతునికి కూడా ఒక్కొక్కప్పుడు చిన్న పని కూడా చేసుకోలేకపోవడం మనం చూస్తూనే వున్నాము. అదే గుర్తు మనకు మనం ఎంత ప్రయత్నించినా మనకు ప్రాప్తం లేకపోతే జరగదు. అంతమాత్రం చేత మనం నిరాశ చెందవలసిన పనిలేదు. "భగవంతుడు మనలనెలా సృష్టిస్తే అలానే ఉండాలి" అనే సాయినాధుని సూక్తిని అర్ధవంతంగా, సమన్వయపూరితంగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలే కానీ అసంతృప్తి పడకూడదు.



సాయినాధుడు చెప్పినట్లు నిష్ఠ, సబూరిలతో స్వీకరించడమే మనం చేయవలసినది. మనం అలా నడచుకున్నప్పుడు శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాలను మనకు ప్రసాదిస్తాడు సాయి.

ఇక శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాలంటే ఏమిటో కాస్త యోచిద్దాం. దీనినే మన ఋషులు సచ్చిదానందమని అన్నారు. ఈ తృప్తి, శాంతి, ఆనందాలు మనకేమైనా బజారులో దొరికే వస్తువా? అదే వాస్తవమయితే ఇది వరకే మనం దానిని ధనంతో ఎప్పుడో కొనేసి వుండేవాళ్ళం. అది అలా దొరికేది కాదు. మరి దొరికే మార్గమేమిటి? ఎలా? ఈ ప్రశ్న ప్రపంచంలోని సర్వజనావళిని పట్టి కుంగదీస్తున్న ప్రశ్న. దానిని పొందేందుకు జన బాహుళ్యం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కాని అది అందరికీ లభ్యం కాలేదన్నదానికి మన దుఃఖభూయిష్టమైన జీవితమే ఉదాహరణ. మరి అటువంటి జీవితమొకటున్నదా? లేదా? ఉంటే అది లభ్యమవుతుందా? మరి ఇదే వాస్తవమయితే మహాత్ములు దానినెలా సాధించి నిరంతరం ఆనందంలో నిమగ్నమైయున్నారు? కాబట్టి అది బయట దొరికే వస్తువు కాదని తేలిపోయింది. అది మనలోనే వున్నదని తెలుస్తున్నది. మరి అది మనలోవుంటే మనకెందుకు అనుభవం కావటంలేదు? స్వప్నం కూడా లేని గాఢమైన నిద్రలో మనకు కష్టాలు, దుఃఖాలు వున్నాయా? అనుభవమవుతున్నాయా? లేదు. నిద్రనుండి లేచిన తర్వాత చాలా హాయిగా నిద్రపోయామని అంటుంటాం. అంటే ఇక్కడ జరిగే ప్రక్రియను మనం జాగ్రత్తగా గమనించాలి. ప్రకృతి ద్వారా వచ్చే విషయాలను ఇంద్రియాల ద్వారా మనసు గుర్తించి తదనుగుణంగా మనసు ప్రవర్తిస్తున్నది. అంటే బాహ్యేంద్రియాల ద్వారా సేకరించిన విషయాలను మనసు గ్రహించడం వలన విపరీతంగా కలత చెంది మనలో ఉన్న తృప్తి, శాంతి, ఆనందాలు మనకు అనుభవం కాకుండా పోతున్నాయి. కాని గాఢనిద్రలో మనసు తాత్కాలికంగా లయమవుతున్నది, కాబట్టి నిద్రలో బయటినుండి వచ్చే విషయాలు మనస్సుకు చేరని కారణంగా, మనసు వాటిని గుర్తించని కారణంగా, హాయి అనుభవమవుతుంది. ఇది జరుగుతున్నది నిద్రలో కదా మరి మెలుకువలో దీనిని సాధించడమెలా అంటే, దీనిని సాధించాలంటే సద్గురు సమాశ్రయం అనివార్యం. మెలుకువలో దీనిని సాధించడానికి వారి వారి సంస్కారాలననుసరించి వివిధ సాధనామార్గాలను సద్గురువు చూపిస్తారు. మరి ఆ మార్గంలో పయనించవలసినది మనమే కదా కాబట్టి ధన సంపాదనలోను, కీర్తిప్రతిష్టలను ఆర్జించడంలోను, అధికారాన్ని చలాయించడంలోను మనకు తృప్తి, శాంతి, ఆనందాలురావు. రావనడానికి మనమే నిదర్శనం. నిరంతరం వాటి వేటలో పడి వాటి వెనుకనే పరుగులుపెడుతూ, మహాత్ములు చెప్పిన వాక్యాలను పెడచెవిని పెడుతూ, రాగ, ద్వేష పూరితమైన జీవితాలను కొనసాగిస్తున్న మనకు తృప్తి, శాంతి, ఆనందాలు గగన కుసుమాలే. ఎడారిలో ఒయాసిస్ లాంటిది, అంటే ఎండమావులే.

కాబట్టి అటువంటి దుఃఖభూయిష్ట జీవితంనుండి విడివడడానికి సద్గురు సమాశ్రంతో వారి ఉపదేశాల స్మరణం, మననం, ఆచరణలతో మనమందరం అజ్ఞానమనే చీకటిని చీల్చుకుని జ్యోతి మార్గంలో పయనిద్దాం. అందుకొరకు మనమందరం ఈ క్షణంనుండి కలిసి నడుద్దాం, కలిసి ప్రార్థిద్దాం. సద్గురు సాయినాధుడు మనల్నందరిని ధర్మమార్గంలో నడిపించి రాగద్వేష రహితమైన జీవితాన్ని ప్రసాదించిటానికి, ఆయన వైపు ఒకడుగు వేసేలా ప్రయత్నిద్దాం అప్పుడే ఆయన మనవైపు పది అడుగులు వేయటానికి సిద్ధంగా ఉంటారు. ఇందులో మనం మునిగి తేలి తరిస్తామో లేక పునరపి జననం పునరపి మరణంగా అవుతామో మనమే తేల్చుకోవాలి.

ఈ వ్యాసానికి ప్రేరణ నా పరమ గురుదేవులైన సద్గురు భరద్వాజ మహరాజ్ గారు వివిధ సత్సంగాలలో వారు చెప్పిన విషయాలు ఆధారంగా వ్రాయడం జరిగింది.

రచన : **వి.సి.వెంకటేశ్వర్లు**, పుత్తూరు



# పూర్ణ అంతరంగాలు

సృష్టిలో ప్రతి జీవికి జన్మించిన మరు క్షణం నుండి అనేక రూపాలలో అనేక విధాలుగా గురువు తోడై ఉంటారు. తెలిసినా తెలియక పోయినా, ఆ ప్రభావముతోనే ఎదగటము ప్రారంభమవుతుంది. ఎదగటమే ప్రధానముగా కాకుండా ఎట్లా ఎదుగుతున్నాము అన్నదే ముఖ్యం. "సృష్టిలోని ప్రతిదానికి మార్పు అనివార్యం, అయితే మార్పు కాయ పండటము లాగా ఉండాలి గాని, కుళ్ళిపోవటము లాగా ఉండకూడదు" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ. ఆలోచిస్తే తన సహజ స్థితి నుంచి మార్పు చెందటమే కాయ పండుగా మారటము, తద్వారా దాని జన్మ సార్ధకత అయిన తరువాత పుడమి తల్లి ఒడిని చేరి, తిరిగి పునర్జీవించి, అనేకమవుతుంది. కుళ్ళిన కాయ, జీవితం అర్ధాంతరముగా ముగిసి పుడమిలో కలిసిపోతుంది. ఏన్నో జన్మల తరువాత లభించిన మానవ జన్మను సార్ధకత చెందించుకొని, ఉన్నతముగా ఎదిగి, పదిమందికి ఆదర్శముగా నిలవటానికి హేతువవ్వాలి గాని, తనకు, తనవారికి, తోటివారికి హాని కలిగించే విధముగా మారి, అధో జన్మలకు దిగజారకూడదనే మాస్టర్ ఇ.బి గారి హెచ్చరిక. అట్లా ఉన్నతముగా జీవితము మారాలంటే ఆ మార్గంలో తాము పయనించటమే కాకుండా, ఇతరులకు చేయూతనిస్తున్న వారి మార్గనిర్దేశకము అనివార్యమవుతుంది. జన్మించిన మరుక్షణం నుంచి పరిసరాల పరిశీలనతో ప్రారంభమయ్యే జీవితం, వాటి ప్రభావముతోనే ఎదుగుతూ, మార్పు చెందుతుంది. ఉన్నత సంజాతుల వంశములో పుట్టిన బిడ్డ, దుస్సాంగత్యము వలన జీవితాన్ని వ్యర్ధం చేసుకొని, కుటుంబానికి, సాటివారికి, సమాజానికి కూడా కంటకులయిన వారు ఉన్నారు. అట్టడుగు వర్గములో పుట్టినా, సజ్జన సాంగత్యముతో ఉన్నతముగా ఎదిగి, సమాజానికి, దేశానికి కూడా పేరు ప్రతిష్టలు తెచ్చిన వారు మరెందరో కలరు. "నీ స్నేహితుల గురించి నీవు చెప్పు, నీ గురించి నేను చెబుతాను" అన్న నానుడి ఒకటి కలదు. అదే సాంగత్యము. అందుకని జీవితానికి గురువు అవసరమా అంటే ఖచ్చితముగా అవసరమే. భగవాన్ రమణ మహర్షి చెప్పినట్లు గురువు అంటే బాహ్యముగానే ఉండాలని లేదు, వారి వారి సంస్కారాలను అనుసరించి అనేక రూపాలలో గురువు తారసిల్లి, అనేక విధాలుగా బోధించటము జరుగుతుంది. బోధించిన దానిని స్వీకరించే సంస్కారముననుసరించి జీవన ప్రగతి ఆధారపడి ఉంటుంది. అవధూత 24 మంది గురువుల నుండి జ్ఞానాన్ని సముపార్జించి, ఈ స్థితిలో ఉన్నానని యయాతి మహారాజుకు తెలిపిన విషయము అవధూతోపాఖ్యానంలో చూస్తాము. "ఈనాడు సాయినాధుడు సహస్ర ముఖాలతో, సహస్ర విధాలుగా బోధిస్తున్నాడు వినటం, చూడటం చేతకావాలి" అంటారు మాస్టర్ ఇ.బి. బోధించే వారు ఒకరయినా, సహస్రమయినా, స్వీకరించే వారి భావాన్ని (అందుకు సరిపడ సంస్కారము) అనుసరించి, నడవడి ఆధారపడి ఉంటుంది. అవధూతకు 24 మంది గురువులలో కన్య ఉన్నది, వేశ్య ఉంది, పాము ఉంది, కొండ చిలువ ఉంది, పంచభూతాలు ఉన్నాయి, పావురాలు ఉన్నాయి, బోయివాడు ఉన్నాడు ఇట్లా ఇంకా అనేకం ఉన్నాయి. అయినా వీటినుంచి స్వీకరించే విధానాన్ని అనుసరించి అది ఆధ్యాత్మికోన్నతి కలిగించే గురువు అవుతుంది. అది వారి వారి సంస్కారాలను అనుసరించి ఉంటుంది. జన్మతః సంక్రమించిన సంస్కారాలలో ఉత్తమమైన వాటిని పెంపొందించుకుంటూ, హాని కలిగించే వాటిని తొలగించుకుంటూ, తన చుట్టూ గురురూపమై ఆవరించి ఉన్న వాటిలో ఉత్తమమైన దాన్ని గ్రహించి జీవన పయనం

సాగించినప్పుడే అది ఉన్నత స్థితికి దారి తీస్తుంది. "మాకు అన్ని దిక్కుల నుండి ఉత్తమమైన భావాలే వచ్చుగాక" అని అలనాడే ఋషులు అడిగేరు అంటే, కలిపురుషుడి ప్రభావము తీవ్రమవుతున్న ఈనాటి పరిస్థితులలో, భావ దారిద్ర్యము, భావ కాలుష్యము మితిమీరి పోతున్న తరుణంలో, ఉన్నత గురువును గుర్తించి ఆశ్రయించి సేవించటానికి ఇంకెంత జాగరూకతతో వ్యవహరించాలి? మనకు జీవితంలో ఎదురయ్యే ప్రతీది గురువే, కొన్ని ఎట్లా జీవిస్తే జన్మ సార్థకత అవుతుందో తెలియజేస్తే, మరికొన్ని, వాటిని అనుసరించటము ద్వారా అధఃపాతాళానికి ఎట్లా దిగజారుతామో తెలియజేస్తాయి. ఉదాహరణకు బాగా చదువుకొని ఉన్నత స్థితి పొందిన విద్యార్థి గురువే, చదువును నిర్లక్ష్యం చేసుకోవడం ద్వారా జీవితంలో అధోగతి పొందిన వాడు గురువే, కొన్ని ఎలా ఉండాలో చెబుతాయి, మరికొన్ని ఎలా ఉండకూడదో చెబుతాయి, ఆ చిన్ని తేడాను గమనించి సరియైన దానిని ఎన్నుకొని, జీవితం సార్థకత చెందించుకోవటమే మానవ జీవిత లక్ష్యం కావాలి. అందుకు సాధన ఎంతో అవసరము. "సంస్కారాల మార్పు కోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు మాస్టర్ ఇ.బి. ఆ సాధన పుట్టుకతోనే ప్రారంభమవుతుంది. బిడ్డకు తొలి గురువు తల్లి, తాను చేసిన సత్కర్మలతో పాటు, కడుపులో బిడ్డను మోస్తున్న దగ్గర నుంచి, తల్లి మనో భావాలననుసరించే పుట్ట బోయే బిడ్డ మానసిక స్థితి ఆధారపడి ఉంటుంది అని అలనాటి భారతములో అభిమన్యుడు పద్మవ్యూహం ప్రవేశ విషయం తెలియజేస్తుంది. నేడు వైజ్ఞానికంగా కూడా దానిని అంగీకరించారు. సుభద్ర నిండు చూలాలుగా ఉన్నప్పుడు అర్జునుడు ఆమెతో యుద్ధరంగములో వ్యూహరచనల గురించి చెబుతూ, పద్మవ్యూహం రచన, దానిలోనికి ఎలా ప్రవేశించాలో చెప్పి, తిరిగి ఎలా బయటకు రావాలో చెప్పబోయే తరుణంలో శ్రీకృష్ణుడు పిలవటంతో అర్ధాంతరంగా వెళ్ళిపోతాడు. అటు పిమ్మట జన్మించిన బిడ్డ అభిమన్యుడికి మాత్రమే (పాండవులలో అర్జునుడికి తప్ప మరెవరికి తెలియని) పద్మవ్యూహం ప్రవేశం గురించి తెలిసింది. సగం వినటం కారణం వలన అభిమన్యుడికి పద్మవ్యూహ ప్రవేశం తెలుసు, కాని బయటకు రావటం తెలియదు. అందుకే గర్భిణి స్త్రీ మనస్సును, ఎటు వంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంతముగా ఉంచుకొని, మానవతా విలువలు బోధించే రామాయణ, భారత, భాగవతము మొదలైన పురాణాలు మొదలైనవి పఠించటమో, శ్రవణం చేయటమో చేయమనే వారు. తదనుగుణముగానే పుట్టిన బిడ్డ కూడ శారీరక, మానసిక కట్టుబాట్లతో ధర్మమెరిగి జీవించే వారు. ఏదైనా ఒకానొక సందర్భములో ధర్మము తప్పి చరించాలన్నా, అంతరాలలో గూడు కట్టుకున్న ధర్మం, ఎదురు నిలవగా, మానసిక సంఘర్షణకు లోనైన తరువాతనే తదుపరి చర్యకు సిద్ధమయ్యే వారు. అందుకే ఎనభై, తొంభై సంవత్సరాల క్రితం జన్మించిన వారిలో చాలామంది అనైతిక చర్యకు పాల్పడాలంటే అమితమైన మానసిక సంఘర్షణను ఎదుర్కోవల్సి వచ్చేది. నేడు యాంత్రిక యుగంలో అనేక ప్రసార మాధ్యమాల, పత్రిక ద్వారా అనేక రూపాలలో, అనేక విధాలుగా ఎంత కాదనుకున్నా, పరిస్థితుల ప్రభావము వలన అనేక రూపాలలో తల్లి, బిడ్డలపై వాటి ప్రభావము ఉంటున్నది. వాటిని అధిగమించటానికి, ఇష్టముతో కూడిన తీవ్రమయిన ప్రయత్నము అవసరము. ఇక నాగరికత అంటూ నేటి పాశ్చాత్య ప్రభావానికి లోనయ్యి, తగురీతిన తాము జీవిస్తూ, అదే జీవితాన్ని తన సంతతికి ప్రసాదించే వారి విషయము చెప్పనవసరము లేదు. దాని పర్యవసానము జగమెరిగిన సత్యమే. అందుకనే బిడ్డలకు తల్లి ప్రథమ గురువు అంటారు. అటు పిమ్మట జ్ఞాన సముపార్జనకై జీవితాన్ని మరల్చుకొనే విధము తెలిపిన తండ్రి మలి గురువు, పొందిన జ్ఞానాన్ని విచక్షణతో ఎట్లా ఉపయోగించాలో తెలుపుతూ తనకు, సర్వులకు హితం చేకూర్చే విధముగా ఎట్లా జీవించాలో తెలియజేసే వారు ఆధ్యాత్మిక గురువు. ("మనిషి మనిషిగా, మానవత్వంతో తన మనుగడ కొనసాగించి, మహనీయుడై మహోన్నతుడుగా మారి, జాతికి స్ఫూర్తి ప్రదాతగా నిలవటానికి మన పూర్వీకులు అందించిన నిర్దుష్టమైన మార్గం" ఆధ్యాత్మికత అంటే). తల్లి ప్రథమ గురువు అవటములోని మరొక పారమార్థిక భావం ఉంది. తల్లి, స్త్రీ:-ప్రకృతి స్వరూపము మన చుట్టూ అనేక రూపాలలో అనేక విధాలుగా ఆవరించి ఉంటుంది తల్లిగా, చెల్లిగా, భార్యగా, సన్నిహితురాలిగా, స్నేహితురాలిగా ఇంకా అనేక రూపాలలో నిత్యము మనకు ఎదురవవుతూనే ఉంటుంది. అందరిలోను ఉన్న స్త్రీ తత్వము ఒక్కటే, కానీ చూసే దృష్టి, చేసే భావన, ప్రవర్తించే తీరు, అనుసరించే విధానముపై మనుగడ ఆధారపడి ఉంటుంది. ఆకారణముగా మన చుట్టూ అనేక రూపాలలో ఆవరించి ఉన్న ప్రకృతే "స్త్రీ" – శక్తి. ఆ విధముగా చూస్తే ప్రకృతి ప్రథమ గురువు అవుతుంది. "బ్రహ్మ నా తండ్రి, మాయ నా తల్లి వారిద్దరి ఐక్యం వల్లనే నాకీ దేహం వచ్చింది" అంటారు సాయిబాబా. మన చుట్టూ ఆవరించి ఉన్న ప్రకృతిని కనుక పరిశీలించి చూస్తే అనేక అద్భుతమైన విషయాలను బోధపరుస్తుంది, అందుకు తగ్గ సంస్కారము అలవరచుకోవాలి. "ఏ ప్రకృతి అయితే జిజ్ఞాసువులకు ఆలంబన అయ్యి తనలోని ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడి చేస్తుందో, అదే ప్రకృతి, వికృతి మనస్కుల పాలిట మృత్యువై నిలుస్తుంది" అంటారు మాస్టర్ ఇ.బి. అడవిలోకి కట్టెలుకొట్టుకునే వారు, మూలికలు సేకరించే వారే కాకుండా, సామాన్యుల దగ్గర నుంచి తపోధనుల వరకు ఎందరెందరో అడవిలోకి వెళతారు. ఆత్మజ్ఞానము సముపార్జనకై నలుగురితో కలసి అడవికై బయలుదేరానని సాయినాధుడు స్వయముగా తన గురుసేవా వృత్తాంతములో చెప్పిన విషయం చరిత్రలో చూడవచ్చు. ఫలితం మాత్రము వారు అనుసరించిన విధానాలపై ఆధారపడి ఉంటుంది. చింతపల్లి అడవులను తన పాదస్పర్శతో పునీతము చేసి, నేటికీ గిరిజనుల పాలిట

శ్రీరాముడుగా కొలువబడుతున్న యోగీంద్రులు శ్రీ పాకలపాటి గురువుగారు పర్యటించిన ప్రదేశములన్నీ సస్యశ్యామలము కాగా, ఆ ప్రకృతి మధ్యే నివసించే వారిలోని కొందరు దుష్ట సంస్కారముతో మంత్ర, క్షుద్ర విద్యలు పాలు కాగా, చివరకు వాటి వల్లనే వారు తమ జీవితాన్ని అర్ధాంతరముగా ముగించటము చరిత్రలో చూడవచ్చు. బాబా దగ్గరకు ఒక భక్తుడు వచ్చి ఏమైనా బోధించమని అడిగితే "బోధించేముంది చూసి నేర్చుకునేదే కదా" అన్నారు. చూడటం అందరము చూస్తాము, అయితే ఏమి చూడాలి, ఎలా చూడాలి, చూసి ఏమి గ్రహించాలి, గ్రహించిన దానిని ఎట్లా అన్వయించుకొని ఆచరించాలో తెలియాలి, అంటే ఆ మార్గంలో పయనించి ఆ స్థితి పొందిన వారి సహకారము అత్యావశ్యకము, వారిని గురువు అనండి, మార్గదర్శి అనండి, మన సంస్కారమునుసరించి వారు ఎదురవుతారు. "ప్రతీది ప్రత్యక్ష నిరూపణ కావాలి" అని అడగటమే కాని, బోధించినా అర్థం చేసుకోలేని వారి గురించి ఆ భగవంతుడే గురువుగా అవతరించటము జరిగింది. అలనాడు అత్రి మహర్షి, అనసూయ మాతకు జన్మించిన ఆది దత్తాత్రేయుడు, కలియుగములో దేశ కాల మాన పరిస్థితుల ననుసరించి, శ్రీపాద శ్రీవల్లభుడు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ స్వామి సమర్థ, శ్రీ శిరిడీ సాయిబాబాగా అవతరించటము జరిగింది. ఎన్నో జన్మల పుణ్యఫలము వలన గాని సాటిలేని సద్గురువు సన్నిధి లభించదు. కనుక గురువును మనం ఎన్నుకోవటం, వెతుక్కోవటం అనేది వట్టిమాట. సృష్టి, స్థితి, లయకారకుడై, త్రిమూర్తి స్వరూపమయిన సద్గురువు ఎన్నో జన్మల నుండి మనలను సంస్కరించుకుంటూ తీసుకు వచ్చి, ఈ జన్మలో తనలాగానే భౌతిక దేహం ఇచ్చి, అనేక మిషల మీద తన వద్దకు రప్పించుకుంటున్నాడు. గురువు అంటే గుణానికి, రూపానికి అతీతమయిన వాడని అర్థం, గురువు అంటే సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యము. గురువు అంటే గుండె లోతులలో కొలువై ఉన్న గురుతు. "నీకు నాకు బేధమనే అడ్డుగోడ ఉంది, దానిని ఛేధించు, ఉన్నదంతా ఒక్కటే" అంటారు శ్రీ శిరిడీ సాయినాధుడు. పంచభూతాత్మకుడైన భగవంతుడు, పాంచ భౌతికమైన ఈ శరీరాన్ని ఉత్తమ పథములో నడిపించి, సార్థకత చెందించటానికి గురువై, గుండె లోతులలో వశించి ఉంటాడు. "నీవు నాలో ఉన్నావు, నేను నీలో ఉన్నాను ఇదే భావన చేస్తుండు" అన్నారు సాయిబాబా. "దేహ భావంతో చూస్తే మీరు యజమానులు మేము సేవకులము, జీవ భావంతో చూస్తే మీరు నరులు మేము వానరులము, ఆత్మ భావంతో చూస్తే ఇద్దరమూ ఒక్కటే రామచంద్రా!" అన్న భక్తాగ్రేసరుడైన ఆంజనేయ స్వామి ఆంతర్యము మనకు ఆదర్శము, ఆధారము. ఆత్మ స్వరూపమై హృదయమనే కోవెలలో వెలుగొందే జ్ఞాన జ్యోతి స్వరూపం గురువు. "ఆత్మ స్వరూపమై నీలోనే ఉన్న గురువును గుర్తెరగటమే నిన్ను నీవు తెలుసుకోవటం" అంటారు భగవాన్. నేను, నాది అనే అహంకార మమకారాల అడ్డుగోడల మధ్య చిక్కుకున్న "నేను"గా భావించే మనస్సు, దాని సస్వరూపము తెలియజేసే భగవత్ ప్రతి రూపమే గురువు. ఇక భగవంతుడిని వదలి గురువును పట్టుకోవటమనే ప్రశక్తే లేదు, నా ఆరాధ్యదైవమైన రాముడిని కాక, ఫకీరు అయిన సాయిబాబాను సేవించటానికి కల కారణమేమిటి? ఈ మార్గంలోకి ఎట్లా వచ్చారు? అనే మీ ప్రశ్నకు నా హృదయాంతరాలలో గూడుకట్టుకొని ఉన్న నా మనో భావాలు తరంగాలై, అంతరంగ చెలియలు కట్టలుదాటి మీ ముందుకు వచ్చేయి. నా అంతరాలలో గురువుపై గూడు కట్టుకున్న భావాన్ని నేను సింహావలోకనము చేసుకునే అవకాశము మీ వలన నాకు కలిగింది. అందుకని ముందుగా మీకు నా కృతజ్ఞతాభి వందనాలు అర్పిస్తూ, అసలు విషయంలోకి వెళ్ళే ముందుగా కొద్దిగా అల్పాహార సేవనంతో పాటు, కమ్మటి కాఫీ త్రాగి ముందుకు సాగుదాము", అంటూ తమ ప్రశ్న ద్వారా నన్ను నేను పరిశీలించి చూసుకునే అవకాశం కలిగించిన శ్రీ విశ్వనాధ శాస్త్రి, శ్రీ జగన్నాధాచార్యులతో పలికి, అల్పాహారము అందించే ప్రయత్నం చేయమని గృహిణికి ఆదేశమిచ్చి, నాలో "నేను"గా ఉండిపోయాను.

"నేను చెప్పేను, నేను చేశాను, నేను మౌనంగా ఉండిపోయాను అంటామే, మరి ఇంతకు ఆ నేను ఏవరు? అంతరాలలో వ్యాపించి ఆత్మ స్వరూపుడయిన భగవంతుడా లేక, గుర్తెరింగించిన గురువా! ఆ రెండు ఒక్కటైనప్పుడు నాలో ఉన్న "నేను" నేను కాదు కదా, ఉన్నదంతా ఒక్కటే అయినప్పుడు, ఆ ఒక్కటి నుంచి వేరుగా భావించేది ఏవరు?" ఇలా ఆలోచనా తరంగాలలో మునిగి తేలుతూ ఉన్న 'నా'బోటి వారినెందరినో చూసి, నిరంతరము వెంటనుండి ఆత్మ స్వరూపమై వెలుగొందుతూ, జ్ఞానమనే వెలుగులో పయనింప చేస్తున్నా, గుర్తెరగక, భావకాలుష్యాన్ని వెదజల్లుతూ, కనులు తెరచి అజ్ఞానమనే చీకటి వైపు పయనం సాగిస్తూ, ఎదురుగా ఉన్నా గుర్తించ లేనివారిని చూసి, ఆత్మకారకుడైన సూర్యభగవానుడి ముఖం అరుణవర్ణంకాగా సముద్రుడి ఒడిలో సేదతీరటానికి వడివడిగా తన పయనం కొనసాగించాడు. సముద్రుడి జలతరంగాల స్పర్శతో తాపం చల్లారిన రవి, శశాంకుడై, దారితప్పి అగమ్యగోచరముతో అల్లాడుతూ తిరిగే మనిషి హృదయాలలోని దైన్య తాపాలను తొలిగించి, ఆహ్లాద పరచి, అంతరంగాన్ని మేలుకొల్పటానికై సముద్రుడి ఒడి నుంచి పూర్ణచంద్రుడిగా వెలువడి ప్రసన్న వదనంతో కార్యోన్ముఖుడై, చిరునవ్వుల వెన్నెలతో అనుగ్రహ కిరణాలు కురిపిస్తూ, తన పయనం కొనసాగించాడు గురు చంద్రుడుగా. వెలుగునీడల దోబూచులాటల మానసిక క్రీనీడలను అధిగమిస్తూ, ముందుకు సాగమని బోధిస్తూ, సర్వులపై సమభావంతో ప్రసరించే శరత్ చంద్రుని, వెన్నెల కాంతి తరకలను గమనిస్తూ ఉండిపోయాను "నాలోని నేనును మరచి"

మీ... వి.వి. పూర్ణచంద్రరావు

# శపథం

(అహింస పరమ ధర్మమని నమ్మి దానిని త్రికరణ శుద్ధిగా ఆచరించి దేశ స్వాతంత్ర్య సముపార్జనకు కారణమైన జాతిపిత మహాత్మాగాంధీ తన జీవితంలో అహింస అనే రామబాణము తన హృదయములో బలంగా నాటుకోవటానికి కారణమైన ఒక అద్భుత సంఘటనను తన ఆత్మకథలో వెల్లడిచేసిన విషయాన్ని అక్టోబరు 2వ తేదీ శ్రీ గాంధీజయంతి సందర్భముగా మీకందిస్తున్నాము)



– సంపాదకుడు

"నా (మహాత్మగాంధీ) 15వ ఏట ఒక దొంగతనం చేశాను. మాంసం భక్షించే మాఅన్న చేతికి వుండే బంగారుమురుగు నుండి కొంచెం బంగారం దొంగిలించాము. మా అన్న ఇరవై రూపాయలు అప్పుబడ్డాడు. యీ అప్పు ఎలా తీర్చడమా అని మేమిద్దరం ఆలోచించాము. అతని చేతికి బంగారుమురుగు వుంది. దానిలో ఒక తులం ముక్క తీయించడం తేలిక అని నిర్ణయించాం. ఆ పని చేశాం. అప్పుతీర్చాం. కాని ఈ చర్య నేను సహించలేక పోయాను. ఇక దొంగతనం చేయకూడదని నిశ్చయించుకున్నాను. అయితే నా మనస్సు శాంతించలేదు. తండ్రిగారికి చెప్పవలెనని అనిపించింది. కాని ఆయన ముందు నోరు విప్పి ఈ విషయం చెప్పేందుకు సాహసం కలుగలేదు. వారు కొడతారనే భయం కలుగలేదు. తన బిడ్డలనెవ్వరినీ మాతండ్రి కొట్టరు. బంగారు మురుగు విషయం చెబితే మనస్తాపంతో క్రుంగిపోతారనే భయం నన్ను పట్టుకుంది. ఏది ఏమైనా దోషం అంగీకరిస్తేనే బుద్ధి కలుగుతుందని విశ్వాసం కలిగింది. తండ్రికి మనస్తాపం కలిగించినా పరవాలేదని భావించాను.

చివరికి ఒక చీటీమీద చేసిన తప్పంతా రాసి క్షమించమని ప్రార్థించాలి అను నిర్ణయానికి వచ్చాను. ఒక కాగితంమీద జరిగినదంతా వ్రాశాను. వెళ్లి మాతండ్రిగారికి ఇచ్చాను. ఇంతటి తప్పు చేసినందుకు తగిన విధంగా శిక్షించమని, యిక ముందు దొంగతనం చేయనని శపథం చేశాను. ఇదంతా వ్రాసిన చీటీ వారి చేతికి యిస్తున్నప్పుడు వణికిపోయాను. మా తండ్రి భగందర రోగంతో బాధపడుతూ మంచం పట్టి వున్నారు. ఆయన బల్లమీద పడుకొని వున్నారు. చీటీ వారిచేతికి ఇచ్చి ఎదురుగా నిలబడ్డాను.


వారు చీటీ అంతా చదివారు. వారి కండ్ల నుండి ముత్యాలవలె కన్నీరు కారసాగింది. ఆ కన్నీరుతో చీటీ తడిసిపోయింది. ఒక్క నిమిషము సేపు కండ్లు మూసుకొని ఏమో యోచించారు. తరువాత చీటీని చింపివేశారు. మొదట చీటీ చదివేందుకు ఆయన పడకమీద నుంచి లేచారు. ఆతరువాత తిరిగి పడుకున్నారు. నాకు కూడ ఏడుపు వచ్చింది. తండ్రికి కలిగిన వేదనను గ్రహించాను. ఆ దృశ్యం యిప్పటికీ నా కండ్లకు కట్టినట్లు కనబడుతున్నది. వారి ప్రేమాశృవులు నా హృదయాన్ని కడిగివేశాయి. అనుభవించిన వారికే ఆ ప్రేమ బోధపడుతుంది.

రామబాణం మహిమ ఆ బాణం తగిలిన వాడికే తెలుస్తుంది. ఆ ఘట్టం నాకు మొదటి అహింసా పాఠం అయింది. పితృవాత్సల్యం అంటే ఏమిటో అప్పుడు నాకు బోధపడలేదు. కాని యీనాడు ఆలోచిస్తే అదంతా అహింస మహిమేనని అనిపిస్తుంది. అట్టి అహింస అంతటా వ్యాప్తమైనప్పుడు దాని స్పర్శ తగలకుండా వుండదు. అహింసా శక్తి అమోఘం.

అంతటి శాంతం వాస్తవానికి మా తండ్రి స్వభావానికి విరుద్ధం. ఆయన కోపపడతారనీ, దూషిస్తారనీ లేక తలబ్రద్దలు కొట్టుకుంటారనీ భావించాము. కాని ఆయన ప్రదర్శించిన శాంతితత్వం అద్భుతం. అందుకు కారణం దోషాన్ని అంగీకరించడమేనని నా విశ్వాసం. మళ్లీ యీ విధమైన దోషం చేయను అని శపథం చేశాను. దాని అర్థం గ్రహించగలవారి ముందు వుంచాను. అదే సరియైన ప్రాయశ్చిత్తమని నా అభిప్రాయం. నేను దోషం అంగీకరించి యిక చేయనని శపథం చేసినందువల్ల మా తండ్రి నన్ను విశ్వసించారు. వారికి నామీద వాత్సల్యం ఇనుమడించిందని నాకు బోధపడింది" అంటారు "మహత్మ"గా పిలువబడ్డ మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ.

సేకరణ : **శ్రీ వి.వి. సత్యన్నారాయణ**, విశాఖపట్నం

# భారత దేశపు రెండవ ప్రధాని




భారతదేశ రెండవ ప్రధాని మంత్రిగా భారతీయుల హృదయాలలో శాశ్వతంగా నిలిచిన లాల్‌బహదూర్ అమరజీవి. ప్రధానిగా పదవిలో ఉన్నది కొద్దికాలమైన, నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే పేరు ప్రతిష్టలు సంపాదించారు. అజాత శత్రువనీ, పొట్టివాడైనా గట్టివాడేనని ఋజువు చేసుకున్నారు. పదవులే ఆయనను వరించి వచ్చాయి గానీ, ఆయన ఎన్నడూ పదవుల కోసం ప్రాకులాడలేదు. ప్రధానమంత్రిగా ఉన్నా పట్టుమని పది రూపాయలు కూడా వెనుకేసుకొనని నిస్వార్ధపరుడు. ఆయన చిత్తశుద్ధి, నిజాయితీ, సేవా భావాలు ఆదర్శప్రాయం.

(అక్టోబరు 2వ తేదీ శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి)

# దత్త సంప్రదాయం

ప్రతి మనిషి కూడా సాధ్యమైనంత వరకూ సుఖముగా సంతోషముగా జీవించాలనే కోరుకుంటాడు. దానిని పొందే మార్గంలో మంచి ఉద్యోగస్తుడు కావాలనో, ప్రముఖ రాజకీయవేత్త కావాలనో, డబ్బు, కీర్తి సంపాదించాలనో ఎవరికి తగ్గ లక్ష్యాలను వారు ఏర్పరుచుకుంటారు. ఐతే ఇందులో కొందరు మాత్రమే తమ లక్ష్యాలను సాధించుకోల్గడం, కొందరు ఎంత కృషి చేస్తున్నప్పటకి పొందలేకపోవటం చూస్తున్నాము. కాని కొందరే తమ లక్ష్యాలను సాధించుకోవడం, మిగిలినవారు సాధించుకోలేకపోవడం అనేది మనకు అంతుపట్టని ప్రశ్నగా వుండిపోయింది. దీనికి సమాధానం మనకు పరిపూర్ణమైన మహాత్ముల వల్ల లభ్యమౌతుంది. వీరి ప్రకారం, ప్రతి మనిషియొక్క జీవితంలో ఎదురయ్యే సంఘటనలు ముందుగా నిర్దేశించబడిన కర్మసిద్ధాంతం వల్ల జరుగుతువుంటాయి. దీనిని బట్టి చూస్తే, ప్రతి మనిషియొక్క జీవితం వాడికి తెలిసినా తెలియకపోయినా ఈ కర్మసిద్ధాంతానికి అనుగుణంగా సాగుతుందని భగవద్గీత గ్రంథాలు తెలుపుచున్నాయి. ఐతే ఈ కర్మసిద్ధాంతానికి అనుగుణంగా మన జీవితం సాగించాల్సిందేనా? లేక దీనిని సవరించి మనకు సుఖమైన జీవితం అందించే మార్గం ఏమైనా వుందా?




భగవంతుడు భూమిపై సద్గురువుగా అవతరించినదే దత్తాత్రేయ తత్వం. ఈ కలియుగంలో దత్తస్వామి మానవరూపంలో శ్రీపాద వల్లభులుగా, శ్రీ నృసింహసరస్వతిగా, శ్రీ మాణిక్యప్రభువుగా, శ్రీ స్వామి సమర్థగా మరియు శ్రీ షిర్డిసాయినాధుడుగా అవతరించారు. ఈ మహనీయులు చరిత్రలో కర్మసూత్రాన్ని సవరించి తమ భక్తులను రక్షించిన అనుభవాలను స్మరిద్దాము.

గోపీనాధుని కుటుంబము దత్తభక్తులు. వారికి దత్తస్వామి అనుగ్రహం వల్ల కల్గిన బిడ్డకు స్వామిపేరు పెట్టుకున్నారు. ఇతనికి వివాహము అయిన దగ్గరనుండి తీవ్రమయిన క్షయవ్యాధి వచ్చింది. భర్తయొక్క వ్యాధిని ఆ శ్రీగురుడే తొలగించగలరని విశ్వసించి అతనిని స్వామిదర్శనానికి తీసుకువెళ్ళింది అతని భార్య అయిన సావిత్రి. కాని అతను మార్గమధ్యంలోనే మరణించాడు. ఆమె ఎంతో బాధపడి స్వామి దర్శనాంతరము సహగమనం చేసుకోవాలని నిర్ణయించుకొని, శ్రీ గురుని దర్శించింది. స్వామి సావిత్రిని "దీర్ఘ సుమంగళిభవ" అని దీవించి, చనిపోయిన ఆమె భర్తను తిరిగి బ్రతికించారు. బ్రహ్మరాతను మార్చటం ఎలా సాధ్యమని సందేహిస్తున్న భక్తునితో, "బ్రహ్మ అనుమతితో వచ్చే జన్మనుండి 30 సం॥లు ఆయుష్షు ఈ జన్మకు మార్చామని" స్వామి తెలిపేరు.

రామన్న పొలంపని చేసుకుంటుండగా పాముకాటువల్ల మరణించాడు. స్వామి సమర్థుల భక్తుడైన జాదవ్ స్వామివారి చర్మపాదుకలు తీసుకువెళ్ళి చనిపోయిన రామన్న తలపైపెట్టి అతనిని బ్రతికించాలని ప్రయత్నించాడు. ఆ సమయంలో స్వామి కోపంతో జాదవ్‌ని తిట్టి అతను స్వామి వద్దకు వచ్చాక, జాదవ్‌ను వెళ్ళి రామన్న చెవిలో మూడుసార్లు పేరుపెట్టి పిలువు బ్రతుకుతాడని చెప్పారు. అతను అట్లా చేయగానే రామన్న తిరిగి బ్రతికాడు. స్వామి ఆగ్రహానికి కారణం రామన్న విధి మార్చవలసి వచ్చినందుకే.

భీమాజీపాటిల్ తీవ్రమయిన క్షయవ్యాధితో షిర్డిసాయినాధుని దర్శించాడు. ఈ వ్యాధి పూర్వకర్మ వలన వచ్చిందని తాము నివారించమని సాయి తెలిపారు. అతను ఎంతో దీనంగా ప్రార్థించినమీదట సాయి కరుణించి మసీదులోకి అనుమతించారు. సాయిని దర్శించినప్పటినుండి అతనికి రక్తం పడటం ఆగిపోయింది. ఒకరోజు భీమాజీకి కలలో రోడ్డురోలర్ అతని మీదగా వెళుతున్నట్లు అయి చాలా బాధపడ్డాడు. తెల్లవారిన తరువాతనుండి అతని రోగం పూర్తిగా తొలగిపోయింది. అంటే సాయి, అతను భౌతికంగా అనుభవించాల్సిన కర్మఫలితాన్ని స్వప్నంలో అనుభవింపచేసి బాధ తొలగించారు.

పై మహనీయుల చరిత్రలు చూచినట్లయితే భక్తులయొక్క దుష్కర్మను తొలగించి వారికి సుఖసౌఖ్యాలు ప్రసాదించిన సంఘటనలు కోకొల్లలు.

నూటికి తొంబైతొమ్మిది మందికి కర్మసిద్ధాంతం ప్రకారం నిర్ధేశించబడిన దుఃఖము అనుభవించి తీరాల్సిందే. సద్గురువును ఆశ్రయించి, వారి అనుగ్రహం పొందినివారికి మాత్రమే దుఃఖనివృత్తి కల్గిన సందర్భాలు పై తెల్పిన లీలలువల్ల తెలుస్తుంది.

కానీ సద్గురువును ఆశ్రయించటమే మన ప్రధాన సమస్య అయినది. ఈ కలియుగంలో, ఆత్మజ్ఞానము లేకనే సద్గురువులుగా ప్రకటమౌతారని బ్రహ్మంగారు, పురాణాలన్నీ హెచ్చరించాయి. అందుకే సాయిబాబా కూడా నిజమైన ఫకీరు చాలా అరుదు. ఎవరివద్దకు ఉపదేశాలకొరకై పరుగులిడవద్దని హెచ్చరించారు. పూర్ణగురువులుగా అవతరించినవారి చరిత్రలు పారాయణచేసి వారి సమర్థతను, లక్షణాలను అర్థంచేసుకొని అట్టి సద్గురువును మనకు చూపమని వారిని ప్రార్థించాలి. మన సంస్కారానికి తగిన గురువును వారే తెలుపుతారు. శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర పారాయణ చేసిన ఎందరో భక్తులకు వారు ఆశ్రయించవలసిన గురువులను తెలిపిన సంఘటనలు కోకొల్లలు.

దత్తావతారాలైన సద్గురువులందరికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వీరు సమాధి అనంతరం అర్హులైన భక్తులకు భౌతికదర్శనాన్ని ప్రసాదించగలరు. వీరి అనుగ్రహం పొందటానికి వీరి చరిత్ర పారాయణే ఏకైక సాధనం. మొదట రెండు దత్తావతారాల చరిత్రయైన "శ్రీ గురుచరిత్ర" పారాయణవల్ల సద్గురు దర్శనం మరియు పాపప్రక్షాళన అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో మతసాంప్రదాయాలు, సద్గ్రంథాలు తెలిసిన సాయినాధుడు తన భక్తుని పాపక్షయానికై "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేయించటం గమనార్హం. కుశాభావు అను టీచరు దత్తమహరాజ్ అను సాధువును ఆశ్రయించి ఒక మంత్రం నేర్చుకున్నాడు. దానితో అతను దేనిని చూచి దానిని స్మరిస్తే అతనివద్దకు వచ్చేవి. కొంతమంది ప్రజలు అతనిని దూషించటంతో వారిని దండించేందుకు ఏదైనా మంత్రం నేర్పమని ఆ సాధువుని అడిగాడు. ఆయన తమవల్లకాదని అతనినివెళ్ళి శ్రీ సాయిని ఆశ్రయించమన్నారు. కాని సాయి అతనిని మశీదులోనికి ప్రవేశించనీయలేదు. కొంతకాలానికి జాలిపడి అతని దుష్కర్మను తొలగించటానికై అతనిచేత "శ్రీ గురుచరిత్ర" 108 సార్లు పారాయణ చేయించి అతనిని అనుగ్రహించారు.

దత్త జయంతి సందర్భముగా మనముకూడా సద్గురు అనుగ్రహానికి, పాపక్షయానికి వారు విధించిన "శ్రీ గురుచరిత్ర", సాయిచరిత్ర మరియు ఇతర దత్తావతారాల చరిత్ర పారాయణచేసి వారి అనుగ్రహానికి పాత్రులమవుదాం.

(డిసెంబరు 13వ తేదీ మంగళవారము దత్త జయంతి సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన : **శ్రీ జి.వి.యస్.ప్రసాదు**, గుంటూరు

# అవధూత లక్షణం

వివేక చూడామణిలో ఆదిశంకరులు జీవన్ముక్తులు గురించి వ్రాస్తూ "బాలోన్మత్త పిశాచవత్" అని వర్ణించారు. అంటే జీవన్ముక్తులు పసిపిల్లల వలెను, ఉన్మత్తుల (పిచ్చివారు) వలెను, పిశాచముల వలెను ఉంటారని వారి భావం. అందువల్ల వారిని గుర్తుపట్టడం చాలా కష్టం. శ్రీ శిరిడీ సాయిబాబా శిరిడీ చేరిన కొత్తల్లో ఆయననెవరూ గుర్తు పట్టలేదు. అక్కల్‌కోట మహారాజ్ పసిపిల్లల వలె రాళ్ళతోను, మట్టితోను ఆడుకుంటుండేవారు. అవధూతలు ఒకప్పుడు పిచ్చివారిలాగా, మరొకప్పుడు దెయ్యం పట్టినవారిలాగా కనిపిస్తారు. మురికి కాలువలోని నీరు త్రాగటం, స్నానం చేయటం, పిడికిలి బిగించి, చేతులు గాలిలోకి విసురుతూ చిందులు వేస్తూ ఎవరినో బండబూతులు తిడుతూ కనిపిస్తారు అవధూతలు.

రమణ మహర్షి చెప్పినట్లు జ్ఞానిని మరొక జ్ఞాని మాత్రమే గుర్తుపట్టగలరు. అజ్ఞానంలో వున్న మనము సరియైన మహనీయులను, అవధూతలను గుర్తించలేము. కానీ గుర్తించేందుకు మార్గము మహనీయులైన శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చెప్పి వున్నారు. ఆ మార్గం:

1. ఎవరి సమక్షములో మన మనస్సు ప్రశాంతత పొంది కాలగతి తెలియకుండా పోతుందో అది సద్గురు సన్నిధి. ఇలాంటి అనుభవం తనకు కలిగినప్పటికీ ఆధ్యాత్మికత తెలియనివారు అది మహాత్ముని సన్నిధియని గుర్తించలేరు. అలాంటివారి కొరకు మరొక చక్కని పరీక్ష చెప్పారు మాస్టారుగారు.

2. మనం మహనీయుడు అవునా కాదా అని పరీక్షించే వారి దగ్గర సాధారణంగా జరిగేందుకు వీలులేని ఒక అనుభవం జరుగవలెనని, ఆ అనుభవం ఇంత టైంలో జరగాలని, అలా అనుగ్రహించమని మనం మన నోటితో అడగకుండా మానసికంగా చెప్పుకొని వారి సన్నిధిలో కూర్చొనేది. కూర్చున్నంతసేపు సాయినామం మానసికంగా జపిస్తూ ఉండు. మనం మానసికంగా చెప్పుకున్న టైం లోపలే ఆ అనుభవం జరిగితే వారు సిద్ధపురుషులని తెలుసుకొనేది.

3. మూడవ విషయం: నిజమైన మహనీయులెవ్వరు కూడా తమ పూర్వ చరిత్ర వారి నోటివెంట బయటపెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశపడతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీ సాయి, అక్కల్‌కోట స్వామి వంటి మహనీయులైతే కొందరికి మాదిగవారమని, మరికొందరికి సత్‌బ్రాహ్మణులమని, మరికొందరితో ఆ విషయం అడిగితే చెప్పుతో కొడతామని అన్నారు.

4. నాలుగవ లక్షణం: వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాలు పోషణ, పాలన భగవంతుడే చూడాలి.

5. ఐదవ లక్షణం: కరచాలనంతో వస్తువులను సృష్టించరు. అలా సృష్టించి ప్రజలను భ్రమకొల్పేవారిని మనం దర్శించనక్కరలేదు.

6. ఆరవ లక్షణం: మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపద రాకుండా చేస్తారు. వారి మాటలకు నిజమైన అర్థం మనకు ఆ ఆపద తప్పిపోయాక అర్థమౌతుంది.

పై రకమైనటువంటి లక్షణాలు అవధూత–మహాత్ములు–సద్గురువు దగ్గర పొందిన తరువాత వేరొక ఆలోచన లేకుండా వారికి శరణాగతి చెందడమే సరియైన విధానము. అట్లా కాకుండా కేవలం వారిని పరీక్షించి వదిలివేయాలనే భావనతో కూడి ప్రవర్తిస్తే వారు పెట్టే పరీక్షలకు తట్టుకోవడం కష్టమవుతుంది.

సేకరణ : **శ్రీమతి ఆర్.సాయి సృజన**, న్యూఢిల్లీ

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం

## (2016 జులై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)















శ్రీశిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా జూలై, ఆగష్టు మరియు సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు నిర్వహించటముతోపాటు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ ప్రధాన సంపాదకులు మరియు ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు దంపతులు అనేక కార్యక్రమాలలో పాల్గొనటము జరిగింది. దానిలో భాగముగా

జూలై 16వ తేదీ స్థానిక ఉక్కునగరములోని పిరమిడ్ సొసైటీవారి వార్షికోత్సవ సందర్భముగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ''ధ్యానము–సాయిమార్గము'' అనే అంశముపై ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. ఆ కార్యక్రమములో విశాఖజిల్లా ధ్యానసొసైటీ కన్వీనరు, హైదరాబాదు సొసైటీ సెక్రటరీ మొదలైనవారు పాల్గొన్నారు. ఆ కార్యక్రమములో ఉక్కునగర వాసులతోపాటు పరిసర ప్రాంతాలలోని వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సందర్భముగా ట్రస్టు ఛైర్మన్‌ను పిరమిడ్ సొసైటీవారు సత్కరించారు.

జూలై 17, 18, 19 తేదీలలో ఉక్కునగరములోని సద్గురుపాదుకాక్షేత్రములో లోకకళ్యాణార్థము మూడురోజులపాటు గురుపూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించటము జరిగింది. జూలై 17వ తేదీ ఉదయం శ్రీ గురుచరిత్ర గ్రంథ సహిత శ్రీ దత్త సాయి భరద్వాజులకు షోడశోపచార పూజ, అనంతరము దాదాపు 200 మందిచే సామూహిక "శ్రీగురుచరిత్ర" ఏకాహ పారాయణ చేయటము జరిగింది. ఆ కార్యక్రమములో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ఆధ్యాత్మిక సభలో "శ్రీగురుచరిత్రలోని మూడు కాండల"పై ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. తదనంతరము పారాయణపట్ల ఆసక్తిగల దాదాపు 100 మంది విద్యార్థినీ విద్యార్థులకు 'శ్రీగురుచరిత్ర' గ్రంథాన్ని ఉచితముగా బహుకరించారు.

జూలై 18వ తేదీ ఉదయం "శ్రీ సాయిలీలామృతము" గ్రంథసహిత శ్రీ దత్త సాయి భరద్వాజులకు షోడశోపచారపూజ అనంతరము సామూహిక "శ్రీ సాయిలీలామృతము" ఏకాహ పారాయణ చేయగా సాయంత్రం జరిగిన సత్సంగములో "సాయి లీలావిలాసము" అనే అంశముపై "సద్గురువాణి సంపాదకులు" ప్రవచనం చేశారు.

జూలై 19వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా శ్రీ దత్త సాయి భరద్వాజులకు సామూహిక క్షీరాభిషేకము, అనంతరం సామూహిక "గురుపూజలు" నిర్వహించి, భక్తసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమములో విశేషముగా భక్తులు పాల్గొని, శ్రీ దత్త సాయి భరద్వాజుల సహిత పాదుకలను దర్శించుకున్నారు. తదనంతరము

15 నిరుపేద కుటుంబాలకు 'శ్రీ సాయిభరద్వాజ ఆపన్నహస్తము' పేరిట నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను ట్రస్టు తరపున బహుకరించటముతోపాటు, శారీరక వికలాంగునికి మూడు చక్రాల సైకిల్ నిమిత్తము టైర్లు, ట్యూబులు ట్రస్టు తరపున శ్రీ కె.వి.శ్రీహరి బహుకరించారు. సాయంత్రం జరిగిన ఆధ్యాత్మిక సభలో "గురుపూర్ణిమ" అనే అంశముపై ట్రస్టు ఛైర్మన్ సత్సంగము నిర్వహించారు.

జూలై 19వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా శ్రీకాకుళంలోని అనాథ బాలుర వసతి గృహములోని దాదాపు 80 మంది విద్యార్థులకు నోట్సు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, వారి నిత్యావసర వస్తువులు తదితరములు ట్రస్టు తరపున బహుకరించటము జరిగింది.

కృష్ణాపుష్కరాలు సందర్భముగా ఆగష్టు 13, 14 తేదీలలో దాదాపు 25 మంది సత్సంగ సభ్యులతో ప్రత్యేకబస్సులో బయలుదేరి విజయవాడ దుర్గాఘాట్‌లో పవిత్ర స్నానాలు ఆచరించటము జరిగింది. ఆ సందర్భముగా అక్కడ స్వచ్ఛంధ సేవకులకు ప్రోత్సాహముగా బిస్కెట్లు ప్యాకెట్లు, యాత్రికులకు బిస్కట్లు, చాక్లెట్లు మొదలైనవి పంపిణీ చేయటం జరిగింది. ఆసందర్భముగా ఆధ్యాత్మిక సేవలో భాగముగా 'సద్గురువాణి' విశేష సంచికలను వేలాది యాత్రికులకు ఉచితముగా శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ తరపున అందజేయటం జరిగింది.

ఆగష్టు 18వ తేదీ శ్రావణపౌర్ణమి సందర్భముగా నర్సీపట్నం శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమములో సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించటము జరిగింది. ఉదయం పల్లకీ సేవ, వేలాది మందిచే పౌర్ణమి ప్రత్యేక హోమాలు, మహా భక్తసమారాధన మొదలైన కార్యక్రమాలు శ్రీ శాంభవీ భక్తసమాజము వారు నిర్వహించారు. ఆ సందర్భముగా దత్తావతారుల, అవధూతల, మహాత్ముల పాదుకల సహిత దివ్య వస్తు, వస్త్ర సముదాయమును వేలాది మంది దర్శించుకొని పరవశించారు. ఆసందర్భముగా ఆశ్రమ ప్రెసిడెంట్ శ్రీ వై.వి.రమణమాస్టారు అధ్యక్షతన జరిగిన ఆధ్యాత్మిక సభలో ట్రస్టు ఛైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, విశిష్ట అతిథిగా నర్సీపట్నం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీ చింతకాయల సన్యాసిపాత్రుడు (జమీలు) పాల్గొని ఆశ్రమము-ట్రస్టు గత 13 సంవత్సరాలుగా సంయుక్తముగా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలియజేస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సేవాకార్యక్రమాలను కూడనిర్వహిస్తున్న ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. ఆసందర్భముగా నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు నోట్సు పుస్తకాలను, నిరుపేద స్త్రీలకు చీరలను ట్రస్టు తరపున శ్రీ సన్యాసిపాత్రుడు, శ్రీ రమణమాస్టారు మొదలైనవారి చేతులమీదుగా బహుకరించటము జరిగింది. అనంతరము పాదుకామహోత్సవము సందర్భముగా విశిష్ట అతిథిని, ఆశ్రమ నిర్వాహకులను ట్రస్టు తరపున ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

ఆగష్టు 21వ తేదీ 23వ సద్గురువుల పాదుకామహోత్సవము సందర్భముగా ఉక్కునగరంలో సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించి, లోకకళ్యాణార్థము సామూహిక "శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర" ఏకాహపారాయణ చేయటము జరిగింది. ఆ కార్యక్రమములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆసందర్భముగా "శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తము" పేరిట, శారీరక వికలాంగులకు 15 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేయటము జరిగింది.

ఆగష్టు 24వ తేదీ అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సద్గురుపాదుకాక్షేత్రములో సామూహిక "శ్రీ వెంకయ్యస్వామి చరిత్ర" ఏకాహపారాయణ చేసి అన్నదానము నిర్వహించటము జరిగింది. ఆ సందర్భముగా స్థానిక అరిలోవలోని అనాథ ఆశ్రమ పిల్లలకు నోట్సు పుస్తకాలు బహుకరించటము జరిగింది.

ఆగష్టు 27వ తేదీ సద్గురు పాదుకాక్షేత్రము నందు ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు, శ్రీమతి శ్రీశైలలక్ష్మీ భ్రమరాంబ (శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి) దంపతుల తృతీయ కుమార్తె వివాహ నిశ్చయతాంబూలాది కార్యక్రమము సద్గురువుల చరణ సన్నిధిలో నిర్వహించటము జరిగింది. ఆ సందర్భముగా ట్రస్టు సభ్యులతోపాటు, వివిధ ప్రాంతాలనుంచి ట్రస్టు అనుబంధ సంస్థలనుంచి కూడ విశేషముగా సభ్యులు విచ్చేసి ఆ కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణములో వేడుకగా నిర్వహించారు.

సెప్టెంబరు 5వతేదీ వినాయకచవితి సందర్భముగా లోకకళ్యాణార్థము ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీపాద శ్రీవల్లభుల జయంతి సందర్భముగా సద్గురు పాదుకాక్షేత్రములో ప్రత్యేక సత్సంగమము నిర్వహించటము జరిగింది.

సెప్టెంబరు 6వ తేదీ ఋషిపంచమి, శ్రీగజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము సందర్భముగా ట్రస్టు ఆవరణలో సత్సంగమము నిర్వహించి, "అవధూత తత్త్వము" గురించి ట్రస్టు ఛైర్మన్ వివరించటము జరిగింది.

సెప్టెంబరు 15వ తేదీ అనంతపద్మనాభ చతుర్దశి సందర్భముగా సద్గురువు పాదుకాక్షేత్రములో ప్రత్యేక సత్సంగమము నిర్వహించటము జరిగింది. ఆ సందర్భముగా "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తము" పేరిట, వృద్ధవికలాంగులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటము జరిగింది.

సమీక్ష : **"జ్యోతిర్మయి"**, విశాఖపట్నం

# మేము సహితం సాయి సేవలో భాగస్వాములై...

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యములో జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. దానిలో భాగముగా ఉన్నత పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు నోట్సు పుస్తకాలు, అనాథ ఆశ్రమాలలోని విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, 'శ్రీ భరద్వాజ ఆపన్న హస్తము' పేరిట ప్రతి నెల 15 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, పేద గిరిజన స్త్రీలకు చీరలు బహుకరించటము జరిగింది. విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించే రీతిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వారిని ఆధ్యాత్మిక వైపు మొగ్గు చూపేలా చేయటమే కాకుండా, వారి విద్యాభ్యాసానికి కావలసిన ఆర్థిక సహాయముతో పాటు, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతము, సాయిమాస్టర్ అనే పారాయణ గ్రంథాలను వందలాది మందికి ఉచితముగా బహుకరించటము మొదలైన అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరుగుతున్నది. బృహత్తరమైన ఈ కార్యక్రమాలకు చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు అర్పించుకుంటూ, మీరిచ్చే ప్రతిపైసా సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించగలమని హామీనిస్తూ, సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహము అందించి, మరింతగా సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించాలని వేడుకుంటూ, సహాయ సహకారములు అందించినవారి వివరాలు ఈ క్రింద పొందు పరుస్తున్నాము.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీ పి. దుర్గాప్రసాద్, దువ్వాడ-విశాఖపట్నం | 6,116/- |
| శ్రీ భాస్కర పట్నాయక్, విజయనగరం | 5,000/- |
| శ్రీ యస్. రామకృష్ణ, కూర్మన్నపాలెం | 4,000/- |
| శ్రీ కె. శరత్‌చంద్ర, ఎన్.టి.పి.సి., పరవాడ | 3,348/- |
| శ్రీ కె. సుభాకర్, తాడేపల్లి | 3,000/- |
| శ్రీ బి. చంద్రశేఖర్, హరిద్వార్ | 3,000/- |
| శ్రీ సాయి భక్తుడు, గాజువాక | 3,000/- |
| శ్రీ అరుణ్‌దేవ్, పరవాడ | 2,000/- |
| శ్రీ శ్రీపాద రామారావు, హైదరాబాదు | 1,500/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, విశాఖపట్నం | 1,500/- |
| శ్రీమతి ఎమ్.పావని నాగేశ్వరరావు, హైదరాబాదు | 1,201/- |
| శ్రీ బి. రమేష్, గాజువాక | 1,000/- |
| శ్రీమతి సరస్వతి, పరవాడ | 1,000/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 750/- |
| శ్రీ వి. పిచ్చయ్య, కొవ్వలి | 555/- |
| శ్రీమతి కె. సుధ, నిడమానూరు | 501/- |
| శ్రీ వి. మోహనరావు, హైదరాబాదు | 501/- |
| శ్రీ యమ్. భానుప్రకాష్, పెరుమళ్ళపల్లి | 501/- |
| శ్రీ కదలి నాగేశ్వరరావు, అమలాపురం | 501/- |
| శ్రీమతి ఆర్. నాగరత్నం, అమలాపురం | 501/- |
| శ్రీ కె. చిన్న అప్పారావు, గాజువాక | 500/- |
| శ్రీ టి. బ్రహ్మానందరెడ్డి, విశాఖపట్నం | 500/- |
| శ్రీ వి. అప్పలరాజు, విశాఖపట్నం | 500/- |
| శ్రీమతి రమ్యశర్మ, హైదరాబాదు | 500/- |
| శ్రీమతి సత్య అరూప్‌కుమార్, హైదరాబాదు | 500/- |
| శ్రీమతి గీతా వెంకటరాజు, హైదరాబాదు | 500/- |
| శ్రీమతి విజయ హర్షవర్ధన్, హైదరాబాదు | 500/- |
| శ్రీమతి శైలజా నరసింహ, హైదరాబాదు | 500/- |
| శ్రీమతి అనితాకిశోర్, హైదరాబాదు | 500/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, విశాఖపట్నం | 500/- |
| శ్రీ సిహెచ్. నరసింహారావు, సికింద్రాబాదు | 500/- |
| శ్రీ శ్రీనివాసరావు, పరవాడ | 400/- |
| శ్రీ యస్.ఎ. రామారావు, విశాఖపట్నం | 400/- |
| శ్రీ యస్.వి. రామన్, విశాఖపట్నం | 400/- |
| శ్రీ భిక్షపతి, చర్లపల్లి | 360/- |
| శ్రీ యన్. రాధాకృష్ణ, పరవాడ | 300/- |
| శ్రీ ముద్దుకృష్ణ, పరవాడ | 300/- |
| శ్రీ గోపీకృష్ణ, హైదరాబాదు | 300/- |
| శ్రీ వి.వి.యస్.యస్. జనార్దన్, ఏలూరు | 200/- |
| శ్రీ యన్. కుమారస్వామి, అమలాపురం | 200/- |
| శ్రీ సుబ్బారావు, పరవాడ | 200/- |
| శ్రీమతి స్నేహలత, దువ్వాడ | 116/- |
| శ్రీ బి. కృష్ణారావు, (L.I.C) విశాఖపట్నం | 108/- |
| శ్రీ వై. విజయలక్ష్మి, నెల్లిమర్ల | 100/- |
| శ్రీ జి. వాసుదేవరావు, శ్రీకాకుళం | 100/- |

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా:**

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్ట్ (రిజిష్టర్డ్)**

**సెక్టార్ - 8, క్వార్టర్ నెం. 206/ఎ, ఉక్కునగరం,**
**విశాఖపట్నం - 530 032. సెల్ : 9849645224**

E-mail : poorna.sai09@gmail.com
sadguruvani@gmail.com
Visit : www.saisadguruvani.org
Facebook :SriShiridiSaiSevaTrust

**SRI SHIRIDI SAI SEVA TRUST**
Online A/C No. 095510011006492
Andhra Bank, Ukkunagaram Branch

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491
Andhra Bank, Ukkunagaram Branch
IFSC Code : ANDB0000955
(For RTGS and NEFT Transactions)

# జన్మదిన శుభాకాంక్షలు

అక్టోబరు 6వ తేదీన గాజువాక, శ్రీనగర్‌లో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ అల్లు సింహాచలం నాయుడు,
శ్రీమతి ఈశ్వరమ్మల కుమారుడైన
**చి॥ శ్రీరామ్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.



అక్టోబర్ 23వ తేదీన శ్రీకాకుళంలో
జన్మదినము జరుపుకుంటున్న
శ్రీ సి.హెచ్. మురళీకృష్ణ,
శ్రీమతి సి.హెచ్. మీనాక్షిల కుమారుడు
**చి॥ సి.హెచ్. నాగ కిరణ్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని
కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

అక్టోబర్ 18వ తేదీన హైదరాబాద్‌లో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ ఎమ్. ఉమామహేశ్వర రావు
శ్రీమతి ఎమ్. నాగలక్ష్మిల కుమారుడైన
**చి॥ ఎమ్. రామ సుబ్బారావు** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



**డిశెంబర్ 12వ తేదీన శ్రీకాకుళంలో జన్మదినం జరుపుకుంటున్న**
**శ్రీ కె. వెంకటరమణ, శ్రీమతి జయలక్ష్మిల కుమార్తె**
**చి॥ కె. తేజశ్వని** కు
శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

నవంబర్ 30వ తేదీన ఉక్కునగరంలో పుట్టినరోజు
జరుపుకుంటున్న శ్రీ వి. గంగాధర్‌రావు,
వి. సూర్య కుమారిల కుమార్తె
**చి॥ హేమప్రియ** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



నిర్దుష్టమైన సాయి సంప్రదాయాన్ని అందరికి అందుబాటులోకి తేవటానికై
**"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** పత్రిక స్థాపించి, వాడవాడలా సాయివాణిని
అందించుటయేకాక ఆ బృహత్తరయజ్ఞంలో మాకుకూడ సేవాభాగ్యము కల్పించిన

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి**

**శ్రీమతి వి.ఎస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**


**డిసెంబర్ 9 వ తేదీన జన్మదినము జరుపుకుంటున్న**

శుభ సందర్భములో శ్రీ దత్తసాయి మాస్టర్, తన సంపూర్ణ కృపానుగ్రహము
అందించి **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"**, అందరి హృదయవాణిగా
తీర్చిదిద్దే శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలతో.

**కార్యవర్గము - శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**
**సత్సంగ సభ్యులు - శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు, ఉక్కునగరం**

## జన్మదిన శుభాకాంక్షలు

**అక్టోబర్ 6వ తేదీన**
**జన్మదినము జరుపుకుంటున్న**
**శ్రీమతి ఉషారాణి, శ్రీ హరికృష్ణ పట్నాయక్**
**దంపతుల కుమారుడు**



**చి॥ శ్రీనివాస మురళీకృష్ణ పట్నాయక్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



డిశెంబర్ 8వ తేదీన శ్రీకాకుళంలో
పెళ్ళిరోజు జరుపుకుంటున్న
**శ్రీ హరికృష్ణ పట్నాయక్, శ్రీమతి ఉషారాణి**
దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో
గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.




**ద్వితీయ వార్షికోత్సవము**
సందర్భంగా
విజయదశమి మరియు
దీపావళి శుభాకాంక్షలతో...



ప్రొ॥ ఎస్. శంకరరావు

# న్యూ సాయి పార్వతి గ్రానైట్స్

**విజయ హర్ష తల్లి పిల్లల హాస్పిటల్ ఎదురుగా,**
**గొంటి వీధి, శ్రీకాకుళం.**
**Cell : 9440153756, 8520034666, 7396199668**

# శ్రీ పార్వతి గ్రానైట్స్

**ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం.**

మా వద్ద గ్రానైట్స్, మార్బుల్స్, సిరామిక్ టైల్స్, కడప,
తాండూరు బ్లూ, ఆర్టిఫిషియల్ గ్రానైట్స్ మొదలుగునవి
హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును.

Birla White | Birla White WALL CARE
White Cement Based Putty

**M.S.R. GUPTA**
Partner



# AYYAPPA ENTERPRISES

**Deepamahal Side, Srikakulam - 532 001.**
**Ph : 221733 (S), Cell : 9440061911**

*Dealers in :*
**Birla White Cement, Novapan, Royale Touche Laminates, Masaiq Chips, PVC Doors, Plywood & Cine Arc Carbons**

విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలతో...






ప్రొ॥ పొట్నూరు ఆనందరావు
Cell : 9440168493
Cell : 9440512224

శ్రీ సాయి గణేష్ ఎంటర్‌ప్రైజస్
(పెన్‌కార్నర్)
కళింగరోడ్, శ్రీకాకుళం.

మా ప్రత్యేకత : బర్త్‌డే మెటీరియల్
పెన్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, టోయస్, మెమోంటోస్
హోల్‌సేల్ & రిటైల్ ధరలకే లభించును

ప్రొ॥ వి. సత్యన్నారాయణ
Cell : 9440112816
9246636624



సాయి తేజ
మార్బుల్స్ & టైల్స్
సరస్వతి థియేటర్ వెనుక,
గొంటివీధి, శ్రీకాకుళం.



SJ



ప్రొ॥ కిల్లాన తిరుమలరావు
S/o. కిల్లాన సూర్యా రావు
సెల్ : 9441095955

ఆనంద సాయి
జ్యూయలర్స్ A/C

బంగారం, వెండి నగల వ్యాపారం

బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రక్కన, కిల్లాన కాంప్లెక్స్,
పెట్రోమాక్స్ వీధి, శ్రీకాకుళం-532001.

91.6 BIS హాల్‌మార్క్ ఆభరణముల తయారీ మా ప్రత్యేకత



మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలు

Magatapalli's
Sai Steels


కామేశ్వరి కాంప్లెక్స్, పెద్దపాడు రోడ్,
శ్రీకాకుళం.
Ph : 220705 (S)
Cell : 9440702520

మేనేజింగ్ పార్టనర్ :
మగటపల్లి శ్రీనివాసరావు

మావద్ద Vizag Steel అన్ని ప్రముఖ కంపెనీల
సిమెంటు హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా
అమ్మబడును.

# శ్రీ ధునీవాలాదాదా మహారాజ్

మహారాష్ట్రలోని "సాయిఖేడా" అనే గ్రామంలో భక్తుల కోరికపై శ్రీ ధునీవాలాదాదా 1907 సంవత్సరము నుండి 1928 సంవత్సరము వరకు నివశించారు. అన్ని మతాలకూ, ప్రాంతాలకూ సంబంధించిన వ్యక్తులు శ్రీ ధునీవాలా దాదాజీ వద్దకు రాజొచ్చారు. దాదాజీ మాత్రం యధాపూర్వకంగా అనేకచోట్ల కన్పిస్తూండేవారు. దాదాజీ జబల్‌పూర్‌కు చెందిన పండిత రామ్‌లాల్‌గారి కుమారుణ్ణి, హోషంగాబాద్‌కు చెందిన పండిత రామకృష్ణగారి భార్య, హర్దా నివాసియైన నారందేవుల బిడ్డ మరణిస్తే వారిని తిరిగి సజీవులను చేశారు. అలాగే పాములు, కుక్కలు, పక్షులు వంటి జీవులను సైతం (ఒక్కోసారి అవి చనిపోయిన వారం తరువాత కూడా) దాదాజీ తమ స్పర్శతో బ్రతికించేవారు. నిత్యం వారివద్ద జరిగే విచిత్రాలెన్నో! వారు అంధులకు దృష్టినిచ్చి, గొడ్రాళ్ళకు సంతానం ప్రసాదించి, కుంటివారిని నడిపించి ఆశీర్వదించారు. అందరి ఎదుట మలాన్ని తీసి వస్తువులుగా మార్చి పంచేవారు. వారు రొట్టె ముక్క వేస్తే చాలు ఎండిన బావులు నీటితో నిండేవి. ఎందరో పండితులు ఆయనను పరిక్షించే నిమిత్తం వచ్చేవారు. దాదాజీ వారి రాకను ముందుగా సూచించడమే గాక వారి ప్రశ్నలకు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలలోంచి ఆధారాలనుదహరిస్తూ వారి నోరు కట్టేసేవారు. ఒక్కోసారి వస్తాదులతో కుస్తీకి దిగి వారినోడించేవారు. అందువల్ల వారిని ప్రజలు "పహిల్వాన్ బాబా" అనేవారు.



ఒకరోజొక యోగి తన యోగాభ్యాసంలో పొందవలసిన ఒకానొక అనుభూతి చాలాకాలంగా పొందలేక దాదాజీ సహాయం కొరకై వచ్చారు. కానీ తన సమస్య చెప్పుకోడానికి ధైర్యం చాలలేదు. తాము దర్శించిన ఎందరో యోగుల విషయంలోలాగే ఇక్కడా జరిగిందని నిరాశపడ్డారు. ఆ రోజు రాత్రి 11 గంll ల సమయంలో దాదాజీ ఆయన కాలిపై గట్టిగా చరచడంతో ఆయనకు ఆ అనుభూతి కలిగింది! తనకు యోగసిద్ధి లభించిందని ఆయన పిచ్చిగా కేకవేసి దాదాజీగారి పాదాలు పట్టుకున్నారు.

హర్దా నివాసియైన సదాశివ్ శిరిడీ సాయినాథుని భక్తుడు 1918 సంllలో సాయిబాబా నిర్యాణం చెందిన పిమ్మట అతడెంతో నిరాశా, నిస్పృహలకు లోనయ్యాడు. ఒకరాత్రి అతనికి కలలో సాయినాథుడు కనిపించి "బిడ్డా! దుఃఖించవద్దు. ఇప్పుడు నేను సాయిఖేడాలో ఉన్నాను. నా దర్శనానికి రా!" అని చెప్పారు. అనతికాలంలోనే సాయిఖేడా చేరిన సదాశివ్ దాదాజీ స్థానంలో సాయిబాబా దర్శనం కాగా సంతోషంతో తరచూ దాదాజీ దర్శనానికి వచ్చేవాడు.

నీలకంఠరావు నాగపూర్ తాజుద్దీన్ బాబాకు, బాబాజీకి భక్తుడు. తన ఇంట శ్రీ తాజుద్దీన్ పటం ఎదుట కూర్చొని ధ్యానం చేస్తున్న అతనికి ఒకనాడు సమాధిస్థితి అనుభవమైంది. మరునాటి ఉదయం దర్శనానికి వెళ్ళిన ఇతనికి తాజుద్దీన్‌బాబా, "ధునీవాలాదాదాజీ దర్శనం చెయ్యి" అని ఆజ్ఞాపించారు. అతనలాగే చేశాడు. బాబాతాజుద్దీన్‌ల నిర్యాణానంతరం ఒకసారి షేక్‌మునీర్ మొll ఇతర భక్తులతో కలిసి దాదాజీ దర్శనానికి వెళ్ళినప్పుడు 'తాజుద్దీన్‌బాబా తెరమరుగయ్యారు. ఇకలేరు' అన్నాడు నీలకంఠరావ్. "నిజానికి ఆయనకాదు మరణించింది, మనమే" అని, దాదాజీ వారిని సమీపంలోవున్న చెట్టు క్రిందకు వెళ్ళి పైకి చూడమన్నారు. వారలాగే చేయగా చెట్టుపై కూర్చొని తాజుద్దీన్‌బాబా దర్శనం ఇచ్చారు.

1928 సంllలో ఒకరోజు రాత్రి హఠాత్తుగా సాయిఖేడా విడిచిన దాదాజీ బుధనీ, చికిలీ, నెమెవార్ అనే ఊర్లలో కొంతకాలం ఉండి ఉజ్జయిని చేరారు. అక్కడే ఒక సంవత్సరము పాటు ఉన్నారు. ఆపైన బజ్‌బాహులో మూడు నెలలున్నారు. తరువాత తమ స్వస్థానమైన కాశీ వెళ్ళాలని చెప్పేవారు. నవంబర్ 1930లో ఖాండ్వా చేరారు. ఆ నెలలోనే 29 తారీఖున కట్టెపొంగలి కాస్త తిని మంచముపై పడుకున్నారు. భక్తులకు వారనుగ్రహించిన చివరి దర్శనం అదే. దర్శనానికై వచ్చే గుంపులనాపజాలక రక్షణ కోసం వారి పడక చుట్టూ కర్రలతో అడ్డుకట్టారు. అలా పడుకున్న దాదాజీ వరుసగా నాలుగు రోజులు లేవలేదు. భక్తులు వారు నిద్రిస్తున్నారనే భావించారు. కాస్త అనుమానం తోచగా హరహర బోల్‌మహరాజ్, గంగాధర బ్రహ్మచారి వంటి భక్తులు మెల్లగా దాదాజీ ముఖంమీద గుడ్డను తొలగించి చూచారు. దాదాజీ నిర్యాణం చెందారన్న కఠోర సత్యాన్ని వారు గుర్తించక తప్పలేదు. నిర్ఘాంతపోయిన భక్తులంతా ఒక్కసారిగా పెద్దపెట్టున దుఃఖించడం మొదలుపెట్టారు. అంతే కొన్ని లక్షలమంది ప్రవాహంలా చివరి దర్శనానికై వస్తూనే ఉన్నారు. భక్తులంతా కలిసి శాస్త్రోక్తంగా దాదాజీగారి దేహాన్ని డిసెంబరు 3 తారీఖున సమాధి చేశారు. నేటికీ దాదాజీ నిర్వహించిన "ధుని"ని సంస్థానం వారు కొనసాగిస్తూనే ఉన్నారు. నిత్యమూ హారతులూ, పర్వదినాల్లో ఉత్సవాలు జరుగుతాయి.

(డిసెంబరు 3వ తేదీ శనివారము శ్రీ ధునీవాలాదాదా గారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

**సౌజన్యం : శ్రీ దత్తస్మరణ** **సేకరణ : "అంగీరస"**

# అవధూత శ్రీ పూండీస్వామి

ఆధ్యాత్మిక పరిణితిలో చివరిది, విశిష్టమైనది, బ్రాహ్మీస్థితి అని శాస్త్రాలు చెబుతాయి. ఆ స్థితిలో ప్రకటమయ్యే బ్రహ్మవరిష్ఠుడు (అవధూత) బాలుని లాగానో, పిచ్చివాని లాగానో, లేక దెయ్యంపట్టిన వానిలాగానో ఉంటాడని ఆదిశంకరుల ఉవాచ. శాస్త్రంలో వర్ణింపబడ్డ అన్ని లక్షణాలు పుణికి పుచ్చుకొన్న రూపం అరుదు. అందులోనూ సమకాలీనులైన మహాత్ముల చేత "సామ్రాట్టు"గా ప్రశంసించబడ్డ పూండీస్వామి వారి వంటి రూపం మరీ అరుదు.



సుమారు 40 సం॥ల క్రితం అరుణాచలానికి రమారమి 15 మైళ్ళు దూరంలో ఉన్న కలశపాక్కం ప్రాంతాల్లో పిచ్చివానిలా తిరుగుతూ మొట్టమొదటసారిగా కనిపించారు శ్రీ పూండీస్వామి. పలుకరిస్తే తప్ప ఎవ్వరితోనూ మాట్లాడరు. ఎవరినీ ఏమీ అడగరు. ఎవరికైనా బుద్ధిపుట్టి పెట్టే తింటారు. అదీ విస్తర్లో పెట్టి చేతికందిస్తేనే! లేకపోతే లేదు. నడవటం మొదలెడితే అలా మైళ్ళు మైళ్ళు నిలవకుండా తిరుగుతారు. కూర్చుంటే వారాలు, నెలలు ఇక లేవరు. మళ్ళీ ఏదైనా ప్రేరణ వచ్చి లేచారా, ఇక వారాల తరబడి కూర్చోరు. ఎప్పుడు కూర్చుంటారో, ఎప్పుడు లేస్తారో, ఎప్పుడు ఎక్కడ ఉంటారో, ఏమి చేస్తారో, ఏమి చేయరో ఊహించడం ఎవ్వరికీ సాధ్యంకాదు. ఆయన పేరేమిటో, ఊరేదో, వారి వయస్సెంతో ఎవరికీ తెలియదు. ఆయన కళ్ళు మూసుకుని ధ్యానస్థులై కూర్చోగా గానీ, భగవన్నామం స్మరిస్తుండగా గానీ, ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తుండగా గానీ ఎవరూ చూడలేదు.

1960 ప్రాంతములో స్వామి కలశపాక్కానికి రెండు మైళ్ళు దూరంలో నున్న పూండీ గ్రామములో మెయిన్‌రోడ్డు ప్రక్కన ఓ ఇంటి అరుగుమీద కూర్చున్నారు. ఆ కూర్చోవడం కూర్చోవడం ఇక ఆయన 1979 లో మహాసమాధి అయ్యేంతవరకు ఆ అరుగు దిగలేదు. అంటే, సుమారు పంతొమ్మిది సంవత్సరాల పాటు మూడడుగుల వెడల్పు, అరడగుల పొడవుగల ఆ అరుగే వారి స్థిరనివాసమైంది. ఎవరైనా ఏదైనా పెడితే – అదీ చిన్నపిల్లలకు తినిపించినట్లు కలిపి తినిపించితే – తినేవారు. ఏదైనా తాగించితే తాగేవారు. కాఫీ గానీ, టీ గాని, పాలు గానీ, పండు గానీ, ఫలహారం గానీ నోటికందిస్తే సేవించేవారు. అలా ఎంతమంది ఎంత పెట్టినా తింటూనే ఉండేవారు! అంత పదార్థమూ ఆ కడుపులో ఏమయ్యేదో! అలా కాక ఏదైనా నైవేద్యం చేతికిస్తే అదలానే ప్రక్కన పెట్టేసేవారు.

ఎవరైనా పలకరిస్తే పలుకుతారు. ఏదైనా అడిగితే క్లుప్తంగా సమాధానం చెబుతారు. ఎవరు ఎలా అడిగితే అలానే వస్తుంది జవాబు.

మెయిన్‌రోడ్డు ప్రక్కనే కూర్చొని ఉన్న ఆయనను చూస్తుంటే జ్ఞానధనాన్ని వీధులలో రాసులుగా పోసుకొని అందరికీ పంచి పెట్టడానికే ఉన్నారా అనిపిస్తుంది. ఆయన దర్బారు ఎల్లవేళలా తెరిచే ఉంటుంది. ఆయనకు భక్తునికీ మధ్య ఏవిధమైన అడ్డంకి, అదుపు లేదు. రోజూ దర్శనానికి వందలాదిమంది వచ్చేవారు.

ఒకసారి ఆచార్య శ్రీ భరద్వాజగారు పూండీస్వామి సన్నిధిలో ఉన్నప్పుడు జడలు గట్టిన తలతో, గోనెగుడ్డ మాత్రమే చుట్టుకొని ఉన్న ఒక వృద్ధ సాధువు స్వామి దర్శనానికి వచ్చి, మౌనంగా ఆయన ఎదుట నిల్చున్నాడు. స్వామి అతనికేసి కొన్ని క్షణాలు నిశితంగా చూచారు. అంతే జరిగింది. ఆ రాత్రే ఆచార్య భరద్వాజగారు ఆ సాధువును కలుసుకొని ఆయనను గూర్చిన వివరాలు తెల్పమని అడిగారు. ఆయన ఏన్నో ఏండ్లుగా తీవ్ర యోగాభ్యాసం చేస్తూ హిమాలయాల్లో ఉన్నారనీ, కానీ ఆ యోగంలో ఒక స్థితిలో నిలిచిపోగా తనను ఆ పై మెట్టుకు తీసుకుపోగలిగిన సద్గురుమూర్తి కొరకై అక్కడే అన్వేషిస్తూంటే ఒక అవధూత కన్పించి, అరుణాచలానికి సమీపంలో ఉన్న శ్రీ పూండీస్వామి వారి దర్శనం చేసుకోమని ఆదేశించారనీ, దానిని అనుసరించి తానిక్కడకు వచ్చానని, వచ్చి చూడగా హిమాలయాల్లో తనకు దర్శనమిచ్చిన అవధూత సరిగ్గా పూండీస్వామి వారేననీ ఆ సాధువు చెప్పారు. అంతే కాక శ్రీస్వామి దృష్టి తన మీద పడగానే తాను అంతకాలం ఏ ఆధ్యాత్మికస్థితి కోసమైతే తపిస్తున్నాడో ఆ స్థితి అప్రయత్నంగా తనకు అనుభవమైందని కృతజ్ఞత ఉట్టిపడే స్వరంతో ఆ సాధువు చెప్పాడు.

ఇలా చరిత్రకెక్కని ఎందరు సాధకులకు, సాధువులకు దృష్టి మాత్రం చేతనే దివ్యజ్ఞానాన్ని ప్రసాదించారో శ్రీ స్వామి? తానెప్పుడూ ఆ శరీరానికి పరిమితంకాని శ్రీస్వామి 1979లో శరీరత్యాగం చేశారు. కానీ ఇప్పటికీ పూండీలోని ఆయన సమాధి వద్ద ఆయన శరీరంతో ఉన్నప్పటికంటే ఎక్కువగా వారి సన్నిధి, అనుగ్రహం అనుభవమౌతున్నాయి.

అరుణాచలానికి (తిరువణ్ణామలై) చుట్టూ ముప్పై మైళ్ళు వ్యాసంలో ఉండే ప్రదేశమంతా అరుణాచల తేజోమండలమనీ, ఆ ప్రదేశంలో ఎప్పుడూ ఎవరో ఒక జీవన్ముక్తులు సదేహులై ఉంటారనీ పురాణ ప్రసిద్ధి.

(నవంబరు 3వ తేదీ అవధూత శ్రీ పూండీస్వామి అరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **శ్రీ దత్తస్మరణ** రచన : **శ్రీ ఆర్. శరత్‌బాబు**

# మాష్టారు చూపిన మహాత్ములు

భగవంతుడు లీలామానుష విగ్రహుడు. సర్వాంతర్యామి అయిన భగవంతుని లీలలు హరిహర బ్రహ్మాదులకైనా తెలియ వశముకాదు. అటువంటిది, కేవలం కోరికలు తీర్చమనో, కష్టాలు తొలగించమనో భగవంతుడిని ఆరాధించే వారికి ఆయన లీలా విలాసములు తెలియ తరమా! అనుకున్నది లభించినప్పుడు ఆనందములో తేలి, నెరవేరనప్పుడు దుఃఖముతో కృంగిపోయే జీవులు, సర్వాంతర్యామి తత్త్వాన్ని అవగతం చేసుకోగలరా! తన వలెనే మనకు భౌతిక దేహం ఇచ్చిన భగవంతుడు తన దరి చేర్చుకొని, తనవాడిని చేసుకోడా? అని ప్రశ్న ఉదయించవచ్చు, చేసుకుంటాడు, అయితే అందుకు తీవ్రమయిన మన ప్రయత్నము అవసరము. ప్రహ్లాదుడు, తుకారాం, మీరాబాయి, త్యాగయ్య, రామదాసు మొదలైన భక్తాగ్రేసుల వలే జీవించగలగాలి. అందుకే జన్మతః సంక్రమించిన సంస్కారానికి తోడుగా, నిరంతర కృషితో ఆ స్థితిని పొందవచ్చు.



అది అందరివల్ల సాధ్యమయ్యేది కాదు. అందుకని, సర్వులను ఉద్ధరించి తనవారిగా, మార్చటానికి త్రిమూర్త్యాత్మకుడైన భగవంతుడు గురు రూపంగా అవతరించటము జరిగింది. దేశ కాలమాన పరిస్థితులననుసరించి ఆయా ప్రదేశాలలో అనేక రూపాలలో త్రిమూర్తి స్వరూపమయిన దత్తాత్రేయుడు అవతరించటము జరుగుతున్నది. బాహ్యంగా వారి విధి, విధానములు వేరుగా గోచరించినా, దత్తస్వరూపులయిన వారి ఆంతర్యము, లక్ష్యము, లక్షణము అంతా ఒక్కటే, "సర్వజనోద్ధరణ". "పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు నా భక్తుడిని, అనేక మిషలమీద నా వద్దకు లాగుతాను" అన్న దత్తావతారుడైన శ్రీ శిరిడీ సాయి మాటలలోని ఆంతర్యము అదే.

ఎన్నో జన్మల పుణ్యం, ఈ జన్మలో చేసిన సత్కర్మలు, సజ్జన సాంగత్యము, తీవ్రమయిన ప్రయత్నం వలన జ్ఞానసూర్యుడైన సద్గురువు వెలుగు మనపై ప్రసరించగా, ఆ దిశగా సాగిన మన ఒక అడుగుకు పది అడుగులు వెంటనుండి ముందుకు నడిపిస్తారు సర్వాంతర్యామి, సకల జీవస్వరూపుడయిన సద్గురువు. సాగే పయనం ఎక్కడకు, ఎందుకు, దేనికోసం అని తెలిసినా, తెలియకపోయినా, వారు నడిపించినట్లు నడవటమే మన ప్రధాన కర్తవ్యం. ముందుగా ఎరుక పరచటము, పరచకపోవటం వారి ఇచ్ఛ. వారు నడిపించినట్లుగా నడవటము వలన కలిగిన ఆనందం, క్రమేపి వారి చర్యలలోని ఆంతర్యము తెలియబడుతున్న కొద్దీ, మనస్సు ఆనందడోలికలలో తేలియాడుతుంది. జగద్గురువైన సాయి విశ్వవ్యాపకాన్ని లక్షలాదిమందికి అందించి, నిర్దుష్టమైన సాయి మార్గములో పయనింప చేస్తున్న ఆచార్య పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారి మార్గ నిర్దేశకత్వంలో, వారు చూపిన మార్గంలో బుడి బుడి అడుగులు వేస్తూ, ముందుకు సాగటానికి ప్రయత్నిస్తున్న నాకు, సాయి స్వరూపులైన మహద్గురు శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి వారి వలన అలౌకికమైన ఆనందం పొందే భాగ్యం, నా పూర్వజన్మ సుకృతము, సద్గురువు కృపాశీస్సుల వలన లభించింది. ఎప్పుడు ఎవరిని ఎందుకు దరిచేర్చుకుంటారో, ఎందుకు ఏ మార్గంలో నడిపిస్తారో జగత్పితలైన సద్గురులకే ఎరుక. వారు నడిపించినట్లు త్రికరణ శుద్ధిగా నడవటము మన పని తద్వారా, "తండ్రికి తగ్గ బిడ్డలు కండి, మీ భాండాగారాలు నింపుకోండి" అన్న సాయి సూక్తిలోని మాధుర్యం ఆస్వాదించగలుగుతాము. పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు, ఏ మిషమీద శ్రీ పూర్ణానందస్వామి వారు 1994లో తన చెంతకు లాగి అద్భుతమైనరీతిలో ఒక అనిర్వచనీయమైన అనుభూతి, అనుభవాన్ని ప్రసాదించారో అప్పుడు తెలియక పోయినా (ఆ వివరాలు గత సంచికలలో ప్రస్తావించటము జరిగింది). సద్గురువు చూపిన మార్గంలో పదగామి అయినప్పుడు, ఇంకా ఎక్కువగా వారి లీలావిలాసము మాటున దాగిన అవ్యాజమైన ప్రేమామృతపు వాత్సల్యము కొంచెం కొంచెం అవగతమవుతూ మహదానందము కలుగుతున్నది. పుడమి ఒడిలో విత్తిన బీజం మొలకెత్తి, మానై, పుష్పించి, ఫలవంతమైనప్పుడు కలిగే ఆనందాన్ని మించి ఉంటుంది సద్గురువు ప్రసాదించే ఆధ్యాత్మికానందము. మాస్టారు చూపిన మహాత్ములైన మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి దర్శనానంతరం, అనేక సంవత్సరాల తరువాత 2000 సంవత్సరములో, మమ్ములను నిర్దుష్టమైన సాయిమార్గంలో పయినింప చేస్తున్న "సాయి మాస్టర్" ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పేరిట ఫిబ్రవరి 1,2,3,4 తేదీలలో మొట్టమొదట సారిగా అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము విశాఖపట్నం, ఉక్కునగరములో నిర్వహించిన కొద్దిరోజులకే, ఒంగోలు లోని మాస్టారి సమాధి దర్శనంతో పాటు గత 12 సంవత్సరాలు మాస్టారిగారి ఆజ్ఞగా వారి ఆశీర్వాదముతో శ్రీ గురుచరిత్ర పారాయణ చేసే శ్రీ కె.వి.రంగారావు గారి బృందములో కలసి శ్రీ శైలయాత్ర చేసే మహత్తరమైన అద్భుతమైన అవకాశం కలిగింది నాకు. ఇటు మాస్టారిగారి దర్శనంతో కూడి, సిద్ధ భూమి అయిన శ్రీ శైలక్షేత్ర దర్శనంతో పాటుగా మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి వారి దర్శనం కలుగుతుంది అన్న ఆనందంతో, మహోత్సాహంతో శ్రీ శైలయాత్రకు సంసిద్దులమై, ఒంగోలు చేరి మాస్టారుగారిని దర్శించుకొని, రెండు బస్సులలో శ్రీ శైలము చేరి, ఆనాటి రాత్రి (19-02-2000) సత్సంగ మధుర స్మృతులతో హృదయము నింపుకొని, ప్రభాకరుడి పలకరింపుతో, పాతాళగంగలో


పుణ్యస్నానాలు ఆచరించి, మాస్టారిగారి ఆజ్ఞపై గత 12 సంవత్సరాలుగా దీక్షగా కొనసాగిస్తున్న "శ్రీ గురుచరిత్ర" సప్తాహ పారాయణ ముగింపు 7వ రోజు అధ్యాయాలు, పాతాళగంగ ఒడ్డున గల మెట్లపై కూర్చుని పారాయణ చేయసాగేరు అందరూ. మాఘ బహుళ పాడ్యమి నాడు శ్రీ గురుడు శ్రీ శైలములోని పాతాళగంగ వద్దకు చేరి తన శిష్యులతో ఒక పుష్పనావను సిద్దము చేయమని ఆజ్ఞాపించగా, త్వరితగతిన పుష్పనావను సిద్దము చేస్తూ, శ్రీ గురుడు తన అవతార సమాప్తి చెందించబోతున్నారని భావించి విషణ్ణ వదనులైన తన శిష్యులను చూసిన శ్రీ గురుడు, అమితమైన వాత్సల్యముతో **"నాయనలారా మీకు సర్వశుభాలు ప్రాప్తించుగాక! నల్గురు ఒక్క చోట చేరి మా చరిత్ర పారాయణ చేసేవారు, అందులోని స్తోత్రాలు పఠించేవారు, నామ సంకీర్తన చేసేవారు మా ప్రీతికి పాత్రులవుతారు మా కథామృతం గానం చేసేవారింట్లో నాల్గు పురుషార్ధాలు, సిద్దులు నిత్యనివాసం చేస్తాయి, జీవితాంతము అష్టైశ్వర్యాలు అటు తర్వాత ముక్తి సిద్ధిస్తాయి. వేము ఆనందనిలయానికి వెళుతున్నాము మేము అక్కడకు చేరగానే అందుకు గుర్తుగా మీ వద్దకు నాలుగు తామరపువ్వులు నదీ ప్రవాహానికి ఎదురుగా మీ వద్దకు వస్తాయి వాటిని నా ప్రసాదంగా తీసుకొని వాటిని ప్రాణం కన్న మిన్నగా భద్రపరచుకొని పూజించుకొనండి"** అంటూ కాళ్ళకు బంగారు పాదుకలు ధరించి, తమ తలను కూడా కాషాయవస్త్రముతో కప్పుకొని, పుష్పనావను అధిరోహించి, నదిలో కనుచూపువేర ముందుకు సాగి అదృశ్యులైనారు కలియుగములో రెండవ దత్తావతారమైన శ్రీ గురుడుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహ సరస్వతిస్వామి.

పవిత్రమైన పాతాళగంగ చరణాల చెంత నిత్య అనుష్టాన, పారాయణ మరియు శ్రీ గురుచరిత్రలోని 51వ అధ్యాయము పారాయణ పూర్తిచేసిన నేను, శ్రీగురుని స్పర్శతో పునీతమై వడివడిగా సాగే పవిత్ర పాతాళగంగా ప్రవాహముపై దృష్టి సారించి ఉండిపోయాను. నులివెచ్చని సూర్యకిరణాలు శిశిర నైరాశ్యాన్ని తొలగిస్తూ, నూతన తేజాన్ని కలుగ చేస్తుండగా, శ్రీగురు స్వరూపమయిన చరిత్ర పారాయణ, హృదయ కవాటాలను తెరిచి, ఆధ్యాత్మిక రసానుభూతితో వసంతంలా హృదయమంతా నిండగా, శ్రీగురు చరణ కమలములపై ధ్యానదృష్టి సాగగా, మనోఫలకముపై ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమయింది. గలాగలా పారే పాతాళగంగ ప్రవాహముపై, సప్తవర్ణ శోభితముగా విరాజిల్లే పుష్పనావలో, కోటి సూర్యప్రభల తేజస్సుతో వెలుగొందుతూ, సుశోభితమైన సువర్ణ పాదుకలతో, అరుణకాంతి శోభితమైన దివ్య వస్త్రముతో, శరత్‌చంద్రునిలా, సుమధుర దరహాస చంద్రికలను చిందిస్తూ, అభయ ముద్రతో సాగిపోతున్న శ్రీ గురుని దివ్య మంగళ రూపము చక్షువులనే ద్వారము గుండా హృదయమనే ఫలకపై అఖండ వెలుగుతో గోచరిస్తుంటే, అంతరంగాలలో ఉవ్వెత్తున ఎగిసిన ఆనందాత్మనుభూతి ఝరి, నదీ ప్రవాహములా కొనసాగుతుండగా, క్షణాలు నిమిషాలై, గంటలరూపములోనికి మారగా, అపరిచిత స్పర్శతో, అప్రయత్నముగా బాహ్యములోనికి లాగబడి నిరామయముగా ఉండిపోయిన క్షణాన, నా అరచేతులలో సుమధుర పుష్ప సహిత శ్రీఫలాన్ని ఉంచి నమస్కరిస్తూ ఎదురగా నిల్చున్నారు మాస్టారిగారి ఆజ్ఞ మేరకు పారాయణ యజ్ఞం కొనసాగిస్తున్న వారిలో ముఖ్యులైన ఇరువురు. బాహ్యాంతరాలలో నిండినిలిచిన, అద్భుతమైన ఆ దృశ్యము కనుల ఎదుట కదలాడుచుండగా, ఆ స్థితినుండి బయటకు రావటానికి మనస్సు, శరీరము సహకరించటం లేదు. మనస్సంతా నిరామయంగా ఉండిపోయింది. "చాలా సేపటినుంచి మీ ఎదుట నిల్చున్నాము. ధ్యానములో ఉన్నట్లున్నారు. అంతరాయము కలిగించటము ఎందుకని ఉండిపోయాము. గత 12 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న శ్రీగురుచరిత్ర సప్తాహ పారాయణ నేటితో సంపూర్ణమయింది, పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి ఆజ్ఞననుసరించి గత పదకొండు సంవత్సరాలుగా శ్రీగురుడు అంతర్ధానమైన మాఘ బహుళ పాడ్యమి నాటికి శ్రీగురుచరిత్ర పారాయణ చేసి, చివరి రోజు పారాయణ పాతాళగంగ వద్ద ముగించి, మహద్గురు శ్రీ పూర్ణానందస్వామిని దర్శించుకోమన్న మాస్టారిగారి మాటను ఇంత వరకు వారి అనుగ్రహముతో నెరవేర్చుకోగలిగేము. చివరిది అయిన ఈ 12వ సంవత్సరము పారాయణ ముగించిన అనంతరము దక్షిణ ఎవరికి సమర్పించాలి అన్న మీమాంస రాగా, మాస్టారు తగురీతిన మమ్ములను ప్రేరేపించి మీకు అందజేయమన్నారు. బహుశా అందుకేనేమో మా ఈ చివరి యాత్రలో మీరు పాల్గొనటము సాయి-స్వామి-మాస్టర్‌ల లీలా విలాసము అయ్యి ఉండవచ్చు. అందుకనే మా ఈ దీక్ష ముగించిన తరువాత మాస్టారి ఆజ్ఞననుసరించి మీకు పుష్ప, శ్రీఫలము సహితముగా దక్షిణగా మీకు సమర్పిస్తున్నాము. అందుకోవటానికి మీరు సుముఖముగా లేకపోయినా, మాస్టారి ఆజ్ఞను పాటించటము మా విధి, మాస్టారి మాటను మన్నించటము మీ పని అంటూ దక్షిణపూర్వకముగా నా చేతిలో శ్రీఫల, పుష్పాదులను ఉంచి చేతులు జోడించి నమస్కరించారు" ఆ ఇరువురు. సద్గురువు లీలా విలాసముతో నిండిపోయిన మనస్సు గాఢమైన శాంతి, ఆనందాలతో నిండిపోయింది. ఇప్పటికీ ఆ సంఘటన తలుచుకుంటే చైతన్యవంతమైన ఆ దృశ్యము కనుల ముందు కదలాడుతుంటే, హృదయమంతా ఒక మధురానుభూతితో నిండిపోతున్నది. ఏమని చెప్పను, ఎంతని చెప్పను, ఎలా చెప్పను శ్రీగురుని లీలా విలాసము. నేటికీ తలచుకున్న క్షణాన బాహ్యాంతరాలను మరిపింప చేసే ఆ సంఘటన ప్రభావం నుండి బయటకు రావటానికి తీవ్ర ప్రయత్నమే అవసరమవుతున్నది. దానికి కారణం, దానిని ఆధారము చేసుకొని, అటుపిమ్మట సిద్ధభూమియైన శ్రీశైల మహాక్షేత్రములో మహద్గురు పూర్ణానందుల వారి అనుగ్రహముతో, వారి సన్నిధిలో నాకు కలిగిన అనుభవాల అనుభూతుల దొంతరలే కారణం, వాటిని ఒక్కొక్కటిగా తెరచి, మీ ముందు ఉంచటానికి ప్రయత్నిస్తాను. అలనాటి మధుర జ్ఞాపకాలతో నిండిన మనస్సు ముందుకు సాగటానికి మొరాయిస్తున్నది. అందుకని మరు సంచికలో మీతో కలసి సాయిస్వరూపులైన శ్రీ పూర్ణానందుల వారి లీలా విలాసాలను పంచుకోవటానికి ప్రయత్నిస్తాను.

మీ... **వి.వి.పూర్ణచంద్రరావు**

# శ్రీ ఉపాసనీబాబా

శ్రీ ఉపాసనీబాబా మహారాష్ట్రమందలి నాసిక్ జిల్లాలోని 'సటానా' గ్రామమందు 1870వ సంవత్సరమున యాజ్ఞవల్క్య శాఖకుచెందిన బ్రాహ్మణ పురోహిత కుటుంబములో జన్మించినారు. వీరి తాతముత్తాతలందరు వేదశాస్త్ర పండితులు. తండ్రి గోవిందశాస్త్రి. తల్లి రుక్మిణీబాయి. ఈయన పూర్తిపేరు కాశీనాథగోవిందశాస్త్రి. బాల్యమునవీరిని ఉపాధ్యాయుడు కొట్టిన కారణమువల్ల బడి విద్యకు స్వస్తిచెప్పిరి. బాల్యమునుండి తపస్సుఅంటే అమితాసక్తి. పరోపకారమంటే పరమప్రీతి. ఎనిమిది సంవత్సరముల వయసు నుండి ఈ శరీరపోషణ అలంకరణారోగ్యమును చూచుకొనుటకే అమూల్యమైన మనకాలము, శక్తియు వ్యయమగుచున్నవి కనుక యీ దేహమే మనకు పరమ శత్రువని సిద్ధాంతముచేసి 18వ యేట నాసిక్‌కు పదమూడు మైళ్ళలో నున్న బోర్‌గాడ్ అనే గ్రామసమీపమున కొండగుహలో కూర్చుండి ప్రాయోపవేశము చేసి మరణమెట్లు తటస్థించునో, అనగా ప్రాణములు శరీరమును యెట్లు వదలిపోవునో అను విషయ పరిశోధనకై పూనుకొనిరి. కాని మరణించుటకు బదులు సమాధి నిష్ఠలోకొన్ని మాసములుండి పోయిరి. తిరిగి యింటికి వచ్చి పలుకష్టములకు పాల్పడి జీవనోపాధికై ఆయుర్వేద వైద్యమభ్యసించి, పది సంవత్సరములు బీహారులోని 'అమరోటి'లో వైద్యవృత్తిలో నుండిరి. అనంతరము ఒక శివరాత్రికి భార్యా సమేతముగా నర్మదా తీరమందలి ఓంకారేశ్వరమునకు యాత్రకు పోయి అచట ఒక ఏకాంత ప్రదేశమునందు సమాధి నిష్ఠులైయుండగా ఈ విషయ మేమియు తెలియని ఆయన భార్యయగు దుర్గాబాయి భయపడి చల్లని నీటితో ఆయన శిరస్సుతడిపి బలాత్కారముగా తెలివిని తెప్పించెను. అప్పటినుండియు నొక వింతయైన శ్వాస రోగము ఆయనను పీడింప ప్రారంభించెను. వైద్య చికిత్స నిష్ప్రయోజనము కాగా సాధువులను యోగులను ఆశ్రయింప మొదలిడి తుదకీయన యిష్టములేకున్నను 1911లో శిరిడీ నివాసియైన శ్రీ సాయిబాబా వద్దకేగిరి. బాబా ఆజ్ఞ ప్రకారం ఖండోబా ఆలయంలో దాదాపు మూడున్నర సంవత్సరములుండి పలుకష్టములనుభవించి సంసార బంధములను త్రెంచుకొని జీవన్ముక్తులయిరి. పిమ్మట ఒక సంవత్సరకాలము ఖడ్గపురమందుండి అనేక మహిమలు ప్రదర్శించి పెక్కండ్రు భక్తుల ననుగ్రహించి 1917లో సాకోరీ గ్రామస్థుల ప్రార్ధనపై ఆఊరి బయట శ్మశానములో ఒక కుటీరమందు స్థిరపడిరి. ఇక్కడనే ప్రస్తుతము 'ఉపాసనీ కన్యాకుమారీ స్థానము' అనబడు దివ్య క్షేత్రము వెలసినది.



శ్రీసాయిని ఆశ్రయించి, ఉత్తమ పథంలో పయనించి గురుస్థానములో నిలచినవారిలో శ్రీ ఉపాసనీబాబా ఒకరు. బాబా దేహం వదలిన వెంటనే శ్రీ ఉపాసనీబాబా స్వయంగా పాల్గొనటమే కాక 7వ రోజున స్వయముగా కాశీ వెళ్ళి 1100మంది బ్రాహ్మణులచేత విశ్వేశ్వరునికి అభిషేకము చేయించి, వారికి భోజనము, దక్షిణ, శాలువలు సమర్పించారు శ్రీ ఉపాసనీబాబా. భక్తుల బంధవిమోచనకై 1922 ప్రాంతమున వెదురు కఱ్ఱలతో నిర్మింపబడిన ఒక చిన్న పంజరము(పింజరా)లో తమను బంధించుకొని దాదాపు పదిహేను మాసములు అందుండిపోయిరి. ఈ కాలమందే అమృతవాహిని అనదగు వారి వాక్ స్రవంతి అహోరాత్రములు కర్ణ పేయముగా ప్రవహించెడిది. తరువాత కాలములో ఈ ప్రవచనములు 'సాయివాక్ సుధ', 'ఉపాసనీ వాక్ సుధ' అనుపేర్లతో ఐదైదు సంపుటములుగా మరాఠీ భాషలో ప్రచురింపబడినవి. శ్రీ ఉపాసనీబాబా భక్తులకు భక్తి, జ్ఞాన, వైరాగ్య బోధలు చేయుచు స్త్రీలు గూడ పురుషుల వలెనే బ్రహ్మచర్యదీక్ష నవలంభించి జన్మ సాఫల్యమునకు సాధన చేయుటకు, కన్యాకుమారీ స్థానమును స్థాపించిరి. యజ్ఞయాగాది క్రతువులను పునరుద్ధరించి భగవద్భక్తితో గూడిన స్వధర్మాచరణయే జ్ఞానోదయమునకును మోక్షప్రాప్తికిని అత్యావశ్యకమని నిరూపించిరి. సదుపదేశముల వలన భక్తబృందమునకు సన్మార్గదర్శియై 1941వ సంవత్సరము డిశంబరు 24వ తేదీన భౌతిక శరీరమును వీడి పరబ్రహ్మైక్యమందిరి.

శ్రీ ఉపాసనీబాబాకు యిరువది నలుగురు కన్యలు శిష్యురాండ్రైరి. వీరిలో శ్రీ సతీగోదావరీ మాత ముఖ్యురాలు. బాబా అనంతరం ఈమెయే సద్గురు స్థానమలంకరించి కన్యాకుమారీ స్థానము యొక్క లౌకిక పారమార్థిక వ్యవహారములన్నింటినీ, సమర్థతతో చక్కదిద్దినారు.

సాకోరి శిరిడీకి మూడు కిలోమీటర్ల దూరములో ఉన్నది. శ్రీ ఉపాసనీబాబా వారి మందిరంలో శ్రీ ఉపాసనీబాబా సమాధి, శ్రీ గోదావరి మాత సమాధి, ఆశ్రమము వెలుపల శ్రీ గోదావరిమాతచే ప్రతిష్టంచబడిన ఏకముఖ శ్రీదత్తాత్రేయ మందిరము చూడవలసినవి. శిరిడీ వెళ్ళినవారు తప్పక చూడవలసిన స్థలము సాకోరీలోని శ్రీ ఉపాసనీబాబా మందిరము. (డిసెంబరు 24వ తేదీ శ్రీ ఉపాసనీబాబా ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **'శ్రావణి'**

# దైవీసంపద - శ్రీరామభక్త రంగన్నబాబు

అది ఒక మండు వేసవి. రోహిణీకార్తె. గుంటూరులో రంగన్నబాబుగారిని దర్శించటానికి బ్రాడీపేటలో ఒకరింటికి వెళ్ళాము. సరిగ్గా నేను గడపలో కాలు పెట్టేసరికి శ్రీరామభక్త రంగన్నబాబుగారు ఎంతో శ్రమతో ఒక పెద్ద బకెట్టు నిండా కొంత నీరు, ఇంకొక పెద్ద చెంబు నిండా కొంత నీరు, తీసుకొని ఎంతో ఆయాసపడుతూ మేడమీదికి వెళుతున్నారు. 4, 5 మెట్లెక్కి ఆగి, కొంత అలసట తీర్చుకొన్నాక మళ్ళీ పైకెక్కుతున్నారు. నేను మెట్లమీద వారిని కలుసుకొని నమస్కరించగానే "నమస్కారం-నమస్కారం, ముసలాణ్ణి గదయ్యా ఒక్కసారిగా ఎక్కలేను. రాముడు దయ ఏమోగాని ఈ ఎండలో భలే నీరసమనిపిస్తున్నది. నేను వెనకాలే వస్తాను, నీవు ముందు పోయి కూర్చో. అక్కడే కొత్త కుండలో నీళ్ళున్నాయి త్రాగు" అన్నారు.



"ఆ బకెట్టు నేను తెచ్చి పెడతాను, నాకివ్వండి" అన్నాను.

"అమ్మో-అమ్మో అట్లా యిస్తే రాముడొప్పుకుంటాడటయ్యా, నీవు పైకిపో, నేను తెచ్చుకుంటా" అన్నారు. నేను ముందుగా పైకి వెళ్ళి, మంచినీళ్ళు త్రాగి వరండాలో కూర్చున్నారు.

శ్రీ బాబుగారు అంతకు ముందే మధ్యాహ్నం నిద్రపోయి లేచి, అప్పుడే స్నానం చేసి వస్తున్నారని అర్థమైంది. మంచినీళ్ళు అక్కడనే ఉన్నాయి. స్నానము ఆయన క్రింద బావి దగ్గర చేశారు. గుడ్డలు కూడా అక్కడే జాడించుకొంటారు. ఇక దేనికింత కష్టపడి ఆ నీళ్ళు ఆయన మోస్తున్నారో నాకర్థంకాలేదు. ఆ వయస్సులో లేని పోని శ్రమ కల్పించుకున్నందుకు ఆయన చాదస్తం పట్ల నాకు కొంత చికాకేసింది. మరుక్షణమే బాబుగారు పైకి వచ్చి "కొద్దిసేపు కూర్చో అయ్యా ఇప్పుడే వస్తాను" అని చెప్పి ఆ బకెట్టులోని నీళ్ళు ఆ వరండాలో అంతటా పొందిగ్గా చల్లారు. ఒక్కొక్కసారి ఆరిపోయేలోపల రెండవ వరుస చల్లారు.

"భక్తులొచ్చే వేళ అవుతుంది. కాస్త నీళ్ళు చల్లితే కూర్చుంటారు" అన్నారు బాబుగారు. నాకా విషయం ఆలోచనలో కూడా తోచనందుకు ఈసారి నాపై నాకే సిగ్గేసింది. ఇంతలో బాబుగారు చెంబునిండా తెచ్చిన నీరు అక్కడ వరండాలో గుంటలుంటే వాటినిండా పోశారు. కొత్తకుండలో నీళ్ళు భక్తులు త్రాగడానికనీ, బాబుగారు తనకోసం చెంబులో తెచ్చుకుంటారని అనుకొన్నాను. ఆ నీరంతా ఆయన గుంటల్లో పోస్తుంటే ఎందుకో అర్థం కాలేదు. చివర గుంట నిండగానే బాబుగారు గభా గభా నా ప్రక్కకి వచ్చి నిలబడి "ఇప్పుడు చూడయ్యా, ఇప్పుడు చూడు" అన్నారు. ఏదో రాముని మహిమ చూపించబోతున్నారని అనుకున్నాను. రెండు పిచ్చికలొచ్చి పిట్టగోడ మీద వాల్తూ ఎంతో గోల గోలగా అరిచాయి. అంతటితో ఎన్నో పిచ్చుకలు చేరాయి. అన్నీ గుంటల్లోని నీటిలో కేరింతలు కొడుతూ మునిగాయి.

"చూడయ్యా, చూడు! ఇంత వేసవిలో వాటికి "దాహం కావాలా" అని అడిగేదెవరు. ఎంత కొద్ది నీటికి ఎంత సంతోషించాయో! ఇది చూచి కూడా ఎందుకు రంగన్నా నీకింత శ్రమ అంటారయ్యా, పరమాత్ముడు నీళ్ళిచ్చాడు. ఎక్కొచ్చేటప్పుడు ఒక చెంబుతో నీళ్ళు తెచ్చుకుంటే, చూడు వాటికెంత సంతోషమో" అని అన్నారు. ఇది గాబోలు సత్వగుణమన్నా, దైవీసంపదన్నా, భగవద్గీతాది శాస్త్రాలలో ప్రతిదానికి చక్కని వివరణ పూర్ణ పురుషుల ద్వారా నిత్య సత్యాలలోనే గదా కనిపించేది అని అనిపించింది" అంటూ శ్రీ రంగన్నబాబు గారితో తనకు గల అనుబంధాన్ని, అనుభవాన్ని స్వయంగా తెలియజేశారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారు.

(అక్టోబరు 31వ తేదీ సోమవారము కార్తీక శుద్ధ పాడ్యమి - శ్రీ రంగన్నబాబుగారి ఆరాధనోత్సము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **శ్రీ రంగన్నబాబుగారి చరిత్ర**


సేకరణ : **శ్రీ జొన్నలగడ్డ భానుమూర్తి**, గుంటూరు

## మాధుర్యం

మాస్టరుగారు (పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు) నడుస్తున్నారు. విద్యానగర్ నుండి కోట వైపు సరదాగా. వెంట 5,6 మంది మిత్రులున్నారు. రకరకాల విషయాలు చర్చలో సాగిపోతున్నాయి. కోట సెంటర్ వచ్చింది, తెలిసిన వారెవరో పలకరించారు. తిరిగి వస్తుంటే దారిలో మాస్టారి దృష్టి స్వీట్ స్టాల్‌లో జాంగ్రీలపై పడ్డది. ప్రక్కనున్న విజయ కుమార్‌తో మాస్టారు, "ఏమోయ్, ఆ స్వీట్ కొంచెం తీసుకురా" అన్నారు. అతను వెళ్ళి కొని తీసుకొచ్చాడు.

రూముకు రాగానే, తలా కొంచెం స్వీట్ ఇస్తూ, సాధారణంగా నాకేమీ ప్రత్యేకంగా తినాలని ఉండదు. ఎప్పుడైనా ఒకసారి అలా అన్పిస్తే, ఆ పదార్థం తెచ్చి ఎదుటి వారిని సాయి రూపంగా తలచి సమర్పించి, కొద్దిగా తీసుకుంటే చాలు, ఇక ఆ కోరిక తీరిపోతుంది. కోరికను అణగ దొక్కే కొద్దీ మరింత బలం పుంజుకుంటుంది అన్నారు. స్వీట్‌తో పాటు వారి మాటల మాధుర్యమూ ఆస్వాదిస్తూ మౌనం వహించాం.

సేకరణ : **"శాండిల్య"**




## కాలం - విలువ

1 సం॥ విలువ - పరీక్ష తప్పిన విద్యార్థిని అడగండి
1 నెల విలువ - గర్భిణీస్త్రీని అడగండి
1 వారం విలువ - వారపత్రిక సంపాదకుడిని అడగండి
1 రోజు విలువ - రోజుకూలీని అడగండి
1 గంట విలువ - ప్రేమికుడిని అడగండి
1 ని॥ విలువ - రైలు అందుకోలేని ప్రయాణీకుడిని అడగండి
1 సెకను విలువ - ప్రమాదంనుండి బయటపడిన వారిని అడగండి
1 మిల్లీసెకను విలువ - బంగారు పతకం చేజార్చుకున్న అంతర్జాతీయ క్రీడాకారుడిని అడగండి

కాలం చాలా విలువైనది - కనుక వృధా చేయకండి

## నిత్యసత్యాలు

వందకోట్లకు అధిపతివి అయినా
- ఒక్క నిముషం ఆయుష్షు కొనలేవని తెలుసుకో

కోటి కోట్లకు వారసునివైనా
- ఊపిరి పోగానే ఊరిబయట పారవేస్తారని తెలుసుకో

వందమంది డాక్టర్లు నీవెంట ఉన్నా
- నీ పరలోక ప్రయాణం ఆపలేరని తెలుసుకో

ప్రపంచానికంతటికీ అధిపతివైనను
- నీ ఆయుష్షుకు అధిపతి కాలేవని తెలుసుకో

యావత్ ప్రపంచాన్ని ఓడించగలిగినా
- మృత్యువును జయించలేవని తెలుసుకో

నీవు తిన్నది మట్టిపాలు
- ఇతరులకిచ్చినది నీపాలని తెలుసుకో

నీవు దాచుకున్నది జారిపోతుంది
- ఇతరులకిచ్చినది, సహకరించినది, నీకు జమ అవుతుంది అని తెలుసుకో

భోగాలకు ఖర్చుచేసి రోగాలను తెచ్చుకోకు
-మంచిపనులకు ఖర్చుచేసి పుణ్యాలను పెంచుకో
ఆ పుణ్యమే నీరాతను నిర్ణయించునని తెలుసుకో

## (కుంకుమ) బొట్టు ఎందుకు ధరించాలి?

మన శరీరంలో ప్రతి అవయవానికి ఒక్కో అధిదేవత ఉన్నాడు, బ్రహ్మ, లలాటం బ్రహ్మ స్థానం. బ్రహ్మ దేవుడి రంగు ఎరుపు, కావున బ్రహ్మ స్థానమైన లలాటాన ఎరుపు రంగు బొట్టు ధరించాలి, అనగా కుంకుమ, లలాటన సూర్యకిరణాలు తాకరాదు. మనలోని జీవి, జ్యోతి స్వరూపుడుగా భ్రూమధ్యంలోని ఆజ్ఞాన చక్రంలో సుషుప్త దశలో హృదయ స్థానంలో అనగా అనాహత చక్రంలో ఉంటాడు.

కుంకుమను ఉంగరపు వ్రేలితో పెట్టుకుంటే - శాంతి, ప్రశాంతి చేకూరుతుంది. నడివ్రేలుతో ధరిస్తే - ఆయువు సమృద్ధి చెందుతుంది. బొటనవ్రేలితో ధరిస్తే - శక్తి వస్తుంది. చూపుడు వ్రేలితో ధరిస్తే - భక్తీ, ముక్తీ కలుగుతాయి. ఎప్పుడైతే నుదుటను కుంకుమ అద్దుతారో అప్పుడు జ్ఞాన చక్రాన్ని పూజించనట్లు అవుతుంది. కుంకుమ బొట్టును ధరించటం వలన పవిత్ర భావనలు కలుగుతాయి.

## తూర్పు దిశకు ప్రాధాన్యం ఎందుకు?

దేవతలకు రాజు ఇంద్రుడు. ఆయన ఆధిపత్యం వహించేది తూర్పుదిక్కు కాబట్టి దేవతల అనుగ్రహం లభించాలంటే తూర్పుదిశకు ముఖాన్ని ఉంచటం మంచిదంటారు. ఇక సైన్స్‌పరంగా చూస్తే భూమికి ఉండే ఆకర్షణ శక్తి ఉత్తర దక్షిణాలుగా ఉంటుంది.

ఆ శక్తి మనల్ని అధిగమించకుండా ఉండాలి - అంటే మనలో సానుకూల భావనలు కలగాలంటే తూర్పు దిక్కుగా తలని ఉంచడం మంచిదన్న మాట. పైగా సమస్త జీవరాశులకి ప్రాణాధారమైన సూర్యుడు ఉదయించేది తూర్పుదిక్కుగానే కదా! అందుకే ఏపని ప్రారంభించాలన్నా తూర్పు దిశగా తిరిగి చేయటం సంప్రదాయం.

## పంచపాతకాలు

పరులకు కీడు తలుచుట మనస్సు చేసిన పాపం,
పరనింద నోరు చేసిన పాపం,
పరుల ధనాన్ని అపహరించుట చేతులు చేసిన పాపం,
స్వార్థపరులతో తిరుగుట కాళ్ళు చేసిన పాపం,
పరనిందలను వినుట చెవులు చేసిన పాపము ఇవే పంచపాతకములు.

## తిరుమల శ్రీవారు-అభయహస్తం

శ్రీ వేంకటేశ్వరస్వామి అభయహస్తంతో మనకు సాక్షాత్కరిస్తాడు, స్వామివారి అభయహస్తం మనకు చూపటంలోని అర్థం, మన శరీరంలో వ్యాన, సమాన, ఉదాన, ప్రాణ, అపానములను వాయువులుంటాయి. ఆ అయిదు వాయువులు నిలిచిన మనస్సు నిలకడగా ఉంటుంది. కావున ఆ అయిదు వాయువులను ఒక్కటిగా చేసి ప్రార్థించు అని భావము.

ఈ పేజి సమర్పించినవారు : శ్రీ నరసింహపట్నాయిక్, శ్రీమతి స్వర్ణలత - విజయనగరం

# శ్రీ దత్తాత్రేయ వజ్రకవచమ్

1. ఓం దత్తాత్రేయుడు సహస్రారకమలంలో ఉండి నా శిరస్సును రక్షించుగాక. చంద్రమండల మధ్యభాగంలో ఉన్నటువంటి అనసూయేయుడై నా ఫాలాన్ని కాపాడుగాక.

2. శ్రీ దత్తాత్రేయుడు హం, క్షం అను రెండు బీజాక్షరములు గల అజ్ఞాత చక్రమందుండెడి మనోమయుడై నా గెడ్డమును రక్షించుగాక. జ్యోతిస్వరూపుడై నా రెండు కన్నులను కాపాడుగాక. శబ్దస్వరూపుడై నా రెండు చెవులను కాపాడుగాక.

3. శ్రీ దత్తాత్రేయుడు గంధస్వరూపుడై నా ముక్కును రక్షించుగాక. రసస్వరూపుడై నా ముఖమును రక్షించుగాక. వేదస్వరూపుడై నా నాలుకను కాపాడుగాక. ధర్మస్వరూపుడై నా దంతములనూ, రెండు పెదవులనూ కాపాడుగాక.



4. శ్రీ దత్తాత్రేయుడు అత్రిభవుడై నా రెండు చెంపలను రక్షించుగాక. ఆత్మవిదుడై నా ముఖమునంతటినీ రక్షించుగాక. సర్వఆత్మల స్వరూపుడై షోడశార కమలములో ఉండి నా కంఠమును కాపాడుగాక.

5. శ్రీ దత్తాత్రేయుడు చంద్రునకు సోదరుడై నా స్కందములను రక్షించుగాక. కృతాదియుగములలో భూమిపై అవతారములు దాల్చి నా రెండు భుజములను రక్షించుగాక. శత్రువిజేతయై నా భుజపుటెముకలు రెండింటినీ కాపాడుగాక. హరియై నా వక్షస్థలమును కాపాడుగాక.

6. శ్రీ దత్తాత్రేయుడు 'క' కారం మొదలు 'ఠ' కారం వరకూ గల ద్వాదశదళ కమలమైన అనాహత చక్రమందు యోగీశ్వరేశ్వరుడై యుండెడి వాయుస్వరూపుడై నా హృదయములో ఉండి నా హృదయమును కాపాడుగాక.

7. పార్శ్వస్థితుడనబడిన శ్రీ దత్తాత్రేయుడు, హరి, పార్శ్వాలలో ఉంటూ నా ఉభయ పార్శ్వములను రక్షించుగాక. హఠయోగము మొదలైన సర్వయోగములను ఎరిగిన యోగజ్ఞుడై, దయానిధియై నా కుక్షిని కాపాడుగాక.

8. శ్రీ దత్తాత్రేయుడు 'డ' కారము మొదలు 'ఫ' కారము వరకూ గల దశదళ కమలమైన మణిపూరక చక్రమందుండెడి అగ్నిస్వరూపుడై నా నాభిని రక్షించుగాక.

9. శ్రీ దత్తాత్రేయుడు అగ్నితత్వమయుడైన యోగియై నా మణిపూరకాన్ని రక్షించుగాక. కటిలో ఉన్న బ్రహాండ వాసుదేవ స్వరూపుడై నా కటిని కాపాడుగాక.

10. శ్రీ దత్తాత్రేయుడు 'వ' కారము మొదలు 'ల' కారము వరకూ గల షట్పత్ర కమలాన్ని వికసింపజేసే జలతత్వమయుడై నా స్వాధిష్ఠాన చక్రాన్ని రక్షించుగాక.

11&12. శ్రీ దత్తాత్రేయుడు సిద్ధాసనంలో కూర్చున్న సిద్ధేశ్వరుడై నా రెండు తొడలను రక్షించుగాక. 'వ' కారము మొదలు 'స' కారము వరకూ గల నాలుగు రేకుల కమలాన్ని వికసింపచేసే మూలాధార చక్రములో ఉండెడి భూస్వరూపుడై, వీర్యనిగ్రహ శాలియై మోకాళ్ళపై హస్త పద్మాలు పెట్టుకొని నా మూలాధార చక్రాన్ని, అన్ని వైపుల నుండి నా పృష్టాన్ని కాపాడుగాక.

13. శ్రీ దత్తాత్రేయుడు అవధూతేంద్రుడై నా రెండు పిక్కలనూ రక్షించుగాక. తీర్థపావనుడై నా రెండు పాదములనూ రక్షించుగాక. సర్వాత్మస్వరూపుడై నా సర్వాంగాలనూ కాపాడుగాక. కేశవుడై నా తలవెంట్రుకలను కాపాడుగాక.

14. శ్రీ దత్తాత్రేయుడు చర్మాంబరుడై నా చర్మాన్ని రక్షించుగాక. భక్తిప్రియుడై నా రక్తాన్ని రక్షించుగాక. మాంసకరుడై నా మాంసాన్ని కాపాడుగాక. మజ్జాస్వరూపుడై నా మజ్జను కాపాడుగాక.

15. శ్రీ దత్తాత్రేయుడు స్థిరబుద్ధికలవాడై నా ఎముకలను రక్షించుగాక. వేదస్వరూపుడై నా మేధస్సును రక్షించుగాక. సుఖకరుడై నా శుక్రమును కాపాడుగాక. దృఢకృతుడై నా చిత్తమును కాపాడుగాక.

16. శ్రీ దత్తాత్రేయుడు హృషీకేశాత్మకుడై నా మనస్సునూ, నా బుద్ధిని, నా అహంకారాన్ని పాలించుగాక. ఈశ్వరుడై నా కర్మేంద్రియాలను రక్షించుగాక. అజాత్మకుడై నా జ్ఞానేంద్రియాలను కాపాడుగాక.

17. శ్రీ దత్తాత్రేయుడు బంధూత్తముడై నా బంధువులను పాలించుగాక. శత్రుజయుడై శత్రువుల నుండి నన్ను రక్షించుగాక. శంకరుడై నా ఇంటినీ, తోటను, ధనమును, పొలమును, పుత్రులను కాపాడుగాక.

18. శ్రీ దత్తాత్రేయుడు ప్రకృతి విదుడై నా భార్యను రక్షించుగాక. శారీబ్దమును దాల్చు విష్ణురూపుడై నా పశువులను రక్షించుగాక. ప్రధానజ్ఞుడై నా ప్రాణములను కాపాడుగాక. భాస్కరుడై నా భక్ష్యాదులను కాపాడుగాక.

19. శ్రీ దత్తాత్రేయుడు చంద్రాత్మకుడై నా సుఖాన్ని పాలించుగాక. పురాంతకుడై నన్ను దుఃఖం నుండి రక్షించుగాక. పశుపతియై నా పశువులను కాపాడుగాక. భూతేశుడై నా ఐశ్వర్యమును కాపాడుగాక.

20. శ్రీ దత్తాత్రేయుడు విషహరుడై తూర్పు దిక్కును రక్షించుగాక. యజ్ఞస్వరూపుడై ఆగ్నేయపు మూలను రక్షించుగాక. ధర్మాత్మకుడై దక్షిణపు దిక్కును రక్షించుగాక. సర్వవైరిహృతుడై నైరుతి మూలను రక్షించుగాక.

21. శ్రీ దత్తాత్రేయుడు వరాహుడై పడమటి దిక్కును రక్షించుగాక. ప్రాణదుడై వాయువ్యపు మూలను రక్షించుగాక. ధనదుడై ఉత్తరపు దిక్కును రక్షించుగాక. మహాగురుడై ఈశాన్యపు మూలను రక్షించుగాక.

22. శ్రీ దత్తాత్రేయుడు మహాసిద్ధుడై ఊర్ధ్వదిక్కును రక్షించుగాక. జటాధరుడై అథో దిక్కును రక్షించుగాక. ఆదిమునీశ్వరుడై రక్షలేని దిక్కులన్నింటినీ రక్షించుగాక.

అంతా నీవే ఉన్నావు, నీవై ఉన్నావు అనే దానికి ప్రతీక ఈ వజ్రకవచమ్. దీని పారాయణ ద్వారా శ్రీ దత్తాత్రేయుని, సర్వాంగ సహిత ఆత్మ సమర్పణ చేసినట్లు అవుతుంది.

**మాలా మంత్రః** : ఓం నమో భగవతే దత్తాత్రేయాయ, స్మరణమాత్ర సంతుష్టాయ, మహాభయనివారణాయ, మహాజ్ఞానప్రదాయ, చిదానందాత్మనే బాలోన్మత్త పిశాచవేషాయ, మహాయోగినే అవధూతాయ, అనసూయానందవర్ధనాయ, అత్రిపుత్రాయా, సర్వకామ ఫలప్రదాయ, ఓం భవబంధమోచనాయ, హ్రీం సకల విభూతిదాయ, క్రో సాధ్యాకర్షణాయ, ఐం వాక్ప్రదాయ, క్లీం జగత్రయ, వశీకరణాయ సౌః సర్వమనఃక్షోభణాయ, శ్రీం మహాసంపత్ప్రదాయ, గ్లౌం భూమండలాది పత్యప్రదాయ, ద్రాం మహాచిరంజీవినే వషట్ వశీకురు వశీకురు వౌషట్ ఆకర్షయాకర్షయ హుం విద్వేషయ విద్వేషయ ఫట్ ఉచ్చాటయోచ్చాటయ ఠః ఠః స్తంభయ స్తంభయ ఖేం ఖేం మారయ మారయ నమస్సంపన్నాయ స్వాహా పోషయ పోషయ పరమంత్ర పరయంత్ర పరతంత్రాణి ఛింది ఛింది గ్రహాన్ని వారయ నివారయ వ్యాధీన్ని వారయ నివారయ దుఃఖం హరహర దారిద్ర్యం విద్రావయ విద్రావయ దేహం పోషయ పోషయ చిత్తం తోషయ తోషయ సర్వమంత్ర సర్వయంత్ర సర్వతంత్ర సర్వపల్లవ స్వరూపాయ ఓం నమో మహా సిద్ధిదాయ స్వాహా॥ (డిసెంబరు 13వ తేదీ మంగళవారము దత్త జయంతి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి వై.సాయి శిరీష**, బెంగళూరు.


ఆహ్వానము

ఓం శ్రీ సాయినాథాయనమః

శ్రీ భరద్వాజ గురవేనమః



# దత్తజయంతి మహోత్సవములు





**వేదిక**

**శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం**
**206/ఎ, సెక్టారు-8, ఉక్కునగరం**

**తేదీలు**

**2016 డిసెంబరు 11,12 మరియు 13**
**(ఆది, సోమ, మంగళవారములు)**

**దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2016 డిసెంబరు 11, 12 మరియు 13 (ఆది, సోమ, మంగళవారములు) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

ప్రతి రోజూ నాలుగు హారతులు, అభిషేకం, భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం శ్రీ గురుచరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, **11వ తేది** సామూహిక శ్రీ గురుచరిత్ర ఏకాహ పారాయణ, **12వ తేది** సామూహిక దత్తాత్రేయవ్రతము, **13వ తేది** శ్రీ దత్తాత్రేయుడికి సామూహిక క్షీరాభిషేకం మరియు భక్త సమారాధన మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును. ఆ యా కార్యక్రమాలలో పాల్గొని, శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహము పొందుటకు అందరికీ మా హృదయపూర్వక ఆహ్వానము.

గమనిక :
దూర ప్రాంతాలనుండి వచ్చు భక్తులకు 3 రోజులు ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేయడమైనది.

నిర్వహణ : **శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు** (రిజిష్టర్డు)
సెక్టర్-8, క్వార్టర్ నెం. 206/ఎ, ఉక్కునగరం, విశాఖపట్నం - 530 032.
ఫోన్ : 0891-2510817, సెల్ : 9849645224, 9441467648

# సబ్‌కా మాలిక్ ఏక్‌హై

"భగవంతుని శక్తిని నిరూపించగలవాడే నిజమైన ముస్లిం" అన్నారు సాయిబాబా. సర్వమూ తానే అయిన ఆయన కంటే భగవంతుని శక్తిని నిరూపించిన మరొక ముస్లిం ఎక్కడ? యావత్ ప్రపంచంలో ఎక్కడ ఉన్నాడు?"

"ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపిస్తాడు" అన్నారు సాయిబాబా. ఇంతగా ఆనాటి నుండి నేటి వరకు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపిస్తున్న మరో బ్రాహ్మణుడెక్కడ? ఎక్కడ ఉన్నాడు?..."

భగవంతుడు సుప్రసిద్ధ ఔలియా శ్రీతాజుద్దీన్‌బాబాగా నాగపూర్ పట్టణంలో వెలిశాడు. సంకుచిత కుల, మత, వర్గ విభేదాలతో మ్రగ్గిపోతున్న ఆధునిక సమాజంలో వారి బోధలను గ్రహించి, ఆచరించే సాంప్రదాయ బ్రాహ్మణ భక్తులు చాలా అరుదు.




రోమారోలా చెప్పినట్లు రెండు వేల సంవత్సరాల భారతీయ ఆధ్యాత్మిక తత్వం రూపుదిద్దుకొన్నదా అన్నట్లు ఆ భగవంతుడు బెంగాల్ దేశంలో శ్రీరామకృష్ణ పరమహంసగా బ్రాహ్మణ కుటుంబంలో ఉదయించారు. వారు ఆచరించి చూపిన భక్తితత్వాన్ని గ్రహించి, వారి బోధలననుసరించి భక్తిపారవశ్యంలో మునిగే సాంప్రదాయ ముస్లిం సోదరులు ఎంత మంది?

భగవంతుడు మధురై పట్టణానికి 30 మైళ్ళ దూరంలో 'తిరుచ్చుళి' గ్రామంలో భగవాన్ 'రమణమహర్షి'గా బ్రాహ్మణ కుటుంబంలో అవతరించారు. జ్ఞానమూర్తిగా అరుణాచలంలో నిలిచిన భగవాన్ రమణమహర్షి నుండి వెలువడే జ్ఞానకిరణాలను తమకు సోకనిచ్చే అన్యమత సోదరులు అరుదు.

అపార కరుణామూర్తియైన ఆ భగవంతుడు, ఆకాశము నుండి మశీదులోకి దూసుకొచ్చిన కాంతిగోళం లాగా, శిరిడీలో వేపచెట్టు క్రింద నేరుగా 16 సం॥ల యువకుడుగా ప్రత్యక్షమయ్యాడు. కుల, మత, సంకుచితత్వాల బారినుంచి తప్పించడానికా అన్నట్లు, ఈసారి ఆయన అయోని సంభవునిగా ప్రకటమయ్యాడు. సంకల్పమాత్రం చేత స్వయంగా ఉద్భవించాడు. కుల, మత ప్రసక్తే రాదు. కల్పితమైన అడ్డుగోడ కూలింది. విశ్వమంతా తమ రూపమేనని చూపిన ఆయన ఈ విశ్వానికే ప్రతీక!

నామదేవు, కబీరుల్లాగా పసిబాలుడుగా ప్రకటమై, ఏ మానవుడికైనా దొరికి వారిచేత పెంచబడి ఉంటే, వారి కులం వారికి అంటగట్టేది సమాజం. అందుకే ఈసారి ఆయన 'ఎవరికీ దొరకుండా' 16 సం॥ల యువకుడిగా నేరుగానే సాయిబాబాగా ప్రత్యక్షమయ్యారు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాల కులమేదో అదే వారి కులం.

జీసస్ క్రీస్తు ఏ మతం పుచ్చుకున్నాడు? బుద్ధుడు ఏ మతం వాడు? మహమ్మదుల వారి మతమేది? అని సరియైన ప్రశ్న వేశారు మాష్టరు గారు. గాలి, వెలుగు, ఆకాశాల మతమేదో అదే వారి మతం. ఆచరణలో "అల్లాహ్ మాలిక్ – భగవంతుడే యజమాని" అన్నదే వారి నిరంతర భావం. హరి నామం స్మరించి హరినయ్యానన్నారు. "నీవు చూసేదంతా కలిసి నేను" అన్నారు. వారు కానిదేది లేదు. అందుకే ఆయన సాక్షాత్తూ భగవంతుడు.

బ్రాహ్మణులకు వేదమందించారు! ముస్లింలకు ఖురాన్ వివరించారు! ఆయన సిద్ధపురుషుడు – గొప్ప ఔలియా!!

హిందూ ముస్లిం భేదాలకతీతమైన తత్వమే వారు. అందుకే వారి నివాసం 'బ్రాహ్మణ–మసీదు!' సాయిబాబా వేరు కాదు! రామ్–రహీమ్ వేరు కాదు! బాబా–క్రీస్తు వేరు కాదు! సాయి–మాష్టర్ వేరు కాదు! భగవంతుడు ఒక్కడే! ఏకం సత్... భగవంతుడు హిందువా? ముస్లిమా? చెప్పండి. దైవానిది ఏ కులం అన్నదే మనం వేసిన ప్రశ్న?! ధూలియా కోర్టుకు సాయి చెప్పిన సమాధానం ఏమిటి? వారు అయోనిజుడు అన్నది అక్షర సత్యం!! వారు స్వయంభువు. 16 సం॥ల యువకుడుగానే ప్రత్యక్షమయ్యారు!!! పెంపకం కూడా లేదు గనుక కులం రంగు అంటదు! ఆయన సాక్షాత్తు భగవంతుడు. దైవానిది ఏ కులమో అదే వారి కులం.

ధూలియా కోర్టుకు సాయిబాబా చెప్పిన సమాధానం విందాం... "దైవకులం" అని సాయి చెబితే దానిని తలక్రిందులు చేసి "కుల దైవం" మారుతి అని, 'జాతి' బ్రాహ్మణులని అంటోంది ఒక గొంతుక. ఆయన అయోనిజుడని గురుబంధువులు గుర్తించాలి. బంధువులారా! నమో నమః గురువే దైవం. వారిది 'దైవకులం'. ఆ గురుకులంలోనే మనమంతా తలదాచుకోవాలి. నిష్ఠ, సబూరీలతో ఆ సాన్నిధ్యాన్ని కాపాడుకుందాం. వారి ఆవిర్భావమే ఒక అద్భుతలీల! వారిది యోగలీలా సమాధి!! వారి కులం "దైవ(లీలా)కులం".

ఆ గురుచంద్రుడు ఉదయించాడు. ఆహ్లాదాన్నిచ్చే కృపాకటాక్ష వెన్నెల కురుస్తోంది. సత్యాన్ని అంటిపెట్టుకుంటే వెంట నుండి కాపాడతామన్నారు. సప్త సముద్రాలకావలనున్నా ఆ కృపాకటాక్ష వెన్నెల కురుస్తూనే ఉంటుంది! అట్టివారే సద్గురువులని, వారినే ఆశ్రయించాలని ఆచార్యులవారి సందేశం! అది వారు మనకు చేసిన బ్రహ్మోపదేశం!

సాయిబాబా లీలలను, బోధలను నిత్యమూ శ్రద్ధగా మననం చేస్తే మృత్యువుపై విజయం తథ్యం. అదే మన జీవితానికి పరమావధి.

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్ కీ జై!**

(అక్టోబరు 11వ తేదీ శ్రీ శిరిడీ సాయిబాబా 98వ మహాసమాధి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **అల్లా వెలిగించిన దీపం**

రచన : **శ్రీ సి.హెచ్.శ్రీనివాసరెడ్డి**, విద్యానగర్

# మన గమ్యం

ఏదో తెలియని అదృశ్య శక్తి ఈ విశ్వాన్ని నడిపిస్తున్నదని, నవీన శాస్త్రజ్ఞులతోపాటు, నాస్తికులు కూడా నమ్ముతారు. ఆ శక్తికెంతో తెలివి, సామర్థ్యము లేకుంటే, ఈ విశ్వాన్నంతా క్రమబద్ధంగా నడిపించగలదా? ఈ శక్తినే ఆస్తికులు ఆత్మ, పరమాత్మ, బ్రహ్మము, చైతన్యము, అల్లా, భగవంతుడు అని పిలుస్తున్నారు. ఈ చరాచర విశ్వమంతా భగవంతుని రూపమేనని సకలమతాలు తెల్పుతున్నాయి. "బ్రహ్మ ఏవ ఇదం సర్వం" అంటూ "ఈ జగత్తంతటికి మూలకారణమైన చైతన్యశక్తి ఒకటున్నది. ఆ శక్తే జగత్తు రూపంలో వ్యక్తమై మనకు అనుభవమవుతున్నదని" వేదము, "మొట్టమొదట వుండినవాడు దేవుడొక్కడే. ఈ సమస్తము ఆయన సృతి గుళిక యందుండినది" అని బైబిల్, ఈ సృష్టియంతా భగవంతుని కుటుంబము. సాటిజీవులను సేవించడం ద్వారా భగవంతుని సేవించమని ఖురాను చెప్తూ పై భావాన్నే దృఢపరుస్తున్నాయి.



ఈ సృష్టిజాలమంతా భగవంతుని రూపమేనని అనుభవపూర్వకంగా తెలిసినవారే జ్ఞానులు లేక సద్గురువులు. వీరు ఆత్మజ్ఞానం పొందడమేగాక, ఆత్మజ్ఞానం ప్రసాదించగల సమర్థులైయుంటారు. శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడుయైన సద్గురువు భగవంతుడు, ఆత్మ ఒక్కటేనంటూ శ్రీ రమణులు "ఆత్మజ్ఞానం కలిగాక ప్రపంచం నీలో వుంటుంది. ఇప్పుడు నీవు ప్రపంచంలో వున్నావు" అన్నారు. "గురుర్విశ్వం నచాన్యోస్తి, తస్మైశ్రీ గురవేనమః" అంటూ గురుగీత దృశ్యమానమైన ఈ జగత్తు గురుస్వరూపమేనని తెలియజేసింది. శ్రీ సాయి కూడా "ఆత్మ ఏవ ఇదం సర్వం" అన్న శృతివాక్యానికి ప్రతీకయై తమ సమకాలీన మహాత్ములేగాక, గతకాలపు మహాత్ములు, ముక్కోటి దేవతలు, సర్వమతాల అవతార పురుషులు, సకల జీవులు, తుదకు పటాలవంటి జడపదార్థాలు కూడా తమ రూపమేనని అనుభవమిచ్చారు. ఏ మతానికి చెందినవారిని ఆ మతానుసారం తరింపజేసి "విశ్వగురుని"గా, "జగత్పిత"గా నిలిచారు. ఆ మతాల సద్గురువులచేత తమకన్న అధికునిగా శ్లాఘింపబడ్డారు. ఈ ఘనత చరిత్రలో శ్రీ శిరిడీ సాయిబాబా ఒక్కరికే దక్కిందంటారు పూజనీయ శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్‌గారు.

తనకు భిక్షనిచ్చిన భక్తుడి కోసం తననే అర్పించుకొనే అద్వితీయ సద్గురుమూర్తి శ్రీ శిరిడీ సాయిబాబా. ఏ జీవినాదరించినా, తృణీకరించినా అది తనకే చెందుతుందని, తన్నాశ్రయించిన భక్తుల లౌకిక, ఆధ్యాత్మిక శ్రేయస్సులకు తాను బాధ్యత వహిస్తానంటూ, ఈనాటికి తన మాట నిలబెట్టుకుంటున్నారు శ్రీ శిరిడీ సాయిబాబా. శ్రీ సాయిలీలామృతము పారాయణతో పై సత్యాలు హృదయగతమయ్యాక మనమెలా దుఃఖాన్ని కోరుకోమో, ఆ దుఃఖానికి కారణమైన పాపకర్మాచరణకు కూడా పూనుకోము. ప్రజలంతా సద్ధర్మాచరణతో, నైతిక, ఆధ్యాత్మిక విలువలకంకితమై, కులమత విభేదాలను మరచి, ప్రతి ఒక్కరు పదిమందికోసం, పదిమంది ప్రతిఒక్కరికోసం తపించాలి. లేకుంటే అందరిలో తానున్నానని సాయి మనకిచ్చిన అనుభవం మనకేమి నేర్పినట్లు.

''భగవంతుడు సృజించిన ప్రాణులయందు ఎవరు కరుణ కలిగియుండునో వానియెడల భగవంతుడు కరుణ కలిగియుండును. దుర్జనుని యందు కూడా మీరు కరుణ చూపవలయును. అనగా అతనిని అధర్మము, దౌర్జన్యమువంకకు పోనీయక ఆపిపెట్టవలయును. నిన్ను హింసించిన వారిని క్షమింపుము. నీ బాటలో ముళ్ళుంచిన వారిబాటలో గులాబీలు పరువుము" అని జీసస్ చెప్పింది మనకు శిరోధార్యము. "ఎవరు ఎవరిని నిందించినా నన్ను కష్టపెట్టిన వారవుతారు. పదిమాటలకు ఒకమాటతో సమాధానం చెప్పు, దెబ్బకు దెబ్బ తీయవద్దు. వారి మాటలు నీకేమి గుచ్చుకోవుగా, సహించలేకపోతే నా నామం స్మరించుకుంటూ తొలగిపో. ఎవరు నిందను, దూషణను సహిస్తారో వారు నాకత్యంత ప్రియులు'' అని సాయి చెప్పింది మనం పాటించాలి, అప్పుడే మనం సాయిభక్తులమనిపించుకుంటాము. సమాజాన్ని తృప్తి, శాంతి, ఆనందాలతో నింపుతాము. విశ్వమానవ కళ్యాణానికి సర్వమత సమత్వమైన సాయిమతమే శరణ్యం. శ్రీ "సాయిపథ" గాములమై భూతల స్వర్గాన్ని సృష్టిద్దాము. ఇదే మన గమ్యం.

రచన : **శ్రీ జె.వి.సుబ్బయ్య మాస్టారు**, ఒంగోలు.

## వందేహం గురుపరంపర

ఓమ్ సదాశివ సమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యన్తాం వందే గురుపరమ్పరామ్ ॥

ఓమ్ గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణామ్ ।
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః ॥

ఓమ్ నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తితాపసమ్ ।
పరాశరఞ్చ తత్పుత్రం వ్యాసం వేదాబ్జభాస్కరమ్ ॥

ఓమ్ విరక్తం శ్రీశుకం దేవం జ్ఞానవైరాగ్యరూపిణమ్ ।
గౌడపాదం చ గోవిన్దం యోగీన్ద్రం జ్ఞానినాం వరమ్ ॥

ఓమ్ తచ్ఛిష్యం శంకరాచార్య మద్వైతస్థాపకం గురుమ్ ।
నమామి భగవదత్పాదం శంకరం లోకశంకరమ్ ॥


ఓమ్ సచ్చిదానందరూపాయ జ్ఞానవైరాగ్యదాయినే ।
అసంగానందదేవాయ తస్మైశ్రీ గురవేనమః ॥

ఓమ్ విద్యాప్రకాశనామానం వేదవేదాన్తకోవిదమ్ ।
గీతాతత్త్వప్రబోద్ధారం సద్గురుం ప్రణమామ్యహమ్ ॥

ఓమ్ అసంగానంద దత్తాత్రేయాయ గుర్వాద్యాం సాయినాథాయ మధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యన్తాం వందే గురుపరమ్పరామ్ ॥

# అవధూత శ్రీ నాంపల్లిబాబా

అవధూత శ్రీ నాంపల్లిబాబాగా ప్రసిద్ధికెక్కిన బాబా ఎవరో? ఎక్కడివారో ఎవరికి తెలియదు. 1945లో ఒక స్మశానంలో మలక్‌పేట రైల్వేస్టేషన్ దగ్గర వారిని కనుగొన్నారు. ఆయన మౌనముద్రలోనే ఆత్మానుభూతిని అనుభవిస్తూ ఎవరితోనూ మాట్లాడేవారు కాదు. అప్పుడప్పుడు ఒక నీటి కుళాయి దగ్గర తన శరీరాన్ని తడుపుకుంటూ కన్పించేవారు. స్మశానంలో ఒక చిన్న ఎత్తుపాటి గోడపై పరుండి తనలో తాను మాట్లాడుకుంటూ, గొణుగుతూ, మరొసారి ఆకాశం వైపు చూస్తూ బిగ్గరగా నవ్వుతూ సైగలు చేసేవారు. అప్పటికే చుట్టుప్రక్కల వాళ్ళు ఆయనను అవధూతగా గుర్తించారు. స్నానం చేయకపోయినా బాబా దగ్గరనుండి ఓ దివ్య పరిమళము వ్యాపించడం భక్తులను అబ్బురపరిచేది. తమ భక్తిప్రపత్తులతో ఆయనకు వస్త్రాలు, భోజనాలు అందించేవారు. ఆయనెప్పుడూ శరీర స్పృహలో వుండేవారు కాదు. 1972లో శరీరాతీత స్థితిలో వెళుతుండగా ఒక లారీ ఆయన కుడికాలును పూర్తిగా భిన్నం చేసింది. అయినా వారికి శరీరస్పృహ లేదు. కాలికి కుట్లు ఉస్మానియా హాస్పిటల్లో వేయించారు భక్తులు. ఆ తర్వాత బాబాగారు కొన్ని సంవత్సరాలు కనపడలేదు.



మరలా 1980లో ఆయన నాంపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర వుండడం గమనించారు. అందువలన ఆయనను నాంపల్లిబాబా అనే పేరుతో భక్తులు పిలవసాగారు. ఆయన పేరుకానీ, ఊరుకానీ, తల్లిదండ్రులెవరో, కులగోత్రాదులేమిటో ఎవరికీ తెలియలేదు. నిజానికి దైవంవలెనే ఆయన నామరహితుడు. నాంపల్లిబాబా నిత్య ఏకాకి. ఆయన మాట్లాడుతుండగా ఎవరూ చూడలేదు. ఎప్పుడూ మౌనమే, పూర్తి దిగంబరుడిగా వుండేవారు. ఆయనకై ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు. ఎవరినీ డబ్బులు యాచించేవారు కాదు. ఉపన్యాసాలు ఇవ్వలేదు. ప్రజలను ఆశ్చర్యపరిచే చిల్లరి మహిమలేవి ప్రదర్శించలేదు. ప్రశ్నలు చెప్పలేదు. అయినా నానాటికీ నాంపల్లిబాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య పెరిగిపోతుంది. మహమ్మదీయులు హజరత్‌గా, హిందువులు అవధూతగా భావించి ఆయా భక్తులు ఆయనకు టీ, సిగరెట్లు సమర్పించేవారు. నాంపల్లిబాబా శిరిడీసాయి అవతారమని భక్తులలో ఒక నమ్మకం ఉంది. నాంపల్లిబాబా సిగరెట్లు త్రాగుతూ చివర్లో సిగరెట్టుకున్న నిప్పుని మ్రింగేవారు. ఆయన కడుపులోనే 'ధుని' ఉన్నదని అలా నిప్పుని మ్రింగటం ద్వారా సిగరెట్టు యిచ్చిన భక్తుల కర్మలని నశింపజేసేవారనీ, ఆయన దర్శనమాత్రం చేత కష్టాలు తొలగిపోతాయని, కోర్కెలు నెరవేరుతాయిని, శారీరక రుగ్మతలు, బాధలు బాబా తొలగిస్తారని భక్తుల నమ్మకం. బాబాగారి దివ్యలీలలు భక్తుల నమ్మకానికి తార్కాణం.

శ్రీ బాబాగారు ఎవరినిబడితే వారిని ఏమీ అడిగేవారు కాదు. ఎవరైనా అంతకు పూర్వం వారి దగ్గరకు వచ్చినవారు కనిపిస్తే ఎంత దూరంలో వున్నాసరే చిన్న అరచేతి చరుపుతో పిలిచేవారు. ఆ శబ్దం ప్రక్కనున్న వారికి కూడా బాగా వినిపించే అవకాశం వుండేదికాదు కానీ ఎవరిని ఉద్దేశించి అలా చరిచారో వారు ఎంత దూరంలో వున్నాసరే వెనుకకు తిరిగి బాబా దగ్గరకు వచ్చేవారు. ఆ భక్తులు ఒక రూపాయి ఇస్తే ఇరానీ హోటల్‌లో టీ త్రాగి, ఒక చార్మినార్ సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె కొనేవారు. బాబాగారు సిగరెట్లు ఎక్కువగా త్రాగేవారు.

పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు ఎంతోమంది సాయిబాబా భక్తులను నాంపల్లిబాబాగారి దర్శనం చేసుకోమని ప్రోత్సహించేవారు. అంతేకాక ఒక డాక్టరు (గోపాల్‌దాసు గారు) మాష్టారుగారిని (హైదరాబాదులో వున్నప్పుడు) కలిసి శిరిడీ వెళుతున్నానంటే మాష్టారుగారు, ఆయన్ని దగ్గరుండి నాంపల్లిబాబాగారి దగ్గరకు తీసుకెళ్ళి శిరిడీ సాయిబాబానే ఇక్కడ ఉన్నారు. తప్పక దర్శనం చేసుకుంటూ ఉండండి అని చెప్పారు.

శ్రీ నాంపల్లిబాబా వారి సన్నిధిలో ఉంటూ అద్భుతమైన లీలావిలాసాలను, అనుభవాలను, అనుభూతులను పొందినవారే కాక వారి దర్శన స్పర్శనతో ఆధ్యాత్మిక అనుభూతులను పొందిన వారెందరో కలరు. శ్రీ నాంపల్లిబాబా 2004 సంవత్సరము నవంబరు 6వ తేదీన తన భౌతిక దేహం వీడి సృష్టి చైతన్యములో నిలిచారు. వారి అద్భుత సమాధి మందిరము హైదరాబాదు మియాపూరు, దీప్తి శ్రీనగర్‌లోని శ్రీ ధర్మపురి క్షేత్రంలో కలదు. నేటికీ వారి సమాధి దర్శనం ద్వారా బాబా ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని అనుభవించవచ్చు. శ్రీ నాంపల్లిబాబాగారి దివ్యలీలలు గ్రంథము కావలసిన వారు శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్టు, గొలగమూడి–524321 (నెల్లూరు జిల్లా) వారిని గాని, శ్రీ నాంపల్లిబాబా సమాధి మందిరము, శ్రీ ధర్మపురి క్షేత్రము, దీప్తిశ్రీనగర్, మియాపూరు (పోస్టు) ఆర్.ఆర్.జిల్లా, హైదరాబాదు–500049 వారిని సంప్రదించగలరు.

(నవంబరు 6వ తేదీన అవధూత శ్రీ నాంపల్లిబాబా గారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : 'శ్రీ'



# "నేను ఎవడను?"

సృష్టి ప్రారంభమైనప్పటినుంచి మానవుడు చేస్తున్న ప్రయత్నము ఒక్కటే, దుఃఖములో నుంచి తప్పించుకొనుటకు తపన పడుతున్నాడు. దేవుడిని తెలుసుకొనుట కూడా అందులో ఒక భాగము మాత్రమే. కాని నిజమైన సుఖము ఎక్కడ ఉందో తెలిసే వరకు మానవుడు దుఃఖములో నుంచి బయట పడలేడు. మరి ఆ నిజమైన సుఖం ఎక్కడ ఉంది?

ఒక్క ఆత్మలో తప్ప ఈ సృష్టిలో సుఖము ఎక్కడా లేదు. ఉన్నది ఆత్మ ఒక్కటే, అది అనంతము, అఖండము, అమరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము. అది సత్ చిత్ ఆనంద స్వరూపము. సినిమా బొమ్మలకు తెర ఎలా ఆధారమో – ఈసృష్టికి ఆత్మే ఆధారము. దానిని నీరు తడుపలేదు – నిప్పు కాల్చలేదు – గాలి కదపలేదు. దానికి పుట్టుకాలేదు – మరణమూ లేదు. దానికి ఆదీ లేదు – అంతమూ లేదు. అది కాలాతీతము – ఊహాతీతము – గుణాతీతము, అది మీకు దూరాన ఎక్కడో లేదు మీ స్వరూపముగానే ఉంది – మీ హృదయములోనే ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది.

మీ స్వరూపాన్ని మీరు మరచిపోయి – పుట్టి, పెరిగి, గిట్టే ఈదేహమే మీరని భ్రమపడుతున్నారు. అందుకే దుఃఖ పడుతున్నారు. మీ స్వరూపము మీకు తెలిసేవరకు మీరు దుఃఖములోనుంచి బయటపడలేరు. మీస్వరూపము మీ అనుభవములోలేదు – కాని మీరు "నేను, నేను" అని అంటున్నారే – ఈ "నేను" మీ అనుభవములో వుందికదా, దీనిని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?

హృదయములోనున్న వాసనలు నిశ్శేషముగా బయటకు పోకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు. జ్ఞాని కానివాడు దేవునిలో లయము కాలేడు. హృదయములో ఒక్క వాసన మిగిలినప్పటికీ అది జన్మకు హేతువు అవుతుంది. – మోక్ష సుఖము మీ అనుభవములోనికి రాకుండా అది అడ్డుపడుతుంది.

హృదయములోనున్న వాసనలు తలంపు రూపములో శిరస్సులోనికి వచ్చేవరకు మీ హృదయములో ఏకోరికలు (వాసనలు) దాగివున్నాయో మీకే తెలియదు. నెరవేర్చిన కోరిక మరింత బలపడుతుంది – నిరోధించిన కోరిక చిక్కిపోయి రాలిపోతుంది. కనుక కోరిక ఉదయించగానే దానిని ఆచరణలో పెట్టకుండా – "ఈ కోరిక ఎవరికి కలుగుచున్నది?" అని ప్రశ్నించుకోవాలి! అప్పుడు "నాకు" అని తెలుస్తున్నది. మరి కోరికవచ్చే "నేను ఎవడను" అని విచారిస్తే – అప్పటివరకు బాహ్యసుఖాల కోసం లోకాలవెంట తిరిగే మనస్సు, ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరియై సమాధానము తెలియక, తల్లక్రిందులై తన మూలమును శోధించుట మొదలుపెడుతుంది.

"నేనెవడను?" పంచభూతములతో తయారైన ఈ దేహము నేనా? ఈదేహమే గనుక నేనైతే – ప్రాణము పోయిన తరువాతకూడ ఈదేహము (శవము) "నేను ఉన్నాను" అని అనాలిగా? ఏ శవమైనా అలా అంటున్నదా? దేహము జడము – దానికి మాటలాడే శక్తిలేదు. కనుక జడమైన దేహము నేనెట్లుకాగలను? దేహము నేను గాకున్న మరి నేనెవడను?

"కర్మ చేసే కర్మేంద్రియములు నేనా ? లేక విషయములను గ్రహించు జ్ఞానేంద్రియములు నేనా? దేహమే నేను గానప్పుడు – మరి దేహములో భాగమైన ఈ ఇంద్రియములు నేనెట్లు కాగలను? ఇంద్రియములు నేను గాకున్న మరి నేనెవడను?"

"ప్రాణము నేనా?" ప్రాణమేగనుక నేనైతే – చివరి శ్వాస గాలిలో కలిసిపోయిన తరువాత కూడ "నేను ఉన్నా" నని నాకు తెలియాలికదా? నా ఉనికి నాకు తెలియనప్పుడు ఆప్రాణము నేనెట్లు కాగలను? ప్రాణము నేను గాకున్న మరి నేనెవడను?

"అయితే గాఢనిద్రలో మనస్సు లేనప్పుడు మరి నేనులేనా? గాఢనిద్రలో గనుక నేను లేకపోతే నిద్రనుంచి మేల్కొన్న తరువాత నాకు సుఖముగా నిద్రపట్టినదని నేనెట్లు చెప్పగలుగుతున్నాను? గాఢనిద్రలో కూడ నేను ఉన్నాను గాబట్టే, సుఖాన్ని అనుభవిస్తున్నాను గాబట్టే – "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని చెప్పగలుగుతున్నాను. మరి గాఢనిద్రలో సుఖముగా ఉన్న ఆ "నేను" ఎవడను?"

ఆ నేనే నిజమైన "నేను" ! అదే చైతన్యము ! అదే ఆత్మ ! అదే బ్రహ్మము !

ఆ నేను మన మెలుకువలోను, నిద్రలోను, స్వప్నములోను సమానముగానే ఉంది. కాని అది మన అనుభవములోనికి రాకుండా మన పరిమితబుద్ధే (దేహము నేను అన్నభావనే) మనకు అడ్డుపడుతున్నది.

రూపాయి ఉన్నవాడి చేతికి వందరూపాయలిచ్చి, ఆ రూపాయిని క్రిందపారవేయమంటే ఎలా పారవేస్తాడో – అదేవిధముగా భౌతికమైన క్షణికమైన ఆత్మసుఖాన్ని ఎప్పుడైతే రుచిచూసినదో – వెంటనే మన మనస్సు ఆగిపోతుంది – ఆత్మలో అణిగిపోతుంది – తన ఉనికినే కోల్పోతుంది. అంత – సముద్రములో లేచిన అలలు సముద్రములోనే అణిగిపోయినట్లు – మన దేహగతమైన నేను దాని మూలములో అణిగిపోయి – అహంవృత్తి నశించి – వెంటనే అహంస్ఫురణ కలుగుతుంది ఆత్మగతమైన "నేను" తానుగా వ్యక్తమౌతుంది. ఏ సుఖాలకోసమైతే భ్రమపడి మనము బాహ్యంగా పరుగెడుతున్నామో – ఆ సుఖమే మనమౌతాము.

"నేను ఎవడను?" అను విచారణ మహావ్రతము. విజృంభిస్తున్న మనస్సు అనే మదపుటేనుగునకు – "నేను ఎవడను" అను ప్రశ్న అంకుశము వంటిది. "నేను ఎవడను" అను ప్రశ్నను అభ్యాసము చేయగా చేయగా – అది అన్ని తలంపులను నాశనముచేసి – శవమును దహించు కొఱివికట్టెవలె చివరకు ఈ "నేను" అను తలంపుకూడ కాలిపోయి రాలిపోతుంది. మీ "నేను" పోతే మిగిలింది మీరే! మీ స్వరూపమే సుఖం !

మిగిలిన జీవులకు లేని బుద్ధిని భగవంతుడు మనకు ప్రసాదించాడు – ఎందుకు? ఆలోచించమని! కనుక ఆలోచించండి! మీ సొంత బుద్ధిని విడిచిపెట్టకండి! ఆలోచనే అమృతం! ఆలోచిస్తే మీరు అమృతమూర్తులౌతారు – దుఃఖసాగరాన్ని దాటిపోతారు – శాంతి శిఖరాలను చేరుకుంటారు. (డిసెంబరు 30వ తేదీ భగవాన్ శ్రీరమణ మహర్షి జయంతి సందర్భముగా సమర్పణ)

**సౌజన్యం : రమణబోధలు** **సేకరణ : "సత్యాన్వేషి"**

# ఏరిన ముత్యాలు

### సుగుణం
బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు
క్షమాపణ అనేది బలవంతుల సుగుణం
**– మహాత్మాగాంధీ**

### చెదపురుగు
కేవలం పుస్తకాలు చదివి వదిలివేస్తే ప్రయోజనం ఏముంది?
చెదపురుగులు కూడా పుస్తకాలను నమలివేస్తాయి
అంతమాత్రాన జ్ఞానం వచ్చేసినట్లా **– డా॥ బి.ఆర్. అంబేద్కర్**

### బలం
అందరిలో మంచి చూడటం నీ బలహీనత అయితే
ఈ ప్రపంచంలో నీ అంత బలమయినవారు వేరొకరు లేరు
**– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ**

### జ్ఞాన వివేకం
అన్ని విషయాల గురించి తెలుసుకునేలా చేసేది జ్ఞానం
ఎంతవరకు గుర్తుంచుకోవాలో
ఎంతవరకు వదిలివేయాలో తెలిపేది వివేకం
కాని వివేకం లేని జ్ఞానం వ్యర్థం

### ఒక్క అడుగు
ప్రపంచం మారాలని మనం కోరుకోవటం కాదు
మార్పు మనతో మొదలైతే ప్రపంచం అదే మారుతుంది
**– లియోటాల్ స్టాయ్**

### అవసరం
మర్యాదగా వినటం, వివేకంతో సమాధానమివ్వటం
ప్రశాంతంగా ఆలోచించటం, నిష్పాక్షికంగా నిర్ణయం
తీసుకోవటం ప్రతి మనిషికి అవసరం **– సోక్రటీస్**

### తప్పు
ఆశించినంత చేయలేకపోవటం
చేయలేనంత ఆశించటం రెండూ తప్పులే
మొదటిది నీలోని అసమర్థతను సూచిస్తే
రెండోది నీలోని అత్యాశను బయటపెడుతుంది

### 'నేను' తెలుసుకో
అజ్ఞానం వల్ల మనిషి బాహ్యంలో
భగవంతుడికోసం వెదుకుతున్నాడు
భగవంతుడు తనలోనే ఉన్నాడని
అనుభవం వలన తెలుసుకోవటమే జ్ఞానం
**– శ్రీ రామకృష్ణ పరమహంస**

### స్వేచ్ఛ
స్వేచ్ఛలేని క్రమశిక్షణ – క్రమశిక్షణ లేని స్వేచ్ఛా
రెండూ సమాజానికి అపాయాలే

### నీలా ఉండు
నీవు వాడిలా... వాడు నీలా... ఉండాలనుకోవటం వింత
నీవు నీలా ఉంటే... ఉండదు ఏచింత **– రమణమహర్షి**

### నిజం
నిజాన్ని ఏనాటికి నువ్వు మార్చలేవు
కాని నిజం ఏనాటికైనా నిన్ను మార్చి తీరుతుంది

### ఆటోగ్రాఫ్
సక్సస్ అంటే నీ సంతకం ఆటోగ్రాఫ్‌గా మారటమే
**– డా॥ అబ్దుల్‌కలాం**

### నీడ
ఉదయపు కాంతిలో మన నీడ పెద్దదిగా
రానురాను మధ్యాహ్నానికి చిన్నదౌతుంది
అల్పబుద్ధుల సంస్కారము అంతే
**– భర్తృహరి**

### జ్ఞానం - అజ్ఞానం
అజ్ఞానం ఆధిపత్యం వహించినచోట
జ్ఞాని మూగవానిగా మెలగటమే జ్ఞానం

### గతం-భవిష్యత్తు
క్షమించటం వలన గతం మారిపోకపోవచ్చు
కాని భవిష్యత్తు మాత్రం తప్పక నీకు
అనుకూలంగా మారుతుంది

ఈ పేజీ సమర్పణ చేసినవారు: **శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం - శ్రీకాకుళం**





శ్రీరస్తు　　　　శుభమస్తు　　　　అవిఘ్నమస్తు

# వివాహ మహోత్సవ ఆహ్వాన శుభపత్రిక

స్వస్తిశ్రీ చాంద్రమాన దుర్ముఖినామ సంవత్సర కార్తీక బహుళ దశమి బుధవారం ఉత్తర నక్షత్రయుక్త కన్యా లగ్న పుష్కరాంశమునందు అనగా **తేది 23-11-2016 బుధవారం రాత్రి గం॥ 2-21 ని॥లకు (తెల్లవారితే గురువారం)**

మా కనిష్ఠ కుమార్తె

**చి॥ ల॥ సౌ॥ సాయిప్రత్యూష** ను

రాజోలు వాస్తవ్యులు (లేటు) శ్రీ కస్తూరి రవిమోహన్, శ్రీమతి సత్యవాణి దంపతుల కుమారుడు

**చి॥ సాయి సందీప్** కు

యిచ్చి వివాహము జరిపించుటకు దైవజ్ఞులచే సుముహూర్తము నిర్ణయించబడినది. కావున ఏతత్ శుభముహూర్తమునకు సన్నిహితులు, హితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, అందరూ ఇదే మా ప్రత్యక్ష ఆహ్వానంగా మన్నించి, తామెల్లరూ బంధుమిత్ర సపరివార సమేతముగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి మదర్పిత చందన, తాంబూలాది సత్కారములను స్వీకరించి మమ్ములను ఆనందింపజేయ ప్రార్థన.

కళ్యాణవేదిక : **స్టీల్‌క్లబ్ ఆడిటోరియం, రష్యన్ కాంప్లెక్స్, స్టీలుప్లాంట్ టౌన్‌షిప్, సెక్టారు-1, ఉక్కునగరం, విశాఖపట్నం-32.**

విందు : తేది 24-11-2016 గురువారం మధ్యాహ్నం 12.00 గంటల నుండి కళ్యాణ వేదిక వద్ద.

మంగళమ్ మహత్　　　శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

ఇట్లు మీ ఆగమనాభిలాషులు

**శ్రీమతి శ్రీశైల లక్ష్మీ భ్రమరాంబ**
అధినేత్రి, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్, ఉక్కునగరము

బంధుమిత్రుల అభినందనలతో...

**శ్రీ వడ్డవల్లి వేంకట పూర్ణచంద్రరావు**
వ్యవస్థాపక చైర్మన్, శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్ట్, ఉక్కునగరము
సంపాదకులు, శ్రీ భరద్వాజ సద్గురువాణి (ఆధ్యాత్మిక పత్రిక)

## ప్రధమ జన్మదిన శుభాకాంక్షలు



విశాఖపట్నం - కూర్మన్నపాలెంలో తేదీ 06-10-2016 న
ప్రధమ జన్మదినము జరుపుకుంటున్న

**చి॥ ఏ.హేమహచ్యుత్** కు

శుభాకాంక్షలు అందచేస్తున్న
తాత **శ్రీ ఏ.సూర్యనారాయణ రావు**
అమ్మమ్మ **శ్రీమతి ఏ.సరోజని**

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ అనుగ్రహము అందించాలని కోరుకుంటూ శ్రీ భరద్వాజ సద్గురువాణి తన శుభాకాంక్షలందచేస్తున్నది.




New Sri Sai Swarna's

Beauty Clinic & Boutique (A/c)

only for Ladies....

**SWARNA**, B.Sc.,
Beautician Thearapist
Ph : 8500363292, 08942-278472



**D.No. 3-3-7/1, Konna Street,**
**Near P.S.N.M. High School,**
**SRIKAKULAM.**

Trained in Jawed Habib International Institute

**SPECIALITIES**

| BOUTIQUE | BEAUTY CLINIC |
|---|---|
| WORK SAREES | FACIALS ALL TYPES |
| MAGGAM WORKS | ADVANCED HAIR CUTS |
| DESIGNER BLOUSES | FACE LIFT, OBICITY |
| | SKIN POLISHING |

**COMPUTER EMBROIDERY WORKS**

## జన్మదిన శుభాకాంక్షలు



డిశెంబర్ 17వ తేదీన శ్రీకాకుళంలో
జన్మదినము జరుపుకుంటున్న

**చి॥ ఆర్. సూర్య శ్రీనివాస్ కు**

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

## జన్మదిన శుభాకాంక్షలు



డిశెంబర్ 26వ తేదీన
జన్మదినం జరుపుకుంటున్న
శ్రీ బాడాన లక్ష్మీనారాయణ
శ్రీమతి బాడాన ముత్యాలమ్మ ల కుమారుడు

**చి॥ బాడాన సంతోష్ కు**

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది



12 సంవత్సరములు పూర్తి చేసుకొని
13వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న
శుభసందర్భంలో శ్రీ దత్త సాయి భరద్వాజుల
కృపానుగ్రహంతో దినదిన ప్రవర్ధమానం కావాలని
కోరుకుంటూ శుభాకాంక్షలతో... - శ్రీ సద్గురువాణి





**శ్రీ శాయి క్రిష్ణ బేంగిల్స్**

కెల్ల వీధి దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
సెల్ : 8121697356

మా వద్ద గాజులు, ఫ్యాన్సీ & జనరల్ వస్తువులు
హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును.





Director
S. MOHAN REDDY

**SUN SCHOOL**

(Recognised by the Govt. of A.P.)
Indira Nagar Colony,
Opp. Dougles High School,
SRIKAKULAM. Cell : 9440436478

**Nursery to X Class**
ENGLISH MEDIUM

**Hostel & Bus Facilities, Dancing, Music, Karate & Computer Education are Available**


Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Qr.No. 206/A, Sector-8, Ukkunagaram, Visakhapatnam-32 and Printed at M/s. UNITED POWER ENTERPRISES, D.No. 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka (P.O.), Visakhapatnam-26 and Published at Ukkunagaram, Visakhapatnam-32, Editor : V.V. POORNA CHANDRA RAO.